దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు.. పశ్చిమప్రాంత అభివృద్ధికి, ప్రజల భవిష్యత్‌కు భరోసా కలిగించనున్నాయి. అయితే వెలిగొండకు తాజా బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించక పోవడం, జిల్లా ఏర్పాటుపై ప్రభుత్వపరంగా చర్యలు ప్రారంభించకపోవడంతో ప్రజల్లో అనుమానాలు, అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర కీలక నేతలు ఆ రెండింటికీ కట్టుబడి ఉన్నట్లు పలుమార్లు ప్రకటించి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఐదున్నర నెలల అనంతరం జిల్లాకు ప్రత్యేకించి మార్కాపురానికి వస్తున్న సీఎం నుంచి మరింత స్పష్టత కోసం ఆ ప్రాంత ప్రజానీకం ఎదురుచూస్తోంది.






వెలిగొండ..
మార్కాపురం జిల్లా

ఆ రెండింటితోనే పశ్చిమప్రాంత అభివృద్ధికి భరోసా

ఒంగోలు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశ్చిమప్రాంతంలో దశాబ్దాలుగా ఉన్న సాగు, తాగునీటి ఇక్కట్లను తీర్చేది ఒక్క వెలిగొండ ప్రాజెక్టే అన్నది బహిరంగ సత్యం. దాదాపు మూడు దశాబ్దాలుగా ఆ ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం కీలక దశకు చేరింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టును సత్వరం పూర్తిచేయాలని ప్రజానీకం కోరుతోంది. సుమారు 53.58 టీఎంసీల సామర్థ్యం ఉండేలా రిజర్వాయర్‌ను నిర్మించి ప్రధానంగా జిల్లాతోపాటు నెల్లూరు, కడప జిల్లాలతో కలిపి మొత్తం 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించేలా ప్రతిపాదించిన ప్రాజెక్టుకు 1996 మార్చిలో నాడు సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. తర్వాత జలయజ్ఞంలో భాగంగా 2005లో పనులు ప్రారంభించారు. మూడేళ్లలో తొలిదశ పూర్తిచేసి లక్షా 10 వేల ఎకరాలకు, ఐదేళ్లలో మొత్తం ప్రాజెక్టు పూర్తిచేసి

మిగతా 6వ పేజీలో



ప్రభుత్వం నుంచి మరింత స్పష్టత కోరుతున్న ప్రజానీకం

- ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ, యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ నిర్మాణాలు, ఉపాధి ముఖ్యం
- నేడు మార్కాపురానికి సీఎం చంద్రబాబు
- మహిళా దినోత్సవ సభకు హాజరు
- కార్యకర్తలతో సమావేశం, అధికారులతో సమీక్ష
- శాఖలవారీ పురోగతిపై సిద్ధమైన నివేదిక

సీఎం పర్యటనకు భారీ ఏర్పాట్లు

- ఆరు గంటలపాటు వివిధ కార్యక్రమాలు
- పటిష్ట బందోబస్తు

6


పింఛన్‌దారుడిని విచారిస్తున్న వైద్య బృందం (ఫైల్)

బయటపడుతున్న అక్రమాలు

మంచానికి, వీల్‌చైర్‌కు పరిమితమైన పింఛన్‌దారుల్లోనూ భారీగా బోగస్

- ముగిసిన వైద్య బృందాల విచారణ
- ప్రభుత్వానికి చేరిన నివేదిక
- నేడో, రేపో అనర్హుల తొలగింపు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : హెల్త్ పింఛన్లలో జరిగిన అక్రమాలు బయటపడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఆరోగ్య పింఛన్లలో పలు అక్రమాలు జరిగాయని ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతోపాటు కలెక్టర్ నిర్వహించిన సమావేశాల్లో కూడా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు బోగస్‌లపై ఏకరువుపెట్టారు. దీంతో ప్రభుత్వం ఇక్కడ ఆరోగ్య పింఛన్లపై ఇతర జిల్లాలకు చెందిన వైద్య బృందాలతో విచారణ చేయించింది. వీల్‌చైర్, మంచానికి పరిమిత మైన పింఛన్ లబ్ధిదారులు జిల్లాలో 1,236 మంది ఉన్నారు. ఒక్కొక్కరు నెలకు రూ.15వేల చొప్పున తీసుకుంటున్నారు. ఈ పింఛన్లు పశ్చిమప్రాంత నియోజకవర్గాల్లో ఎక్కువగా

మిగతా 6వ పేజీలో

సీఎం పర్యటన షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు

- ఏర్పాట్లను పర్యవేక్షించిన సీఎంవో సమన్వయకర్త
- కిలో మీటర్ మేర రహదారి నిర్మాణం
- పోలీసుల ట్రయల్ రన్
- కార్యక్రమాలకు వేదికలు, హెలిప్యాడ్ సిద్ధం

టీడీపీ శ్రేణుల్లో జోష్

- మార్కాపురం వైపే అందరి దృష్టి
- చంద్రబాబుతో భేటీకి పోటీపడుతున్న కేడర్
- కార్యకర్తల సమావేశం ఏర్పాటుపై హర్షం
- పదవులు, పనుల కన్నా ఇదే గౌరవం అంటున్న తెలుగు తమ్ముళ్లు

7వ పేజీలో

వెలిగొండ.. మార్కాపురం జిల్లా

(5వ పేజీ తరువాయి)

మిగిలిన 3.28 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలన్నది లక్ష్యం. కాగా ఇంత వరకూ తొలిదశ కూడా పూర్తికాలేదు. కీలకమైన సమయంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం ప్రతిబంధకంగా మారింది. ప్రాజెక్టును పూర్తిచేయకుండానే గత ఎన్నికలకు ముందు జగన్ జాతికి అంకితం పేరుతో పైలాన్ ఆవిష్కరించి ఓట్ల కోసం ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేశారు. ఆ విషయం అలా ఉంచితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాకతో వెలిగొండపై ప్రజల్లో ఆశలు పెరిగాయి.

భారీగా నిధులు అవసరం

తాజా అంచనాల ప్రకారం రూ.9,500 కోట్లకు ప్రాజెక్టు వ్యయం చేరుకొంది. ఇప్పటి వరకూ దాదాపు రూ. 6వేల కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన వాటిలో తొలిదశ పూర్తికి రూ.1,400 కోట్లు, రెండో దశకు రూ.2,200 కోట్లు అవసరమని సమాచారం. మొత్తం నిధులలో రూ.1,300 కోట్ల వరకు నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాసానికి అవసరం. తొలిదశ పూర్తి చేసి 2026 జూన్‌కు నీరివ్వాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. ఆలోపు కనీసం రూ.800 కోట్లు నిర్వాసితులకు, మరో రూ.500 కోట్లు పనులకు అవసరం. అయితే తాజా బడ్జెట్‌లో రూ.309 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ పరిస్థితుల్లో నిధులు కేటాయింపు పెంచడంతోపాటు పెండింగ్ ఉన్న టన్నెల్, ఫీడర్ కెనాల్ పనులు, నిర్వాసితుల సమస్యల పరిష్కారం ద్వారా వెలిగొండ నీటిని వచ్చే ఏడాది జూన్‌కు ఇచ్చేలా భరోసాను ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

జిల్లా ఏర్పాటు ప్రధానాంశం

మార్కాపురం జిల్లా ఏర్పాటు కూడా ప్రధానాంశంగా ప్రజల్లో ఉంది. ఉమ్మడి జిల్లాలోనే మార్కాపురం ప్రాంత ప్రజలు జిల్లాకేంద్రమైన ఒంగోలుకు రావాలంటే అత్యధికులు 100 నుంచి 150 కి.మీ ప్రయాణం చేయాల్సి వచ్చి అవస్థలు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజన సమయంలో మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని ఆప్రాంత ప్రజలు కోరినా పట్టించుకోలేదు. హేతుబద్ధత లేకుండా జిల్లాల విభజన చేశారు. ఆ సమయంలో ఉద్యమించిన పశ్చిమప్రాంత ప్రజలకు టీడీపీ భరోసా ఇచ్చింది. మార్కాపురం కేంద్రంగా మార్కాపురం, వైపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి నియోజకవర్గాలు కలిపి కొత్త జిల్లా ఏర్పాటు చేస్తే రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిన జిల్లాగా మారనుంది. వెలిగొండ పూర్తిచేస్తే సాగు, తాగునీటికి ఢోకా ఉండదు. పలు జాతీయ రహదారులు, రెండు రైల్వేలైన్లు, పశ్చిమాన నల్లమల అడవి, అంతకు మించి విస్తారంగా ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండటంతోపాటు ప్రతిపాదిత దొనకొండ కారిడార్, కనిగిరి నిమ్జ్, తాజాగా ప్రకటించిన రిలయన్స్ బయో విద్యుత్ ప్లాంట్ ఆ పరిధిలోకి వస్తాయి.

దృష్టిపెట్టాల్సిన అంశాలు అనేకం..

ప్రస్తుతం జిల్లా మొత్తంగా ఉన్న పరిస్థితి, ప్రభుత్వం దృష్టిపెట్టాల్సిన అంశాలను పరిశీలిస్తే జిల్లాకు తలమానికమైన ఒంగోలు డెయిరీకి వైసీపీ ప్రభుత్వం సమాధి కట్టగా దానిని పునరుద్ధరించాలన్న డిమాండ్ పాడి రైతులలో ప్రధానంగా ఉంది. అలాగే గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరై శంకుస్థాపన చేసిన ఆంధ్రకేసరి యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీల నిర్మాణాల ఊసే వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోగా వాటిని నిర్మించాలని ప్రజానీకం, విద్యార్థులు కోరుతున్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఒంగోలు జాతి పశుసంపద రక్షణ కోసం ఏర్పాటు చేసిన చదలవాడ పశుక్షేత్రం అభివృద్ధి చేయాల్సి ఉంది. కనిగిరి నిమ్జ్, దొనకొండ కారిడార్‌లలో పరిశ్రమల ఏర్పాటుతోపాటు ఇతర ఉపాధి మార్గాలను పెంపును ప్రజానీకం ఆశిస్తోంది. శాశ్వతంగా తాగునీటి ఇక్కట్లు, సాగర్ ఆయకట్టులో నీటి సమస్య పరిష్కారంపై చర్యలను ప్రజలు కోరుతున్నారు.

గాడినపడని యంత్రాంగం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా జిల్లాలో యంత్రాంగం గాడిన పడలేదు. కలెక్టర్ తమీమ్ అన్సారియా తాను పనిచేస్తూ ఇతర శాఖల అధికారులను పరుగులెత్తిస్తున్నా ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు. కీలకమైన సహకార సంస్థలు గాడితప్పాయి. ఆ శాఖ అధికారులు నేటికీ వైసీపీ అనూకూల చర్యలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ శాఖ అధికారుల విషయంలోనూ, డ్వామాలో అడ్డగోలు దోపిడీకి బాధ్యులైన పూర్వ పీడీపై చర్యల విషయంలోనూ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న అసంతృప్తి జిల్లా ప్రజాప్రతినిధుల్లో ఉంది. ఇక జిల్లాలో వైద్య, విద్య, గ్రామీణ నీటి సరఫరా, జిల్లా పంచాయతీ, హౌసింగ్, జలవనరులు, స్త్రీశిశుసంక్షేమ శాఖలతోపాటు ప్రధానంగా రెవెన్యూ పనితీరు అధ్వానంగా ఉంది. ప్రభుత్వ ప్రాధాన్యతలు, స్థానిక ప్రజాప్రతినిధుల ఆకాంక్షలు ప్రకారం ఆయా శాఖలు లేవన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం జిల్లాకు వస్తున్న సీఎం కీలక అంశాలపై స్పష్టతతో ప్రజలకు భరోసా ఇవ్వడంతోపాటు యంత్రాంగానికి తగు ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీఎం పర్యటనకు భారీ ఏర్పాట్లు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ప్రభుత్వపరంగా నిర్వహించే కార్యక్రమానికి మార్కాపురం వేదికైంది. పట్టణ శివారులో సభ నిర్వహిస్తుండగా సీఎం చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. అనంతరం ఆయన పార్టీ కార్యకర్తల సమావేశంలోనూ, అధికారుల భేటీలోనూ పాల్గొంటారు. మొత్తం ఆరు గంటలపాటు అక్కడ సీఎం గడపనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమన్వయంతో భారీ ఏర్పాట్లు చేశారు. ఎస్పీ ఎఆర్.దామోదర్ నేతృత్వంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. కాగా సీఎం వస్తున్న నేపథ్యంలో జిల్లా అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగు, ఉపాధి అంశాలపై ఆయన స్పందించాలని ప్రజానీకం కోరుతోంది.. ప్రత్యేకించిన పర్యటన సాగనున్న పశ్చిమ ప్రజల్లో ఆ ప్రాంత అభివృద్ధి అంశాలపై భరోసా ఇవ్వాలన్న ఆకాంక్ష అధికంగా వినిపిస్తున్నది.

బయటపడుతున్న అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. అయితే లబ్ధిదారులకు ముందుగానే సచివాలయ ఉద్యోగుల ద్వారా నోటీసులు ఇచ్చి విచారణ చేశారు. ఆ సమయంలో 10 శాతం అందుబాటులో లేకపోగా మిగిలిన వారందరినీ వైద్యబృందాలు పరిశీలించాయి. పింఛన్ పొందేందుకు తీసుకున్న ధ్రువీకరణ పత్రాలతోపాటు వారి ప్రస్తుత పరిస్థితి ఏవిధంగా ఉందో స్వయంగా పరిశీలించి ఫొటోలను తీసుకొని ఆన్‌లైన్‌లో సెర్ప్‌కు పంపారు. అలా జిల్లావ్యాప్తంగా 1,236 మందిపై విచారణ చేయగా అనేక మంది అన్నీ బాగున్నా వీల్‌చైర్‌కే పరిమితమైనట్లు చూపి పింఛన్లు తీసుకుంటున్నట్లు గుర్తించారని సమాచారం. అలా జిల్లావ్యాప్తంగా 40శాతం మందికిపైగా నెలకు రూ.15 వేల చొప్పున ఒక్కొక్కరు పింఛన్లు తీసుకున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రప్రభుత్వనికి నివేదిక

జిల్లావ్యాప్తంగా విచారణ చేసిన వైద్య బృందాలు నివేదికలను డీఎంహెచ్‌వోకు అందజేశాయి. ఒక్కో పింఛన్‌దారుడికి సంబంధించిన సమగ్ర సమాచారం అందులో పొందుపర్చాయి. ఆయన కలెక్టర్‌కు అందజేయగా పరిశీలన అనంతరం ఆమె రాష్ట్రప్రభుత్వానికి పంపినట్లు సమాచారం. ప్రభుత్వం ఆ విచారణ నివేదికను పరిశీలించి అనర్హులను తొలగించి జిల్లాకు రెండు, మూడు రోజుల్లో ఆ జాబితాను పంపనున్నట్లు సమాచారం. దీంతో ఇప్పటివరకు అప్పనంగా నెలవారీ పింఛన్ పొందుతున్న వారిలో ఆందోళన నెలకొంది.

ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం

ఒంగోలు విద్య, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ జవాబుపత్రాల మూల్యాంకనం శుక్రవారం ఒంగోలులోని ఏకేవీకే జూనియర్ కళాశాలలో ప్రారంభమైందని ఆర్ఐవో సైమన్‌విక్టర్ తెలిపారు. సంస్కృతం సబ్జెక్టు జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభించారు. శనివారం స్క్రూటనైజర్లు స్పాట్‌కు హాజరు కావాలన్నారు. మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇతర సబ్జెక్టుల మూల్యాంకనం ఈనెల 17నుంచి ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు.

భౌభౌలతో బేంబేలు

- మూకుమ్మడి దాడులతో ప్రజల భయభ్రాంతులు
- గ్రామాల్లో పెరిగిపోయిన వీధి కుక్కలు
- ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా దర్శనం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



పర్చూరులోని బొమ్మల సెంటర్‌లో రాత్రి సమయాల్లో రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు

పర్చూరు, కారంచేడు, మార్చి7(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వీధి సింహాలతో(కుక్కలు)తో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మూకుమ్మడిగా దాడులకు పాల్పడటంతో ఉరుకులు పరుగులు పెడుతున్నారు. వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వీధుల్లో ఒంటరిగా రాపోకలు సాగించాలంటే కుక్కల దాడికి గురికావాల్సి వస్తుందన్న చందాన పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూచినా వీధి సింహాలు గుంపులు గుంపులుగా దర్శనమివ్వటం ఇందుకు నిదర్శనం. గడిచిన పక్షం రోజుల్లో అనేక మంది వీధి సింహాల బారిన పడి ఆసుపత్రి పాలయ్యారు. పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు మండలాల పరిధిలో సమస్య మరింత జటిలంగా మారింది..

వాహనదారులు ఉరుకుల పరుగులు

వీధుల్లో ద్విచక్రవాహనాలు ప్రయాణించాలంటే హడలే అన్న చందాన పరిస్థితి ఉంది. ద్విచక్రవాహన దారులను వెంబడించి కరుస్తుండటంతో వాహనం అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు పర్చూరు - ఉప్పుటూరు, చెరుకూరు గ్రామ రహదారుల్లో అనేకం చోటుచేసుకున్నాయి. స్థానిక వైఆర్ హైస్కూల్ సమీపంలో ఇటీవల వీధి సింహాలు ద్విచక్రవాహన దారుని వెంట పడటంతో తప్పించుకునే క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం అయి ప్రాణాలు కోల్పోయాడు. పర్చూరు పరిధిలోని ఓ రెవెన్యూ అధికారి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెంటబడటంతో తప్పించుకోబోయి వాహనం అదుపుతప్పి అసుపత్రిపాలయ్యారు. పర్చూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన ఓవృద్ధురాలు రోడ్డుపై వస్తున్న తరుణంలో వీధి సింహాలు దాడిచేసి తీవ్రంగా గాయపరచటంతో అసుపత్రిపాలైంది. ఇలాంటి సంఘటలు మండలంలో అనేకం ఉన్నాయి. వీధి శునకాల దాడులతో చిన్నారులు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. పర్చూరులోని ఇందిరా కాలనీ, అంబేడ్కర్ నగర్, జయంతీ కాలనీలలతోపాటు, కారంచేడు మండలంలోని జరుబులవారిపాలెం, తిమిడితపాడు, దగ్గుబాడు, స్వర్ణ గ్రామాల్లో గేదెదూడలు వీధి శునకాల బారినపడి ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు అనేకం ఇటీవల ఉన్నాయి.



పర్చూరు - ఇంకొల్లు రోడ్డులో విచ్చలవిడిగా తిరుగుతున్న శునకాల గుంపు

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

వీధి సింహాలు బారిన పడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే అధికారులే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా ఇది తమ పనికాదన్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

రేబిస్ ఇంజెక్షన్ కూడా అంతంత మాత్రమే

వీధి సింహాల బారిన పడి గాయాలతో ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లినా రేబిస్ వ్యాక్సిన్ అంతంతమాత్రంగానే ఉందని ప్రజలు అంటున్నారు. దీంతో గత్యంతరం లేక ప్రయివేట్ వైద్యశాలకు వెళ్లాల్సి వస్తుంది. మరో పక్క ఏది మంచికుక్కో పిచ్చికుక్కో అర్థం కాక కుక్కల దాడిలో గాయపడిన వారు ఆందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు ఇటీవల చీరాలలో ర్యాబీస్ వ్యాధి కలకలం రేపిన తరుణంలో ప్రజల్లో మరింత ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వీధి సింహాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కల దాడిలో 12 గొర్రెపిల్లల మృతి

మార్టూరు, మార్చి7(ఆంధ్రజ్యోతి):మండలంలోని ద్రోణాదుల గ్రామంలో రాగినీడి గంగయ్యకు చెందిన కొష్టంలో ఉన్న గొర్రెపిల్లలపై గురువారం అర్థరాత్రి వీధికుక్కల మంద దాడి చేసింది.ఈ దాడిలో 12 గొర్రెపిల్లలు మృతి చెందాయి. దాదాపుగా లక్ష రూపాయలు నష్టం జరిగిందని గంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలో కుక్కల బెడద ఎ క్కువగా ఉందని, రోజూ కొష్టంలో రాత్రి సమయంలో గొర్రెలు నిద్రిస్తూ ఉంటాయని,అడపా దడపా కుక్కలు వస్తుంటాయని కానీ, ఈ విధంగా గొర్రెపిల్లలను చంపుతాయని అనుకోలేదని, వాపోయారు. ఇకనైనా గ్రామంలో కు క్కల బెడదను తొలగించాలని పంచాయతీ అధికారులను కోరారు.

అవమానాల నుంచి ఆత్మస్థైర్యంతో ముందుకు..



మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

మహిళా దినోత్సవంలో వక్తలు

చీరాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం సమాజంలో ఎంతో మంది మహిళలు అవమానాలు ఎదుర్కొని ఆత్మస్థైర్యంతో విజయాలు సాధిస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. చీరాల నియోజకవర్గం పరిధిలో శుక్రవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈక్రమంలో సమాజంలో అబల విలువలు తెలియజేశారు. చీరాల సీఈసీ కళాశాలలో డీఎస్పీ ఎండీ మొయిన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో సీఐ శేషగిరిరావు, ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి, ఈసందర్భంగా ప్రతినిధులు ఉపాధ్యాయినులకు ఆట, పాటల పోటీలు నిర్వహించారు. స్థానిక వైఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలు జరిగాయి. అలాగే బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పేరాల ఆర్యవైశ్య కల్యాణ మండపంలోనూ జరిగాయి.

మహిళలు అన్ని రంగాలలో ఉన్నతంగా ఎదగాలి

పంగులూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి):సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు అన్ని రంగాలలో ఉన్నతంగా ఎదగాలని మండల తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళాదినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ సింగారావు మట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందించడంతో పాటు బాలికలను బాల్యం నుంచే చదువు, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు బాలికలను ఉన్నతంగా చదివించి వారి ఎదుగుదలకు తల్లిదండ్రులు తగిన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. సాంకేతికతను అందిపుచ్చుకుని వివిధ రంగాలలో ఎదుగుతున్న మహిళలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపరాణి, గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రంను అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అధికారులు, ఉపాధ్యాయినులకు సన్మానం

అద్దంకిటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని శుక్రవారం పలు శాఖలు, కళాశాలలు, పాఠశాలలలో ఘనంగా నిర్వహించారు. మహిళ దినోత్సవం శనివారం రావడంతో పాటు ఆరోజు సెలవు అయినందున ముందస్తుగా ఆయా ప్రభుత్వ శాఖలు, విద్యా సంస్థలలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఐసీడీఎస్ అద్దంకి రూరల్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఏ. కృష్ణకుమారి,ఉత్తమ ఉపాధ్యాయులు కె. రామలక్ష్మి, ఎస్. నాగమల్లిక, ఏపీవో గాయత్రిదేవిలను ఘనంగా సన్మానించారు. అలాగే మండలంలోని మైలవరం జడ్పీహెచ్‌ఎస్‌లో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళ ఉపాధ్యాయినులు వి. వెంకటలక్ష్మి, పద్మావతి, పీడీ లావణ్యలను ఘనంగా సత్కరించారు. జడ్పీ హెచ్‌ఎస్ చక్రాయపాలెంలో హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయినులు పూనూరి జ్యోతి నిర్మల, కుంచాల విజయలక్ష్మిలను ఘనంగా సత్కరించారు.



పందిళ్లపల్లి హైస్కూల్లో టీచర్లకు నిర్వహిస్తున్న మెమరీ గేమ్

స్థలం వివాదంలో పెట్రోల్‌తో దాడి

- ఇరువురికి తీవ్రగాయాలు
- చికిత్సపొందుతూ యువకుడు మృతి
- మరొకరి పరిస్థితి విషమం

పెద్దదోర్నాల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సెంటున్నర స్థలం దాయాదుల మధ్య చిచ్చుపెట్టింది. చలిమంట కాచుకుంటున్న సమయంలో వెనకగా వచ్చిన ప్రత్యర్థులు ఇద్దరిపై పెట్రోల్‌తో దాడి చేశారు. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా మారింది. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలోని పెద్దబొమ్మలాపురం తూర్పుపల్లెలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దూదేకుల నాగూర్ వలి (24), దూదేకుల కాశింపీరాలు దాయాదులు కాగా వారికి పెద్దల నుంచి సెంటున్నర స్థలం వారసత్వంగా లభించింది. అయితే ఆ స్థలం తమదంటే తమదని ఇరు కుటుంబాల వారు గొడవ పడేవారు. వివాదంపై పలుమార్లు గ్రామపెద్దలు పంచాయితీలు చేశారు. కాగా గురువారం వాదోపవాదాలు పెద్దవ య్యాయి. ఈ సమస్య ను పరిష్కరించేందుకు గుంటూరు నుంచి నాగూర్‌వలి పెద్దమ్మ నూర్‌జాన్‌బీ కూడా పెద్ద బొమ్మలాపురం గ్రామానికి వచ్చింది. శుక్రవారం వేకువజామునే లేచి నాగూర్‌వలి, ఆయన పెద్దమ్మ నూర్‌జాన్‌బీలు చలిమంట వేసుకుని కూర్చొని ఉన్నారు. ఈ సమయంలో ఒక్కసారిగా కాశింపీరా కుటుంబ సభ్యులు వారిపై వెనక నుంచి పెట్రోలు పోశారు. దీంతో చలిమంట ఉవ్వెత్తున లేచి నాగూర్‌వలి, నూర్‌జాన్‌బీకి మంటలు అంటుకున్నాయి. గమనించిన గ్రామస్థులు మంటలను అదుపు చేసి 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. అక్కడ నాగుర్‌వలి పరిస్థితి విషమించడంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మృతిచెందాడు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు. నూరజాన్‌బీకి తీవ్రగాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహేశ్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



నాగూర్ వలి(ఫైల్)

పశువుల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- డీఏహెచ్‌వో బేబీరాణి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తమ పశువులకు పోషకులు బీమా చేయించుకోవాలని పశుసంవర్థకశాఖ జిల్లా అధికారి (డీఏహెచ్‌వో) డాక్టర్ బేబీరాణి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పశుపోషకుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. ఒకసారి బీమా ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల వరకు వర్తించేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. జిల్లాకు మొదటి విడతలో రూ.18లక్షల రాయితీని గత ఏడాది ఆగస్టులోనే ప్రభుత్వం విడుదల చేయగా ప్రస్తుతం రూ.16 లక్షలు విడుదల చేసిందన్నారు. బీమా చేయించుకోవడం ద్వారా పశువులు మృత్యువాత పడిన సమయంలో పరిహారం అందుతుందని తెలిపారు. జిల్లాలో తెల్లపశువులు 56,332, నల్లపశువులు 6,71,812, గొర్రెలు 15,67,122, మేకలు 4,17,589 ఉన్నాయని పేర్కొన్నారు. ఒకొక్క పశువుకు రూ.15వేలకు రూ.960 ప్రీమియం ఉండగా ప్రభుత్వ వాటా రూ.768, రైతు వాటా రూ.192 చెల్లించాలన్నారు. రూ.30వేల బీమాకు ప్రీమియం రూ.1,920 ఉండగా ప్రభుత్వవాటా రూ.1,536, రైతు వాటా రూ.384, గేదెలు, మేకలు ప్రీమియం రూ.375 ఉండగా ప్రభుత్వ వాటా రూ.300, రైతు వాటా రూ.75 చె ల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులందరూ ఈ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జిల్లా సమగ్రాభివృద్ధిపై సీఎం స్పష్టత ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు
- నేటి నుంచి ప్రజా చైతన్యయాత్రలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్యభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా వెలిగొండ ప్రాజెక్టు, జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించ లేదన్నారు. జిల్లాకు అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టుపై గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ళలో పూర్తి చేస్తామని ప్రకటించినా ఇంత వరకు పట్టించుకోలేదని, నిన్నటి బడ్జెట్‌లో కేవలం రూ.359 కోట్లు మాత్రమే కేటాయించారని ఆరోపించారు. ఈ కేటాయింపులతో మరో పదేళ్లకైనా ఏళ్లకైనా ప్రాజెక్టు పూర్తఅవుతుందా అని ప్రశ్నించారు. జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా ప్రకటించిన కేంద్రం ఆ మేరకు నిధులు కేటాయించకపోవడం దారుణంగా ఉందన్నారు. జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం నుంచి ఈనెల 17వతేదీ వరకు ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20న మార్కాపురం, కనిగిరి ఆర్డీవో కార్యాలయాల వద్ద, కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ-2025 పరీక్షలకు హాజరయ్యే జిల్లాకు చెందిన అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన శిక్షణ అందిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ అధికారి ఎం.అంజల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, ఈబీసీ అభ్యర్థులకు అందించే శిక్షణలో చేరేందుకు ఈనెల 10వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే టెట్ తప్పనిసరిగా అర్హత సాధించి ఉండాలని, అర్హులైన వారు తమ టెట్ మార్కులిస్ట్, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలతోపాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తమ దరఖాస్తులను స్థానిక ప్రకాశంభవనం ఎదురుగల ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్స్ (పాత రిమ్స్)లోని ఏపీబీసీ స్టడీ సర్కిల్‌లో అందజేయాలని, వివరాలకు సెల్ : 9989285530, 8985090926 నంబర్ల ద్వారా తెలుసుకోవాలని ఆమె కోరారు

త్వరలో ఓఎన్‌జీసీ సర్వే

ఇంకొల్లు,మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు మండల పరిధిలోని పలు గ్రామాలలో భూమిలోపల నిక్షిప్తమైన గనులు, ఆయిల్ వంటి వాటిపై సర్వేలు నిర్వహించేందుకు తహసీల్దార్ వెంకటరత్నంను శుక్రవారం ఓఎన్‌జీసీ అధికారులు కలిశారు. ఆరు నెలల పాటు మంగళగిరి నుంచి నాయుడుపేట వరకు ఈ సర్వే కొనసాగుతుందని, మండలంలో నాగండ్ల, పావులూరు, గంగవరం, ఇడుపులపాడు, భీమవరం, కొణికి గ్రామాల పరిధిలో ఈ సర్వేలు నిర్వహించనున్నట్లు ఆయన దృష్టి తీసుకెళ్లారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఓఎన్‌జీసీ సూపర్‌వైజర్లు దాసరి భరత్‌కుమార్, డీకే దీపక్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రమాద బీమా చెక్కులు పంపిణీ

బల్లికురవ. మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన పూసుకూరి హరిబాబు అను రైతు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ రైతు బల్లికురవ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవన జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనలో చేరి ఉన్నాడు. రెండు పథకాల్లో సభ్యుడు అయిన హరిబాబుకు రూ. నాలుగు లక్షల బీమా నగదు మంజూరు కావటంతో శుక్రవారం ఏపీజీబీ బ్యాంకు చీప్ మేనేజర్ సీనానాయక్ మృతుడు భార్య సునీతకు చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో రుణాలు తీసుకొన్న రైతులు తప్పనిసరిగా బీమా పథకంలో నమోదు కావాలని అన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

మార్టూరు, మార్చి7 (ఆంధ్రజ్యోతి):పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన బాలికలు రోజూ బడికి రావడానికి సైకిళ్లను పంపిణీ చేసిన ఎఫర్ట్ సంస్థ పలువురికి ఆదర్శంగా నిలిచిందని ఎంఈవో వస్రాం నాయక్ అన్నారు. శుక్రవారం మార్టూరు జడ్పీ హైస్కూల్లో ఎఫర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏకం అమెరికా సంస్థ ఆర్థిక సహకారంలో చేయూత ప్రాజెక్ట్ ద్వారా 50 మంది బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో దూరప్రాంతాల నుంచి బడికి వచ్చే బాలికల కోసం ఏకం సంస్థ సైకిళ్ల పంపిణీకి రూప కల్పన చేసిందన్నారు. గతంలోనే 50 సైకిళ్లను పంపిణీ చేయగా ప్రస్తుతం మరో 50 సైకిళ్లను పంపిణీ చేశామన్నారు.

నాలుగు ఎకరాల్లో సుబాబుల్ తోట దగ్ధం



కాలిపోయిన సుబాబుల్ తోట

బల్లికురవ. మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ప్రమాదవశాత్తు నాలుగు ఎకరాల్లోని సుబాబుల్ తోటలు శుక్రవారం అగ్నికి అహుతి అయ్యాయి. ఉప్పుమాగులూరు నుంచి కొణిదెన వైపు వచ్చే రోడ్డు పక్కన ఉన్న అమరనేని భార్గవ్, అయినాల యేగేశ్వరరావు, దేవినేని చౌదరయ్య అను రైతులకు చెందిన నాలుగు ఎకరాల సుబాబుల్ తోటలలో మంటలు చెలరేగి పంట మెత్తం పూర్తిగా కాలిపోయింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి రోడ్డు పక్కన పడవేయటం వలనే ప్రమాదం జరిగి ఉంటుందని రైతులు అంటున్నారు. సుమారు నాలుగు లక్షల మేర నష్టం జరిగిందని బాధిత రైతులు తెలిపారు.

టీడీపీ శ్రేణుల్లో జోష్

- అందరి దృష్టంతా మార్కాపురం వైపే
- బాబుతో భేటీకి పోటీపడుతున్న కేడర్
- కార్యకర్తల సమావేశం ఏర్పాటుపై హర్షం
- పదవులు, పనుల కన్నా ఇదే గౌరవం అంటున్న 'తమ్ముళ్లు'

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మార్కాపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా పార్టీ కార్యకర్తలతో సమావేశం కావటం ఆ పార్టీశ్రేణుల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. యావత్తు రాజకీయ నాయకులు ప్రత్యేక దృష్టితో ఆ వైపు చూస్తున్నారు. ఒక సీఎంగా రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రావటంతోపాటు తర్వాత పార్టీ కార్యకర్తలతో ప్రత్యేకంగా భేటీ కాబోతుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇది కార్యకర్తలను గౌరవించటమేనని యావత్తూ రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతుండగా వారితో ఏమి మాట్లాడతారు, ఎలాంటి భరోసా ఇస్తారు, వారి బాధలను వింటారా లేదా అనే అంశాలపై అందరూ దృష్టిసారించారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ప్రభుత్వపరంగా కార్యక్రమాన్ని మార్కాపురం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి సుమారు 3 గంటలు సమయాన్ని ఆ కార్యక్రమానికి కేటాయించారు. తొలుత స్టాల్స్‌ను చూడటంతోపాటు మహిళా సంక్షేమానికి సంబంధించిన కొన్ని కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ప్రతి నియోజకవర్గంలో మహిళలకు కుట్టుశిక్షణ కేంద్రాల నిర్వహణ కార్యక్రమాన్ని అధికారికంగా అక్కడే ప్రారంభిస్తారు. ఆ తర్వాత మహిళలు మాట్లాడేందుకు 45 నిమిషాలు సమయం కేటాయించారు. కలెక్టరు, ఇతర మహిళా మంత్రులు, సీఎం మాట్లాడేందుకు మరో 45 నిమిషాలకుపైగా సమయం కేటాయించారు. అంతటితో ఆ కార్యక్రమం ముగుస్తుంది, వెంటనే సీఎం వెళ్లిపోతారని అందరూ భావించారు. అయితే ఆయన అక్కడికి సమీపంలో పార్టీ అధ్యక్షుడిగా కార్యకర్తలను కలిసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం ఈసారి ప్రత్యేకం. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆయన నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి నియోజకవర్గస్థాయి వరకు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన, పనిచేస్తున్న పార్టీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, సభ్యత్వం ఉన్న వారిలో ముఖ్య కార్యకర్తలతో భేటీ కాబోతున్నారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 500 మందిని ఆ సమావేశానికి ఆహ్వానిస్తున్నారు. సమావేశానికి కూడా సుమారు 2గంటల సమయాన్ని ఆయన కేటాయించారు. అక్కడే జిల్లాలోని పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులను కూడా కలుస్తారు. కొందరు కార్యకర్తలు చెప్పేది వింటారు. ప్రభుత్వం, పార్టీపరంగా కార్యకర్తలకు ఏమి చేస్తున్నారు, ఏమి చేయబోతున్నారు అనే విషయాన్ని వివరిస్తారని భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కిందిస్థాయిలో నామినేటెడ్ పదవుల భర్తీకి రంగం సిద్ధమవుతోంది. సింగిల్‌విండోలు, దేవస్థానాలు, మార్కెట్ కమిటీలు, జిల్లాస్థాయిలో సెంట్రల్ బ్యాంకుతోపాటు అనేక రకాల నామినేటెడ్ పదవులను భర్తీచేసే ప్రక్రియకు ఆ పార్టీ శ్రీకారం పలికింది. ఆయా పదవుల్లో వైసీపీ ప్రభుత్వ కాలంలో పార్టీ పదవుల్లో ఏదో స్థాయిలో పనిచేసిన వారికే ప్రాధాన్యమివ్వాలని ఇప్పటికే టీడీపీలో నిర్ణయించారు. అందుకనుగుణంగా కొత్తగా పార్టీలోకి వచ్చిన వారిని పదవులకు ఎమ్మెల్యేలు సిఫార్సు చేసినా వెనక్కు పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో వలే కాకుండా చంద్రబాబు జిల్లాలకు వచ్చినప్పుడు ప్రభుత్వ పనులతోపాటు పార్టీ కార్యకర్తలతో భేటీ కావటం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకోవటంతోపాటు ఆ కార్యక్రమంలో ఆయన ఏమి చెబుతారు, ఎలా వ్యవహరిస్తారు అన్న విషయాలపై ఆసక్తి రేకెత్తిస్తోంది.



సభాప్రాంగణం ఏర్పాట్లు

లక్‌పతిదీదీ మహిళలకు సన్మానం

- పొదుపు సంఘాలకు రూ.2వేల కోట్ల రుణాలు
- లక్ష మంది మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ ప్రారంభం
- మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు ముఖ్యమంత్రితో ముఖాముఖి

ఒంగోలు నగరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి దిశగా పరుగులు పెడుతున్న రాష్ట్రంలోని 200 మంది మహిళా వ్యాపారవేత్తలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సన్మానించనున్నారు. శనివారం మార్కాపురంలో జరిగే సభలో ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ వంటి పథకాల ద్వారా రుణాలు తీసుకుని వ్యాపారాలను విజయవంతంగా నిర్వహిస్తూ వ్యాపారవేత్తలుగా ఎదిగిన 200 మంది మహిళలను సీఎం సన్మానిస్తారు.

పొదుపు సంఘాలకు రూ.2 వేల కోట్ల రుణాలు

మార్కాపురంలో శనివారం జరిగే బహిరంగ సభలో రాష్ట్రంలోని పొదుపు సంఘాల మహిళలకు రూ.2 వేల కోట్ల రుణాలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేయనున్నారు. వీరంతా ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యాపారాలను ప్రారంభించి ఉత్తమ వ్యాపారవేత్తలుగా ఎదగాలని ప్రభుత్వం వీరికి వివిధ పథకాల కింద రూ.2 వేల కోట్ల రుణాలను అందించనుంది. రుణాలు అందజేయటంతోపాటు వారు స్వయం ఉపాధితో రకరకాల ఉత్పత్తులను సులువుగా మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా ఫ్లిప్‌కార్ట్ వంటి కంపెనీలతో ఎంఓయూ చేసుకోనున్నారు.

లక్ష మందికి ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

రాష్ట్రంలోని మహిళలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే దిశగా లక్ష మందికి ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా మార్కాపురంలో ప్రారంభించనున్నారు. ఇందుకుగాను రూ.224 కోట్లు ఖర్చు చేయనుంది. 90 రోజులపాటు జరిగే ఈ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనుంది. కుట్టుమిషన్ల పంపిణీ సందర్భంగా ముఖ్యమంత్రితో మహిళల ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఆరు గంటలపాటు మార్కాపురంలోనే సీఎం

మార్కాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ముందుగా ప్రకటించిన విధంగా కాకుండా ముఖ్యమంత్రి కార్యక్రమ వేళలు మారాయి. తొలుత ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కార్యక్రమాల్లో కొనసాగుతారని ప్రకటించారు. ప్రస్తుతం మారిన సమయం మేరకు ఉదయం 11.00 గంటలకు మార్కాపురం చేరుకునే ముఖ్యమంత్రి సాయంత్రం 5.00 గంటల వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 10.30 గంటలకు విజయవాడ నుంచి హెలికాప్టర్‌లో పలువురు మహిళా మంత్రులతో పాటు బయలుదేరుతారు. 11.00 గంటలకు కొండేపల్లి రోడ్డులోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 11.00 గంటల నుంచి 11.30 వరకు ముఖ్య అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతారు. ఉదయం 11.37 గంటలకు కాన్వాయ్ ద్వారా సాయిబాలాజీ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన సభావేదిక వద్దకు చేరుకుంటారు. 11.37 నుంచి 12.35 వరకు పలుశాఖల మహిళలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలన, పలు ఒప్పందాలు, రుణాల పంపిణీ, పలు పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి. మధ్యాహ్నం 12.35 గంటల నుంచి 1.15 గంటల వరకు లంచ్ బ్రేక్ ఉంటుంది. 1.15 నుంచి 2.45 వరకు మహిళలతో ఏర్పాటు చేసిన సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.50 గంటల నుంచి సాయంత్రం 4.20 గంటల వరకు అల్లూరి పోలేరమ్మ దేవస్థానం ఎదురుగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద కార్యకర్తలతో మాట్లాడుతారు. సాయంత్రం 4.20 గంటల నుంచి 4.52 వరకు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 5.00 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుని హెలికాప్టర్‌లో విజయవాడ చేరుకుంటారు. మొత్తం ఆరు గంటలపాటు మార్కాపురంలో వివిధ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి

- పర్యవేక్షించిన సీఎంవో సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్
- కిలోమీటర్ మేర నూతన రహదారి ఏర్పాటు
- మహిళా దినోత్సవ, కార్యకర్తల సభలు, హెలిప్యాడ్ సిద్ధం

మార్కాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్కాపురం రానున్న నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రానికి సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ ఉదయం నుంచి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహిళలతో జరుగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు, స్టాల్స్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా రెవెన్యూ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. హెలిప్యాడ్ చుట్టూ భారీఎత్తున బారికేడ్లను ఏర్పాటు చేశారు. అక్కడ ఎల్-1, ఎల్-2 క్యూలను ఏర్పాటు చేయించారు. ఎల్-1లో ప్రధానంగా జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఎల్-2లో మహిళలకు మాత్రమే అవకాశం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం హెలికాప్టర్‌తో ట్రయల్ రన్ చేయించారు. సీఎం కాన్వాయ్ హెలిప్యాడ్ నుంచి మహిళా దినోత్సవ సభ, కార్యకర్తల సభల వద్దకు ట్రయల్‌రన్ నిర్వహించారు. ముఖ్యంగా గురువారం సాయంత్రం నుంచి పూలసుబ్బయ్య కాలనీ చివరి నుంచి అల్లూరి పోలేరమ్మ దాటిన తర్వాత హెలిప్యాడ్ వరకు బీటీ రహదారిని యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేశారు. పెద్దపాటి గోతులను, సైడ్‌బర్మ్‌లను పూర్తిగా చదును చేయించారు. ఆయా పనులను స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అర్ధరాత్రి వరకు దగ్గరుండి పర్యవేక్షించారు. మహిళా దినత్సోవ వేదిక వద్ద మహిళలకు మధ్యాహ్నం ఆహార పదార్థాలను బాక్స్‌లలో అందించేందుకు సిద్ధం చేస్తున్నారు. కార్యకర్తల సమావేశానికి హాజరయ్యే వారికి ప్రత్యేకంగా సభకు సమీపంలోనే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. ఏర్పాట్ల పర్యవేక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డీఎస్పీ యు.నాగరాజు, జిల్లా, డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్, ఎస్పీలకు సభావేదిక వద్ద సూచనలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్

టెన్త్ విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

ఒంగోలు విద్య, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 17 నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. ఈమేరకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఆర్టీసీ యజమాన్యం కూడా అధికారులు, సిబ్బందికి ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆర్టీసీ పాస్‌లు లేకపోయినా విద్యార్థులు హాల్ టిక్కెట్లు చూపించి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చు. విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేందుకు పరీక్షా కేంద్రం నుంచి ఇంటికి చేరుకోనేందుకు మాత్రమే అధికారులు ఈ సౌలభ్యం కల్పించారు. పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో మాత్రమే వీరిని అనుమతిస్తారు. ప్రభుత్వసెలవు దినమైన పరీక్ష ఉంటే విద్యార్థులు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతిస్తారు.

ఎమ్మార్సీలకు చేరిన టెన్త్ పరీక్షల సామగ్రి

ఒంగోలు విద్య, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 17 నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల సామగ్రి మండలాల్లోని మండల విద్యావనరుల కేంద్రాలకు చేరింది. పరీక్షల్లో ఉపయోగించే 24 పేజీల మెయిన్ బుక్‌లెట్, 12 పేజీల అదనపు బుక్‌లెట్, గణితంలో ఉపయోగించే గ్రాఫ్‌లు ఎంఆర్సీలకు చేరాయి. ఆయా మండలాల్లోని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరిటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు ఎంఆర్సీలకు వెళ్లి తమ పరీక్షా కేంద్రాలకు సంబంధించిన సామగ్రిని తీసుకెళ్లాలి. 12, 13 తేదీల్లో ప్రశ్నపత్రాలు వస్తున్నందున వాటిని పోలీస్‌స్టేషన్లలో భద్రపర్చేందుకు ట్రంకుపెట్టెలతో చీఫ్‌లు, డీవోలు సిద్ధంగా ఉండాలని డీఈవో కిరణ్‌కుమార్ ఆదేశించారు.

ఇంటర్ పరీక్షల్లో ఒకరు డీబార్

ఒంగోలు విద్య, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో శుక్రవారం కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఒక విద్యార్థినిని పట్టుకొని డీబార్ చేసినట్లు ఇంటర్మీడియేట్ బోర్డు ఆర్ఐవో సైమన్‌విక్టర్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణితం-2, బోటనీ2, సివిక్స్2 పరీక్ష జరిగింది. తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న అదే కళాశాల విద్యార్థి కాపీయింగ్ చేస్తూ స్క్వాడ్ అధికారులకు పట్టుబడటంతో ఆ విద్యార్థినిని డీబార్ చేశారు. పరీక్షకు 19614 మందికిగాను 18796 మది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 17013 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1783 మంది హాజరు కాగా జనరల్‌లో 653 మంది, ఒకేషనల్‌లో 165 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఆర్ఐవో ఏడు, డీఈసీ, డీఐఈవోలు 17, స్క్వాడ్ అధికారులు 32 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆర్ఐవో తెలిపారు.

మహిళలు సమస్యలను ధైర్యంగా చెప్పాలి

- డీజే చారిటబుల్ ట్రస్టు ఎండీ నాగసత్యలత
- ముగిసిన మహిళా ఉద్యోగుల ఆటల పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ సమస్యలను ధైర్యం చెప్పే తత్వాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సతీమణి, డీజే చారిటబుల్ ట్రస్టు ఎండీ నాగసత్యలత కోరారు. ఏపీఎన్‌జీవో సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకల కార్యక్రమం శుక్రవారం రాత్రి స్థానిక ఎన్‌జీవో భవన్‌లో జరిగింది. మహిళావిభాగం చైర్మన్ కుంచాల కోటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన నాగసత్యలత మాట్లాడుతూ మహిళా ఉద్యోగులందరూ ఒక చోటకు చేరి వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగులకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అండగా ఉంటారని చెప్పారు. ఉప రవాణాశాఖ అధికారి ఆర్.సుశీల మాట్లాడుతూ ప్రతి మగవారి వెనుక మహిళా ఎలా ఉంటుందో, అలానే మహిళ వెనుక ఒక పురుషుడు ఉంటాడని తెలిపారు. కాగా గత రెండు రోజుల నుంచి మహిళా ఉద్యోగులకు నిర్వహించిన వక్తృత్వ, స్కిప్పింగ్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్‌చైర్స్, పాటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం దామచర్ల నాగసత్యలతో పాటు పలువురు ముఖ్యఅతిథులు, మహిళావిభాగం ముఖ్యనేతలను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శరత్‌బాబు, ఆర్‌సీహెచ్.కృష్ణారెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ మాధవి, నాయకులు ఏడుకొండలు, శివకుమార్, కొత్తపల్లి మంజేష్, ముగ్దుం షరీఫ్, రత్నరాణి, నారాయణమ్మ, షమ్మి, కృష్ణవేణి, రాజేశ్వరి, జ్యోతి. లావణ్య, అలేఖ్య, జయమ్మ, కళావతి, ప్రణతి, అశ్విని, అంజనీదేవి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



నాగసత్యలతను సత్కరిస్తున్న మహిళా ఉద్యోగులు

10 నుంచి బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

సంతనూతలపాడు, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంకవద్ద మహిళా ప్రాంగణంలో నిరుద్యోగ మహిళలకు ఈనెల 10వ తేదీ నుంచి బ్యూటీషియన్ కోర్సు, జనరల్ డ్యూటీ నర్స్ కోర్సులకు ఉచితంగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా మేనేజర్ వై.అంజమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 15-45 సంవత్సరాల వయస్సుగల నిరుద్యోగ మహిళలు రెండు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ తీసుకుని మహిళా ప్రాంగణంలో పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు సెల్. 8333921346లో సంప్రదించాలని కోరారు.

శ్రమిస్తూ.. రాణిస్తూ..

- అన్ని రంగాల్లో ఎదుగుతున్న వనితలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



'ఆడదంటే వంటింటి కుందేలు' అనే పురుషాధిక్య భావజాలాన్ని పటాపంచలు చేస్తూ మహిళలు అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నారు. మారుతున్న ఆధునిక యుగంతో పాటు సమాజం కూడా వారి అవసరాలను గుర్తిస్తోంది. వ్యాపార రంగాల్లో కూడా రాణిస్తున్నారు. సమాజంలో మంచి గుర్తింపు పొందుతున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అలాంటి మహిళల మనోగతం తెలుసుకుందాం.

- చీరాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి)

చాలా సమస్యలు ఎదుర్కొన్నాను

నాన్న నా చిన్న వయసులోనే మృతిచెందారు. మేం ఐదుగురు సంతానం. నిరుపేద కుటుంబం కావడంతో అమ్మ చాలా కష్టాలు పడ్డారు. ఈక్రమంలో తప్పని పరిస్థితుల్లో పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది. అయినా లక్ష్యం వదల్లేదు. భర్త రవి మంచి తోడ్పాటు అందించారు. దీంతో ఉన్నతంగా చదివి 2018లో పోలీసు కొలువు సాధించాను. పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలు స్టేషన్‌లలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాను. అవార్డులు సాధించాను. కష్టపడితే ఏదైనా సాధ్యమే.



- గారపాటి రాజ్యలక్ష్మి, ఎస్సై వన్‌టౌన్



వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అనిత (ఫైల్)

ప్లాస్టిక్‌పై యుద్ధం చేసి.. జాతీయ అవార్డులు సాధించి..

నాపేరు అనిత బూదరాజు చవాలి. సొంతూరు చీరాల. నేను పేరాల - చీరాల ఉద్యమంలో పోరాటం చేసిన యోధులు బూదరాజు వాసుదేవ మూర్తి మనువరాలిని. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో ప్లాస్టిక్ మహమ్మారితో మనుషులు విపరీతంగా మృత్యువాత పడటం గ్రహించాను. నోరులేని మూగజీవాలు, ఆవులు సైతం ప్రాణాలు కోల్పోతుండటం గమనించాను. ఎక్కడా భయపడలేదు. పర్యావరణ హితానికి పోరుబాట పట్టాను. సామాజికవేత్తగా ప్రయాణం ప్రారంభించాను. ఈ క్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో వేల కార్యక్రమాలు నిర్వహించి పర్యావరణంపై అవగాహన కల్పించాను. ఈ నేపథ్యంలో అప్పట్లో ఉప రాష్ట్రపతిగా ఉన్న వెంకయ్య నాయుడు, ప్రస్తుత తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి, సెంట్రల్ మినిస్టర్ హర్దీప్ సింగ్, ఎంపీ విజయ్‌గోయల్ చేతుల మీదుగా జాతీయస్థాయిలో అవార్డులు అందుకున్నాను.

- అనిత బూదరాజు చవాలి

మహిళలు ఆత్మవిశ్వాసంతో పురోగమించాలి

● మహిళాభ్యుదయ సమితి అధ్యక్షురాలు అరుణ
● ఉత్సాహంగా ముందస్తు మహిళా దినోత్సవం


ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ శాంతకుమారి, అరుణ తదితరులు


మద్దిరాలపాడులో ఉద్యోగ సిబ్బందిని సన్మానిస్తున్న ఎంఈవోలు

ఒంగోలు కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని మహిళాభ్యుదయ సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ బోర్డు శక్తిసదన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ వైద్యురాలు చాపల శాంతకుమారి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి రంగంలోనూ మహిళలు ఎంతో నిబద్ధతతో పనిచేస్తారని చెప్పారు. గాయకుడు నూకతోటి శరత్‌బాబు స్వయంగా రచించి, గానం చేసిన మహిళా ఓ మహిళా గేయం ఆలపించారు. కార్యక్రమంలో ఏపీ శాట్స్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎం.ప్రత్యూష, రచయిత్రి సింహాద్రి జ్యోతిర్మయి, బీరం అరుణ, బొమ్మరిల్లు రాజ్యలక్ష్మి, మారేపల్లి సూర్యకుమారి, శాంతిలత, చెరుకూరి లక్ష్మి, రాజేశ్వరి, గుంటూరు శ్రీదేవి, కోలా అంజమ్మ, విశ్రాంతమ్మ, డాక్టర్ నూనె అంకమ్మరావు, హరిశంకర్, నాగమణి పాల్గొన్నారు.

పలు సంఘాల ఆధ్వర్యంలో..

ఒంగోలు కలెక్టరేట్: ఒంగోలులోని పలు విద్యాసంస్థలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

- స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీలో వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ పుష్పలత, ఆయూష్ డాక్టర్ భ్రమరాంబ, రాజమోహన్‌రావు, నిర్మలామణి, భారతీదేవి పాల్గొన్నారు.
- ట్రిపుల్‌ఐటీలో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.
- స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలోప్రిన్సిపాల్ డి.కళ్యాణి అధ్యక్షతన జరిగిన జరిగిన వేడుకల్లో డోలా అనంతలక్ష్మిని సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.
- సీఐటీయూ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ చాపల శాంతికుమారి పాల్గొని మాట్లాడారు. ఐద్వా నగర కార్యదర్శి ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పి.కల్పన, కంకణాల రమాదేవి, టి.మహేష్, జి.రమేష్, శ్రీనివాసరావు, కళ్యాణి, కె.సామ్రాజ్యం, టి.విజయమ్మ, ఎం.బాబు, లక్ష్మీకాంతం, బి.రాజ్యలక్ష్మి, గోవిందమ్మ, వై. అంజమ్మ, బి.రంగమ్మ. జి.జ్యోతి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నాగులుప్పలపాడు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవో తిరుమలశెట్టి రవి, రమణయ్య పేర్కొన్నారు. మద్దిరాలపాడు ఎస్సీ కాలనీలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు వికవిత అధ్యక్షతన మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న వంట మహిళ, సహాయకురాలితో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణ అనురాధ, హెచ్ఎం రామారావు, అల్లాభక్షు, రవీంద్ర పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో ఐద్వా మండల అధ్యక్షురాలు ఎస్.మాలతి ఆధ్వర్యంలో మహిళాదినోత్సవం ఘనంగా నిర్వహించారు.



మంచి ఆహారంతోనే ఆరోగ్యం

ఒంగోలు విద్య, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మంచి ఆహారపు అలవాట్లతోనే బాలికలు ఆరోగ్యంగా ఉంటారని ఒంగోలు ఆస్టర్ రమేష్ హాస్పటల్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ డి.దీప పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన బాలికల ఆరోగ్యంపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికలు జంక్‌ఫుడ్ తీసుకోవడం వల్ల అనేక గైనిక్ సమస్యలు వస్తున్నందున వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, కె.రూపఅక్కేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులను సవరించాలి : యూటీఎఫ్

ఒంగోలు విద్య, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాల్లోని తప్పులను సవరించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. టిస్ సమాచారం ప్రకారమే సీనియారిటీ జాబితాలు తయారు చేశామని అధికారులు చెప్తున్నా జాబితాలో డీఎస్సీ, మేనేజ్‌మెంట్ల వారీగా అనేక తప్పులు దొర్లాయని, వాటిని సరిచేయాలని వారు కోరారు.

ఎంపీ మాగుంట శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లాలోని మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలను ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని రంగాల్లో సంపూర్ణ మహిళా సాధికారిత కోసం ముందుకు సాగాలన్నారు.

వెలిగొండపై స్పష్టత ఇవ్వాలి : సీపీఐ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంతో పాటు మార్కాపురం జిల్లా, మెడికల్ కాలేజీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. పశ్చిమ ప్రాంత ప్రజల జీవనాడి వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో అవసరమైన మేర నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. శనివారం మార్కాపురం వస్తున్న సీఎం చంద్రబాబు వెలిగొండతో పాటు జిల్లా అభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన కోరారు.

చాట్‌జీపీటీతో ఉజ్వల భవిష్యత్

ఒంగోలు విద్య, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : చాట్‌జీపీటీ, ఏఐలో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆయా రంగాల్లో నిష్ణాతులైన చక్కా బాల తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. టెక్నాలజీల్లో చాట్‌జీపీటీ, ఏఐలు ప్రపంచాన్ని శాసిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధినేత డాక్టర్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, బుజ్జిబాబు, ప్రసాద్, టి.సునీత పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

మద్దిపాడు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతీ గ్రామంలో ఇంటి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు మండల విస్తరణ అధికారి కె.రఘుబాబు తెలిపారు. శుక్రవారం నాగన్నపాలెం పంచాయతీలో సర్పంచ్ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో పన్నుల వసూళ్లకు శ్రీకారం చుట్టారు. ఈనెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున పంచాయతీల్లో ఇంటిపన్నులు, ఇతర పన్నుల వసూలుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా ప్రభుత్వానికి పన్నుల బకాయిలను చెల్లించాలని ఆయన కోరారు.

10న పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

సంతనూతలపాడు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్టలోని ఒంగోలు-1వ వేలంకేంద్రంలో ఈనెల 10న ఉదయం 8-30 గంటకు పొగాకు కొనుగోళ్లు ప్రారంభమవుతాయని వేలంకేంద్ర నిర్వహణాధికారి రవికాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంకేంద్రం పరిధిలో 2,811 బ్యారన్‌లకు 11.8 మిలియన్ కేజీల పొగాకు సాగుకు అనుమతించినట్ల పేర్కొన్నారు. అయితే 19.5మిలియన్‌కేజీల పొగాకును పండించినట్లు తెలిపారు.

ఆదరణ-3 పథకం ద్వారా పరికరాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌రావు

ఒంగోలు(రూరల్), మార్చి7(ఆంధ్రజ్యోతి): ఆదరణ-3 పథకం ద్వారా కులవృత్తులు చేసుకునే వారికి సాంకేతిక పరమైన పరికరాలు అందించాలని పలు బీసీ కుల సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం ఒంగోలులోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బీసీ సంఘాల నాయకులతో ఎంపీడీవో రాజశేఖర్‌రావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులకు నాణ్యమైన వలలు, బోట్లు, రజకులకు వాషింగ్‌మిషన్‌లు, డ్రైమిషన్‌లు, ఇస్త్రీపెట్టెలు ఇవ్వాలని కోరారు. ఆయా అంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పిల్లుట్ల సుధాకర్, శింగోతు వెంకటేశ్వర్లు, శింగోతు మామయ్య, చేజర్ల శ్రీనివాసరావు, పాతపాడు సర్పంచ్ మారుబోయిన కోదండరామిరెడ్డి, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, పోలవరపు వెంకటరామయ్య, రామా శ్రీను పాల్గొన్నారు.

పొన్నలూరులో..

పొన్నలూరు: ఆదరణ-3 పథకం అమలుపై ఎంపీడీవో సుజాత స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పరికారాల నాణ్యత, కంపెనీల గుర్తింపుపై చర్చించారు. సమావేశంలో ఈవోఆర్డీ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీవోఏలు, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం అక్కిరెడ్డిపాలెం యానాది కాలనీకి చెందిన కె.వెంకటేశ్వరమ్మ, దుర్గ, సుబ్బాయమ్మలపై పోలీసులు పెట్టిన అక్రమకేసులను వెంటనే ఎత్తివేయాలని జై శ్రీకృష్ణ బీసీ సమితి వ్యవస్థాపకులు ద్రావిడ దేశం కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయంతో పాటు యానాదులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

24,25 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె

● ఉద్యోగ సంఘాల వెల్లడి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24,25వ తేదీల్లో దేశవ్యాప్తంగా జరిగే బ్యాంకుల సమ్మెను విజయవంతం చేయాలని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం సాయంత్రం ఒంగోలు నగరం నెల్లూరు బస్టాండులోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యజమాన్యాలు అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయన్నారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకులు ఐదు రోజులు పనిదినాలు కల్పించాలని కోరారు. బ్యాంకు యూనియన్లు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా ఈనెల 24,25తేదీల్లో సమ్మెను చేపడుతున్నట్లు తెలిపారు. గత కొంతకాలంగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. డిమాండ్లు సాధించుకునేంత వరకు ఉద్యమం జరుగుతుందని చెప్పారు. అందులో భాగంగానే దశల వారీగా జరిగే ఆందోళన కార్యక్రమాల్లో బ్యాంకు ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కన్వీనర్ రాజీవ్ రత్నదేవ్, శ్రీనివాసరావు, సుబ్బారావు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల14వ తేదీన జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. స్థానిక లాయర్‌పేటలోని బాలినేని నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీమంత్రి, పార్టీ సీనియర్ నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నుంచి భారీగా జనసైనికులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు ఈదర సురేష్‌బాబు, యనమల నాగరాజు, మలగా రమేష్, నీలంరాజు సరోజ, తాడి కృష్ణలత, గోపాల్‌రెడ్డి, గోలి లక్ష్మి, సాంబయ్య, నరేంద్ర, నరేష్, భూపతి రమేష్, గోలి తిరుపతిరావు, నాగేశ్వరరావు, రాఘవ, అజీజ్, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహానికి టీడీపీ జెండాలు కట్టడం దారుణం

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
వైసీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి


మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహంపై టీడీపీ జెండాలు కట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెడ్డి హాస్టల్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి టీడీపీ జెండాలు కట్టడమే కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరించారని, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో జరిగే పరిణామాలకు అందుకు బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

● ఎస్పీ దామోదర్


వైద్యశిబిరం ప్రారంభించిన అనంతరం సిబ్బందితో ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఉన్నతంగా ఉంటుందని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు కళ్యాణ మండపంలో పోలీసు కుటుంబాల్లోని మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళ దినోత్సవం వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిచినట్లు తెలిపారు. అనంతరం పలువురి మహిళలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు రాఘవేంద్రరావు, పాండురంగారావు, హజరత్తయ్య, డాక్టర్లు భానుమతి, జె.ధీరజ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న హెచ్ఎం

టీచర్లకు సన్మానం

కొండపి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని కె.ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్‌లోని ఉపాధ్యాయినులను సహచర టీచర్లు, హెచ్ఎం సుసన్నకుమార్ శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు.

పులి మృతి ఘటనలో ఇద్దరు అధికారులపై వేటు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : విధులు నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న ఇద్దరు ఫారెస్టు అధికారులపై మార్కాపురం డీఎఫ్‌టీ గుండాల సందీప్‌కృపాకర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఎర్రగొండపాలెం మండలంలోని కొలుకుల బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో గత నెల 17న అటవీ జంతువుల కోసం వేటగాళ్లు ఉచ్చులు వేశారు. ఆ ఉచ్చుల్లో చిరుత పులి చిక్కుకుని మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు నిందితులను అటవీశాఖ అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఘటనపై అధికారులు పూర్తిస్థాయిలో విచారించారు. విధులలో నిర్లక్ష్యంగా ఉన్నారని విచారణలో తెలడంతో కొలుకుల బీట్ సెక్షన్ ఆఫీసర్ బి.సక్కునాయక్, బీట్ ఆఫీసర్ టి.నాగేశ్వరరావులను సస్పెండ్ చేసినట్లు ఎర్రగొండపాలెం, గంజివారిపల్లి ఫారెస్ట్ రెంజర్ సుబ్బారావు శుక్రవారం తెలిపారు.

ఎంపీ మాగుంటకు బీఎన్ పరామర్శ


మాగుంటను కలిసిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్, నాయకులు

సంతనూతలపాడు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని శుక్రవారం చెన్నైలోని ఆయన స్వగృహంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జనరిక్ మెడికల్ షాపులను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా ఔషధ నియంత్రణ ఏడీ జ్యోతి


వినియోగదారుడి అభిప్రాయం తెలుసుకుంటున్న జ్యోతి

ఒంగోలు(రూరల్), మార్చి7(ఆంధ్రజ్యోతి): జనరిక్ మెడికల్ షాపులను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఔషధ నియంత్రణ అసిస్టెంట్ డైరెక్టర్ వీఎస్.జ్యోతి కోరారు. ఒంగోలు నగరం వీఐపీరోడ్డులోని ప్రధానమంత్రి జనరిక్ మందులు షాపులను జిల్లా ఔషధ నియంత్రణ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ జనరిక్ మెడికల్ షాపులలో మందుల కొనుగోలుకు నిర్వహణదారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని చెప్పారు. వాటి నాణ్యతను కూడా ప్రజలకు తెలపాలన్నారు. తక్కువ ధరలలో నాణ్యమైన మందులు అందుబాటులోకి వచ్చినట్లు వివరించాలని చెప్పారు. తక్కువ ధరకు మందులు దొరుకుతాయని తెలిపారు. ఈ సందర్భంగా షాపుల యజమానులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి పద్మజ, ఔషధ తనిఖీ అధికారి పీటీ.సంధ్య, మార్కాపురం ఔషధ తనిఖీ అధికారి బీవీ.ఉషారాణి, మెడికల్ షాపుల నిర్వహణదారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

నాగులుప్పలపాడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు క్యాండిల్ మంటలు దుప్పటికి అంటుకొని మంచంపై నిద్రిస్తున్న వృద్ధుడు గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కనపర్తిలో చోటుచేసుకొంది.

మండలంలోని కనపర్తి గ్రామం దళితకాలనీకి చెందిన మంచు శేషయ్య (76) మూడు రోజుల క్రితం తన ఇంట్లో క్యాండిల్ వెలిగించి మంచం పక్కన ఉంచి నిద్రించారు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు క్యాండిల్ మంచంపై పడి మంటలు చెలరేగి శేషయ్య గాయపడంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కిషోర్‌బాబు తెలిపారు.

'ఎత్తిపోతల' ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన దొంగలు


టంగుటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొందూరు ఎత్తిపోతల పథకంలో మరోసారి చోరీ జరిగింది. దొంగలు గురువారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి వైరు కోసం వెతికారు. అందులో అల్యూమినియం తీగ ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ అంతా బయట పారబోశారు. రెండు నెలల క్రితం ఇక్కడే దొంగతనం జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఛిద్రంచేసి అందులోని రాగితీగను దొంగలు అపహరించుకెళ్లారు. రైతులే చందాలు వేసుకొని రూ.5లక్షలు వెచ్చించి బాగుచేసుకొని వినియోగంలోకి తెచ్చారు. మళ్లీ దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టడంతో ఆయకట్టుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చోరీపై టంగుటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సూచన మేరకు క్లూస్ టీం రంగంలోకి దిగి ఘటనా స్థలంలో వేలిముద్రలను సేకరించింది.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

పొన్నలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మపాలెం గ్రామంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మోరబోయిన మాల్యాద్రి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాలు, ముచ్చు మాల్యాద్రి, ముచ్చు ఆదెయ్య, బి.మాలకొండారెడ్డి, ఎం.మల్లికార్జున, దాసరి కొండలరావు పాల్గొన్నారు.







అవీ..ఇవీ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఎల్లయ్య (ఫైల్)

త్రిపురాంతకం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా వినుకొండ మండలం కొత్త పాలెం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన తొలిచూరి ఎల్లయ్య(30) మృతి చెందాడు. ఎల్లయ్య తన సొంత ఆటోలో మిర్చి బస్తాలను గుంటూరులోని యార్డులో దించి తిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో మిర్చి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా ఎల్లయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కాశంశెట్టి పిచ్చయ్య(58) పొలంలో పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. పొలంలో పనులు చేస్తున్న సమయంలో పక్కన బోర్డు తీగలు తగలడంతో విద్యుత్‌షాక్ గురై అక్కడిక్కడే మృతి చెందాడు. కుమారుడు గమనించి ఎర్రగొండపాలెం ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పిచ్చయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పులి మృతి ఘటనలో ఇద్దరు అధికారులపై వేటు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యంగా ఉన్న ఇద్దరు ఫారెస్టు అధికారులపై మార్కాపురం డీడీఎఫ్‌టీ గుండాల సందీప్‌కృపాకర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఎర్రగొండపాలెం మండలంలోని కొలుకుల బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో గత నెల 17న అటవీ జంతువుల కోసం వేటగాళ్లు ఉచ్చులు వేశారు. ఆ ఉచ్చుల్లో చిరుత పులి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు నిందితులను అటవీశాఖ అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఘటనపై అధికారులు పూర్తిస్థాయిలో విచారించారు. విధులలో నిర్లక్ష్యంగా ఉన్నారని విచారణలో తెలడంతో కొలుకుల బీట్ సెక్షన్ ఆఫీసర్ బి. సక్కునాయక్, బీట్ ఆఫీసర్ టి.నాగేశ్వరరావులను సస్పెండ్ చేసినట్లు ఎర్రగొండపాలెం, గంజివారి పల్లి ఫారెస్ రేంజర్ సుబ్బారావు తెలిపారు.

భర్త అదృశ్యంపై పోలీసులకు భార్య ఫిర్యాదు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత గోళ్లవిడిపి గ్రామానికి చెందిన బొమ్మనబోయిన యల్లయ్య కనిపించడం లేదని భార్య మంగమ్మ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఉదయం నివాసం నుంచి అలిగి వెళ్లారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్యా యత్నం

కొమరోలు, మార్చి3(ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రాలేదని భర్త కత్తితో గొంతుకోసుకున్న ఘటన కొమరోలు పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు కొమరోలు మండలంలోని సర్విరెడ్డి పల్లి గ్రామానికి చెందిన మహిళను కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలోని నాగలకుంట్ల గ్రామానికి చెందిన దావీదుతో సుమారు ఐదు సంవత్సరాల కిందట వివాహమైంది. అనంతరం దావీదు తాగుడుకు బానిస కావడంతో భార్య పుట్టినిల్లు అయిన సర్విరెడ్డిపల్లెకు వచ్చింది. ప్రస్తుతం ఆమె తల్లిదండ్రులతో కలిసి కొమరోలులో ఉంటోంది. అయితే శుక్రవారం భార్యను కాపురానికి రమ్మని దావీదు కోరగా భార్య రానని చెప్పింది. దీంతో దావీదు గొంతుకోసుకున్నారు. వెంటనే స్థానికులు కొమరోలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి దావీదును 108 వాహనం ద్వార గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె

● ఉద్యోగ సంఘాల వెల్లడి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24,25వ తేదీల్లో దేశవ్యాప్తంగా జరిగే బ్యాంకుల సమ్మెను విజయవంతం చేయాలని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం సాయంత్రం ఒంగోలు నగరం నెల్లూరు బస్టాండులోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యజమాన్యాలు అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయన్నారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకులు ఐదు రోజులు పనిదినాలు కల్పించాలని కోరారు. బ్యాంకు యూనియన్లు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా ఈనెల 24,25తేదీల్లో సమ్మెను చేపడుతున్నట్లు తెలిపారు. గత కొంతకాలంగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. డిమాండ్లు సాధించుకునేంత వరకు ఉద్యమం జరుగుతుందని చెప్పారు. అందులో భాగంగానే దశలవారీగా జరిగే ఆందోళన కార్యక్రమాల్లో బ్యాంకు ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కన్వీనర్ రాజీవ్ రత్నదేవ్, శ్రీనివాసరావు, సుబ్బారావు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

మాగుంటకు ఎమ్మెల్యే బీఎన్.పరామర్శ

సంతనూతలపాడు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని శుక్రవారం చెన్నైలోని ఆయన స్వగృహంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జనరిక్ మెడికల్ షాపులను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా ఔషధ నియంత్రణ ఏడీ జ్యోతి


వినియోగదారుడి అభిప్రాయం తెలుసుకుంటున్న జ్యోతి

ఒంగోలు(రూరల్), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జనరిక్ మెడికల్ షాపులను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఔషధ నియంత్రణ అసిస్టెంట్ డైరెక్టర్ పీఎస్.జ్యోతి కోరారు. ఒంగోలు నగరం వీఐపీరోడ్డు లోని ప్రధాన మంత్రి జనరిక్ మందుల షాపులను జిల్లా ఔషధ నియంత్రణ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ జనరిక్ మెడికల్ షాపులలో మందుల కొనుగోలుకు నిర్వహణదారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని చెప్పారు. వాటి నాణ్యతను కూడా ప్రజలకు తెలపాలన్నారు. తక్కువ ధరలలో నాణ్యమైన మందులు అందుబాటులోకి వచ్చినట్లు వివరించాలని చెప్పారు. తక్కువ ధరకు మందులు దొరుకుతాయని తెలిపారు. ఈ సందర్భంగా షాపుల యజమానులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి పద్మజ, ఔషధ తనిఖీ అధికారి పీబీ.సంధ్య, మార్కాపురం ఔషధ తనిఖీ అధికారి బీవీ.ఉషారాణి, మెడికల్ షాపుల నిర్వహణదారులు పాల్గొన్నారు.

హామీలను సీఎం విస్మరించరు

● వెలిగొండ, జిల్లా ఏర్పాటులో వెనకడుగు వేయరు
● నేడు మహిళా దినోత్సవం, కార్యకర్తలతో భేటీకి ప్రాధాన్యం
● ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి


సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'గతంలో తన పుట్టినరోజున మార్కాపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వెనుకడుగువేయరు. ఎప్పుడు ఏం చేయాలో అప్పుడు అది చేస్తారు. వెలిగొండ పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటుపై తగిన సమయంలో నిర్ణయం ఉంటుంది. నేడు మహిళా దినోత్సవం కాబట్టి మహిళలతో కార్యక్రమం. కార్యకర్తలంటే ఆయనకు ప్రాణం కాబట్టి కార్యకర్తల భేటీకి ప్రాధాన్యత ఇచ్చారు' అని మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం మార్కాపురం వస్తున్న సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు వెళ్లక పోవడంపై కొందరు చేస్తున్న విమర్శలపై నారాయణరెడ్డి స్పందించారు. ఒక ప్రశ్నకు బదులుగా నెలలో రెండు, మూడుసార్లు వెలిగొండ ప్రాజెక్టుపై మంత్రి రామానాయుడు, ఉమ్మడి జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, స్వామి సమీక్ష చేసి సీఎంకు వివరిస్తున్నారని, జిల్లా ఏర్పాటుపై తగిన సమయంలో నిర్ణయం తీసుకునేందుకు అనుగుణమైన పరిశీలన జరుగుతుందని అన్నారు. మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని వెనుకబడిన మార్కాపురంలో నిర్వహించాలని నిర్ణయం తీసుకోవటమే ఈ ప్రాంతానికి సీఎం ఇచ్చిన ప్రాధాన్యత అని అన్నారు. ఈ విషయాన్ని గుర్తించకుండా విమర్శలు చేసే వారికి తగిన సమయంలో సమాధానం వస్తుందన్నారు. కార్యకర్తలకు చంద్రబాబు ఎంత ప్రాధాన్యత ఇస్తారో కార్యకర్తల సమావేశం ఏర్పాటు ద్వారా అర్థమైందని అంటూ ఈ విషయంలో బాబు నిర్ణయం పట్ల కార్యకర్తల నుంచి పూర్తిగా సంతోషం వ్యక్తమవుతుందని నారాయణరెడ్డి అన్నారు.

వైభవంగా లక్ష్మీపూజ


సామూహిక లక్ష్మీపూజ చేస్తున్న మహిళలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వేదపండితుల ఆధ్వర్యంలో సామూహిక లక్ష్మీపూజ, కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి కార్యక్రమంలో పాల్గొని భక్తులను ఉద్దేశించి అనుగ్రహబాషణం చేశారు. కమిటీ సభ్యులు డా. డీవీ కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, ఎస్.యోగిరెడ్డి, వెంకటరెడ్డి, మహిళా కమిటీ, వికాస తరంగిణి సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక జవహర్ నగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత ఆమలక లక్ష్మీనారాయణ స్వామి నూతన కమిటీ శుక్రవారం నియమించారు. నూతన కార్యవర్గ జాబితాను శ్రీ త్రిదండి అహోబిలం రామానుజజీయర్‌స్వామి మంగళ శాసనాలతో జాబితాను నియమించి కార్యవర్గానికి అందజేశారు. గౌరవ అధ్యక్షులుగా డా. డీవీ.కృష్ణారెడ్డి, అధ్యక్షురాలిగా గోళ్ల వరలక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా గంగిరెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులుగా కందుల వేణుగోపాల్‌రెడ్డి, కోశాధికారిగా చిట్యాల మల్లారెడ్డి, గౌరవ సలహాదారుగా ఏరువ సత్యనారాణరెడ్డి, సహాయ కార్యదర్శిగా యోగిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా డా.చెప్పల్లి కనకదుర్గ, బి.శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగదివ్యలు ఎంపికయ్యారు.



అనుగ్రహబాషణం చేస్తున్న రామానుజ జీయర్ స్వామి, లక్ష్మీదేవి అలంకరణ

ఇంటర్ కేంద్రాల తనిఖీ

గిద్దలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రీవివేకానంద, జీవనజ్యోతి, సాహితి జూనియర్ కళాశాలల్లోని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు సత్యరామిరెడ్డి, అశోక్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ 3 కేంద్రాలలో 696 మంది పరీక్షలు వ్రాయాల్సి ఉండగా 53 మంది గైరుహాజరు కావడంతో 643 మంది పరీక్షలు వ్రాసినట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు మురళీక్రిష్ణ, విజయ్‌శంకర్, చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన దొంగలు

టంగుటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొందూరు ఎత్తిపోతల పథకంలో మరోసారి చోరీ జరిగింది. దొంగలు గురువారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి వైరు కోసం వెతికారు. అందులో అల్యూమినియం తీగ ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ అంతా బయట పారబోశారు. రెండు నెలల క్రితం ఇక్కడే దొంగతనం జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఛిద్రంచేసి అందులోని రాగితీగను దొంగలు అపహరించుకెళ్లారు. రైతులే చందాలు వేసుకొని రూ.5లక్షలు వెచ్చించి బాగుచేసుకొని వినియోగంలోకి తెచ్చారు. మళ్లీ దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టడంతో ఆయకట్టుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చోరీపై టంగుటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సూచన మేరకు క్లూస్ టీం రంగంలోకి దిగి ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించింది.

ప్రమాద బీమాతో కుటుంబానికి అండ

ఎస్‌బీఐ ఆర్‌ఎం సూర్యప్రకాష్


బాధిత మహిళకు చెక్కు అందజేస్తున్న ఆర్‌ఎం

ఎర్రగొండపాలెంరూరల్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదబీమా ప్రతి కుటుంబానికి బీమా నింపుతుందని ఎస్‌బీఐ ఆర్‌ఎం కే.సూర్యప్రకాష్ అన్నారు. ఎర్రగొండపాలెం మండలంలోని సర్వాయిపాలెం గ్రామానికి చెందిన దుదేకుల సిద్ధయ్య అనే ఖాతాదారుడు ప్రమాదబీమా ప్రీమియం చెల్లించాడు. ఆయన ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బీమా పాలసీ ప్రకారం బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు పాలసీ నగదును అందజేశారు. ఆ నగదును నామిని అయిన సిద్ధయ్య భార్య మొగిలమ్మకు శుక్రవారం బ్యాంక్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఖాతదారులు తప్పనిసరిగా ప్రమాదబీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఆయన వెంట వెంకటరామ కృష్ణ, ఎర్రగొండపాలెం బ్రాంచ్ మేనేజర్ నాగేంద్ర కుమార్, శివ, చాంద్ బాషా, రాంబాబు, మస్తాన్ ఉన్నారు.

రూ.37కోట్ల రుణాల మంజూరే లక్ష్యం

కందుకూరి రిజనల్ పరిధిలో వాణిజ్య రుణాలు రూ.37 కోట్లు మంజూరే లక్ష్యం అని కందుకూరు రిజనల్ మేనేజర్ సూర్యప్రకాష్ అన్నారు. శుక్రవారం ఎర్రగొండపాలెం బ్రాంచ్‌కు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏడాదికి రూ.37 కోట్లు లక్ష్యంగా ఉండగా, ఇప్పటికే రూ.30 కోటు ఇచినట్లు తెలిపారు. మార్చి చివరికి లక్ష్యాలను పూర్తి చేస్తామన్నారు. అలాగే కే.ఎస్.ఆర్ ఏఈఎల్ కింద రూ.100 కోట్ల వరకు రుణాలు ఇవ్వవచ్చన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవలన్నారు. ముఖ్యంగా దళారులను నమ్మవద్దని వారిని నమ్మి మోసపోవద్దన్నారు. బ్యాంక్‌లో అన్ని రకాల స్కీమ్‌లు ఉన్నాయని బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

నాటుసారా నిర్మూలనతో ఆరోగ్యాంధ్రప్రదేశ్

జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ


మాట్లాడుతున్న విజయ

గిద్దలూరుటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాటుసారా నిర్మూలనతో ఆరోగ్యాంధ్రప్రదేశ్ తద్వారా నవ్యాంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ అన్నారు. గిద్దలూరు మండలం ముండ్లపాడు పంచాయతీ పరిధిలోని బురుజుపల్లె, ఓబులాపురంతాండా గ్రామాలలో నవోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అయా గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డ్రగ్స్, నాటుసారా వంటి మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పేర్కొన్నారు. నాటుసారా తాగడం వలన ప్రజల జీవితాలు నశించి పోతాయని, అది తాగేవారి కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తాయని, తద్వారా సమాజం మీద కూడా దుష్ప్రభావాలను చూపిస్తోందన్నారు. గ్రామస్థులతో ఆమె నవోదయం ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ మాట్లాడుతూ నాటుసారాలో అనేక విషపూరిత ఆరోగ్యాన్ని పాడుచేసే పదార్థాలు ఉంటాయని తెలిపారు. వీటికి దూరంగా ఉండి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ అంజనేయరెడ్డి, ఎఇఎస్ జనార్ధన్‌రావు, ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి


అధ్యాపకురాలని సన్మానిస్తున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పురుషులతో పాటు నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలలో రాణించాలని శ్రీ సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కప్పగంతుల మధుసూధన్ అన్నారు. కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు కె.సోనియా, జి.రుషికారుణ్, జి.అనుసూయలను విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పురుషునితో పాటు మహిళలు కూడా సరిసమాన హక్కులు కలిగి నేటి కాలంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉన్నత స్థాయిలో గుర్తింపు పొందరన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్, క్యాంపస్ సమన్వయకర్త పవన్ కుమార్, శేషు కుమార్, అధ్యాపకులు వినోద్, వీఆర్‌కే ప్రసాద్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు, ఎస్‌బీఐ సిబ్బంది

త్రిపురాంతకం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్యులు ఎం.శ్రీనివాసరావు, గైనకాలజిస్టు సౌజన్య, విశ్వనాధరెడ్డి మహిళలకు పలు రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. షుగర్, బీపీ పరీక్షలకు 62 మంది, గైనిక్ పరీక్షలకు 82 మంది, 18 మందికి సాధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు ఏ.రాదాకృష్ణ, అసిస్టెంట్ మేనేజరు వి.శ్రీనుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా శుభవార్త చెప్పింది. అందులో భాగంగా ఎర్రగొండపాలెం మండల పరిధిలో మహిళకు ఉచిత శిక్షణ తరగతుల కోసం మహిళల నుంచి ధరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో బండారు శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలంలో అన్ని రకాల బీసీలకు 41, కాపులకు 10, ఈబీసీ 38, రెడ్డిలకు 41, కమ్మ 61, ఆర్యవైశ్యలకు 14, బ్రహ్మణలకు మూడు ప్రకారం వచ్చాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఓబీఎంఎంఎస్ లాగిన్‌లో వివరాలు పొందుపరచాలన్నారు. ఈ శిక్షణ తరగతులు మూడు నెలలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం స్థానిక పంచాయితీ కార్యదర్శులను సంప్రదించాలని అన్నారు.

ఎమ్మెల్యే మహిళాదినోత్సవ శుభాకాంక్షలు

గిద్దలూరు టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మార్చి 8న శనివారం మహిళ దినోత్సవం సందర్భంగా వారికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సమాజ శ్రేయస్సులో కీలక భూమిక పోషించాలన్నారు. కుటుంబ వ్యవస్థను శక్తివంతంగా నిలబెట్టడంలో ఆర్థిక పురోగతిలో సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అమూల్యమైందన్నారు. మహిళల సాధికారతకు తనవంతు పూర్తి స్థాయి మద్దతు ఉంటుందన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేస్తున్న దాతలు

గిద్దలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం అనుమలవీడులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు అట్టలు, పెన్నులు, స్కేలు, తదితర పరీక్ష సామగ్రిని అందజేశారు. యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య పరీక్ష సామగ్రిని సమకూర్చి అందచేయగా హెచ్‌ఎం బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17 నుంచి పదో తరగతి పరీక్షలు

కంభం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్నాయి. కంభం మండలంలోని ఏడు పరీక్ష కేంద్రాలలో 1200 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 140 మంది, తురిమెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 110 మంది, కంభం జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో 200 మంది, శ్రీ చైతన్య పాఠశాలలో 160 మంది, న్యూ ఆల్ఫా పాఠశాలలో 200 మంది, వాసవి విద్యానికేతన్‌లో 230 మంది, సిఎల్‌ఆర్ సెంటర్‌లో 160 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

ఫుడ్ ఫెస్టివల్ సంబరాలు

కంభం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్.కోట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఫుడ్‌ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పలు ఆహార పదార్థాలను ప్రదర్శించి ఒకరికొకరు పంచుకుని భుజించారు. హెచ్‌ఎం వేణుగోపాలచారి మాట్లాడుతూ ఫుడ్ ఫెస్టివల్ ద్వారా విద్యార్థులు ఆహార సాంప్రదాయాలను, నియమాలను, పోషక విలువలను, సీజనల్ ఫ్రూట్స్ ప్రాముఖ్యతను తెలుసుకుంటారన్నారు.

కల్కి సేవాసమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కల్కి సేవా సమితి ఆధ్వర్యంలో ఆయన భక్తులు వేణుగోపాలస్వామి దేవాలయ సమీపంలో 1000 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు శేషగిరిరావు, ప్రసాదరావు, గంగయ్య, అనిల్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సాంకేతిక హామీ

● జవాబుదారీతనం పెంచే విధంగా జన్‌మన్‌రేగా యాప్
● కూలీల అరచేతిలోనే సమగ్ర సమాచారం


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పెద్దదోర్నాల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పల్లెల్లో వలసల నివారణకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వలసల నివారణకు ప్రభుత్వం జవాబుదారితనాన్ని పెంచేందుకు కృషి చేస్తోంది. అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం జన్‌మన్‌రేగ యాప్‌ను నూతనంగా అవిష్కరించింది.

జన్‌మన్‌రేగ యాప్‌తో ఉపయోగాలు ఇవీ

జన్‌మన్‌రేగ యాప్ సాయంతో కూలీల వివరాలు, నగదు, చెల్లింపులు, రోజువారీ హాజరు, పనిమస్టర్లు వివరాలు తెలుసుకోవచ్చు. చేసిన పనికి కూలి సొమ్ము ఖాతాల్లో జమైందా..? లేదా..? అనే వివరాలు కూడా తనిఖీ చేసుకోవచ్చు. ఉపాధి సిబ్బంది అవకతవకలకు పాల్పడితే యాప్ నుంచే గోప్యంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. చాలా మంది కూలీలు పనులు చేశాక కూలీ డబ్బులు ఖాతాలో పడ్డాయా..? లేదా..? అని తెలుసుకునేందుకు బ్యాంకులు, పోస్టాఫీసు, నగదు లావాదేవీల ఏజెంట్ల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతుంటారు. యాప్‌పై అవగాహన పెంచుకుంటే కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా పోతుంది.

యాప్ వినియోగం ఇలా..

జన్‌మన్‌రేగ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ యాప్‌ను తెరిచిన తర్వాత రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామం వివరాలు ఎంపిక చేసుకోవాలి. అనంతరం జాబ్‌కార్డు నంబరు కానీ కుటుంబ సభ్యుల ఐడీని నమోదు చేస్తే కూలీలకు సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి. పని రోజులు, హాజరు, బ్యాంకుఖాతాలో ఎంత నగదు జమైంది, ఇంకెంత రావాలన్న సమగ్ర సమాచారం కనిపిస్తుంది. ఒకవేళ నగదు జమ కాకుంటే ఏ కారణంతో రాలేదన్న వివరాలూ అందులో కనిపిస్తాయి. పల్లెల్లో చేపట్టే పనుల వివరాలు, ఖర్చులు, ఎంతమంది పనులు చేస్తున్నారు, ఏఏ పనులకు ఎంత మంది వస్తున్నారన్న వివరాలు కూడా ఉంటాయి. కేంద్రప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించినా వినియోగంపై ప్రజలకు అవగాహన కరువైంది. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తే ఎంతో ప్రయోజన కరంగా ఉంటుంది.

అవగాహన కల్పిస్తున్నాం

జన్‌మన్‌రేగ యాప్‌పై కూలీలకు అవగాహన కల్పిస్తున్నామని ఈసీ చాణిక్య తెలిపారు. ఇప్పటికే చాలా మందికి యాప్ గురించి తెలుసన్నారు.

ముఖాముఖి

వంద శాతం రుణాల రికవరీ లక్ష్యం

పి.దేవరాజ్, ఏపీఎం, తాళ్లూరు



ప్రశ్న: మండలంలో పొదుపుగ్రూపు సభ్యుల రుణాల రికవరీ ఎలా ఉంది?

జవాబు: మండలంలోని పొదుపు గ్రూపు సభ్యుల నుంచి సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి రుణాల రికవరీ 94శాతం ఉంది. వంద శాతం రుణాల రికవరీ లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

ప్ర: మండలంలో ఎన్ని పొదుపు గ్రూపులు ఉన్నాయి? ఎంతమంది సభ్యులు ఉన్నారు. బ్యాంకు లింకేజీ లక్ష్యం ఎంత?

జ: మండలంలోని 16 పంచాయతీల్లో 1190 పొదుపు గ్రూపులున్నాయి. వాటిల్లో 11872 మంది సభ్యులు ఉన్నారు. 2024-25 సంవత్సరానికి 940 గ్రూపులకు రూ.41.79 కోట్లు బ్యాంకు లింకేజీ లక్ష్యం.

ప్ర: ఇప్పటివరకు ఎన్ని గ్రూపులకు బ్యాంక్ లింకేజీ ఇప్పించారు. ఎంత శాతం రికవరి ఉంది?

జ: మండలంలో 802 గ్రూపులకు రూ.37.4కోట్లు మేర బ్యాంక్ లింకేజీ అందజేశారు. మిగిలినది మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తాం. 94శాతం రికవరీ ఉంది.

ప్ర: ఎంత మందికి స్త్రీనిధి రుణాలు ఇచ్చారు? రికవరీ శాతం ఎంత?

జ: మండలంలో స్త్రీ నిధి కింద 191 మంది సభ్యులకు రూ.4 కోట్ల రుణం అందజేశాం. 95 శాతం రికవరీ ఉంది. యూనిట్‌ను బట్టి ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం ఇచ్చాం.

ప్ర: పొదుపు గ్రూపుల్లోని ఎస్సీ, ఎస్టీలకు ఎంత మందికి ఉన్నతిపథకం కింద సబ్సిడీ రుణాలు ఇచ్చారు?

జ: మండలంలో 21గ్రూపులకు రూ.19 లక్షల ఉన్నతి రుణాలు అందజేశాం. గ్రూపుల్లోని మహిళలకు అవసరాన్ని బట్టి రుణం తీసుకున్నారు.

భక్తి శ్రద్ధలతో హోమాలు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం హోమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణదాత, విశ్రాంత జాయింట్ కలెక్టర్ పిడుగు బాబురావు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు శ్రీమాన్ నారాయణం వెంకటరమణ దీక్షితులు సారథ్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పిడుగు బాబురావు, విజయ దంపతులు, కుమారుడు సాయిఅభినయ్, బార్గవి దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

పామూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక రంజాన్‌పండుగ అని టీడీపీ బూత్ ఇన్‌చార్జ్ బండ్ల నారామణ అన్నారు. స్థానిక ఆకులవీధిలోగల దర్వాజాగల్లీలో పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసాలు ఆచరిస్తున్న ముస్లిం మహిళలకు శుక్రవారం పలురకాల పండ్లతో కూడిన ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో నారాయణ కుటుంబసభ్యులు, స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

వ్యాపారవేత్త కాళేశ్వరరావు మృతి



కాళేశ్వరరావు(ఫైల్)

పామూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యదేవుని దేవస్థాన మాజీ ఛైర్మన్, లయన్స్ క్లబ్ మాజీ సభ్యుడు, ప్రముఖ వ్యాపారవేత్త, దర్శి కాళేశ్వరరావు (75) శుక్రవారం గుండెపోటులో మృతి చెందారు. ఆయనకు కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. గత 25 సంవత్సరాల నుంచి ఆయన పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. ఆయన ఆకస్మిక మరణం పట్ల పట్టణంలోని పలువురు వ్యాపారస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేత

సీఎస్‌పురం(పామూరు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రిటైర్డ్ హెచ్‌ఎం తాతపూడి ఇజ్రాయిల్ ప్రతాప్‌కుమార్ సహకారంతో పదో తరగతి చదువుతున్న 85 మంది విద్యార్థులకు శుక్రవారం ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం జిలక్ష్మణరావు, ఉపాధ్యాయులు జి.వేమనారాయణ, బి.చిన్ననారాయణ, జె.పోతురాజు, బి.శ్రీనివాసులు, ఎన్.గంగాధర్, జి. నారాయణ, సంధ్యారాణి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ముండ్లమూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల బీసీ కాలనీకి చెందిన చొప్పరపు రామగోపీకి చెందిన ద్విచక్ర వాహనం గురువారం రాత్రి చోరీకి గురైంది. ఇంటి ముందు మోటారుసైకిల్‌కు తాళం వేసి ఉంచారు. శుక్రవారం ఉదయం చూసేసరకి వాహనం కనిపించలేదు. ఇద్దరు టీవీఎస్ వాహనంపై వచ్చి చోరీకి పాల్పడినట్టు అక్కడి సీసీ కెమెరాలో నమోదయ్యాయి. బాధితుడు ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు.

పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూపు

- చెల్లింపుల్లో అధికారుల తీవ్రజాప్యం
- లబ్ధిదారులకు ఆర్థిక కష్టాలు



దర్శి: తూర్పువెంకటాపురంలో నిర్మించిన గోకులం షెడ్

దర్శి/తాళ్లూరు మార్చి 7(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. దర్శి మండలంలో నిర్మించిన షెడ్లకు ఇప్పటివరకు రూ.26.80 లక్షలు బిల్లులు చెల్లించారు. ఇంకా సుమారు రూ.55 లక్షల బిల్లులు రావాల్సి ఉంది

టీడీపీ కూటమి ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తుంది. అందులోభాగంగా పాడి రైతుల కోసం గతంలో ఎన్నడూలేని విధంగా గోకులం షెడ్లను నిర్మించేందుకు నిధులు విడుదల చేసింది. దర్శి మండలంలో 31 గోకులం షెడ్ల నిర్మాణానికి రూ.81.90 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే 28 షెడ్ల నిర్మాణం పూర్తయింది. కొర్లమడుగు, పెద్దఉయ్యాలవాడ, బొట్లపాలెం గ్రామాల్లో షెడ్ల నిర్మాణం జరుగుతుంది. సన్న, చిన్నకారు రైతులు గోవులను, గేదెలను పెంచుకొని పాడి పరిశ్రమ అభివృద్ధి చేసుకునేందుకు గోకులం షెడ్లు ఎంతో ఉపయోగపడుతాయి. ఒక్కో షెడ్డుకు రూ.2.30 లక్షలు ఖర్చు చేస్తారు. అందులో పది శాతం మాత్రమే లబ్ధిదారులు భరించాల్సి ఉంది. మిగిలిన 90శాతం రైతుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుంది. గ్రామాల్లో పాడిపరిశ్రమ అభివృద్ధికి ఈ పథకం ఎంతో దోహదపడే అవకాశం ఉంది.

పెండింగ్ బిల్లుల విషయమై సంబంధిత అధికారులను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఈ నెలాఖరులోగా పూర్తిగా బిల్లులు చెల్లించటం జరుగుతుందన్నారు. నూరుశాతం షెడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

తాళ్లూరు మండలంలోనూ ఇదేపరిస్థితి నెలకొంది. మండలంలో 29 గోకులం షెడ్లు మంజూరు చేశారు. 9 మంది షెడ్లు కట్టుకునేందుకు ముందుకు రాక పోవటంతో అనుమతులు రద్దు చేశారు. 20 మంది లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టారు. వీటిల్లో 14 పూర్తయ్యాయి. నాలుగు షెడ్లు చివరి దశలో ఉన్నాయి. రెండుచోట్ల వివిధ దశల్లో ఉన్నాయి. నిధుల కొరత లేదని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని అధికారులు చెప్పడంతో అప్పులుచేసి షెడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. తీరా బిల్లుల చెల్లింపు విషయానికి వచ్చేసరికి అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం గురించి లబ్ధిదారులు అధికారుల వద్దకు తరుచూ తిరుగుతున్నా వారి నుండి స్పందన రావటం లేదని ఆందోళన చెందుతున్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి పరుగు

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- పలువురు పార్టీలో చేరిక



ముండ్లమూరు: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో టీడీపీలో చేరిన పలుకురాళ్ళ తండావాసులు

దర్శి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరటం ఆనందదాయకమని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని రామచంద్రాపురం ఇన్‌చార్జి సర్పంచ్ కర్నా సుబ్బులు అనుచరులతో కలిసి శుక్రవారం రాత్రి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కర్నా సుబ్బులుకు, ఆమె అనుచరులైన 15 కుటుంబాలకు గొట్టిపాటి లక్ష్మి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈసందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం గత తొమ్మిది నెలల కాలంలో అద్భుతాలు సాధించిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. పథకాలన్నీ నిలిచిపోయాయన్నారు. దర్శి నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపనకే పరిమితమైన టీటీడీ కల్యాణ మండపం, మొగిలిగుండాల రిజర్వాయర్ నిర్మాణం శరవేగంగా జరుగుతుందన్నారు. త్వరలో జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణా పరిశోధన స్థానం పనులు ప్రారంభమవుతాయన్నారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తామని డాక్టర్ లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, మారెళ్ళ వెంకటేశ్వర్లు, ఆర్.పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, ముండ్లమూరు మండలం కెల్లంపల్లి పంచాయతీలోని పలుకురాళ్ల తండాకు చెందిన 35 కుటుంబాలు శుక్రవారం రాత్రి వైసీపీ నివీడి టీడీపీలో చేరారు. రమావత్ బాబు నాయక్ ఆధ్వర్యంలో జానావత్ బాబు నాయక్, భూక్యా సోమ్లా నాయక్, పెద్ద సుందర నాయక్, ఒత్తి స్వామి నాయక్, మిత్ర నాయక్, బాలు నాయక్, ఏ.సాంబయ్య, బి. శ్రీనివాసులు నాయక్, ఎం.నరేష్ నాయక్‌లతో పాటు 35 కుటుంబాలు పార్టీలో చేరారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. దర్శి నియోజకవర్గంలో వరుసగా పలు గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరటం సంతోషకరమని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మండలపు వెంకటరావు, మాజీ జడ్పీటీసీ కె.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

- మున్సిపల్ చైర్మన్ గఫార్



డాక్టర్ సునీతను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వివిధ విభాగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి మహిళా తన కుటుంబాన్ని చక్కదిద్దుకుంటూ వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్నారని చెప్పారు. మహిళలు అంతరిక్ష రంగంలోనూ రాణిస్తున్నారన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, అధికారులకు మ్యూజికల్ చైర్స్, త్రోబాల్, రన్నింగ్ గేమ్‌లాంటి క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడల్లో రాణించిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఆసుపత్రిలో మహిళా వైద్యురాలు సునీత, డాక్టర్ హేమసుధ, డాక్టర్ యోషితను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుడ్‌హెల్ప్ రమేష్, కరాటే మాస్టర్ రాజేష్, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

దర్శి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలో మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుధారాణితో పాటు పలువురు మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఎంఈవో బి.రమాదేవి, సీడీపీవో సీహెచ్ భారతి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మానస, బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాళ్ల లక్ష్మీరాజ్యం, పద్మావతి, విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, అనురాధ, సుభాషిణి, సునీతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.కృష్ణమూర్తి, ఎంఈవో రఘురామయ్య పాల్గొన్నారు.

కురిచేడులో..

కురిచేడు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా లయన్స్ ఇంటర్నేషనల్‌కు చెందిన రీజనల్ చైర్మన్ వీవీ రమణారావు, జోన్ చైర్మన్ జేవీ రామారావు, ఎంపీడీవో సతీష్ బాబు హాజరయ్యారు. ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, తహసీల్దార్ జి.రజనీకుమారి, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత, మాజీ హెచ్‌ఎం నక్కా విజయకుమారి, శ్రీరాఘవేంద్ర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.అన్నపూర్ణశాంతి, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి పద్మ, కన్యకా మహిళా మండలి అధ్యక్షురాలు పువ్వాడ సుజాత, గ్రంథపాలకురాలు సుమతి, మహిళా కానిస్టేబుల్ మొజిబిన్, పొట్లపాడుకు చెందిన సెట్టిపల్లి ఎల్లమ్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మానం రామాంజనేయులు, కె.రామకృష్ణ, సూరె నాసరయ్య గుప్తా, ఇందూరి వెంకట నర్సిరెడ్డి, గ్రంధిశిల అల్లూరి నాగరాజు, పోలేపల్లి లక్ష్మీనారాయణ, పువ్వాడ చలపతి రావు, సెట్టిపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు తక్కువ వడ్డీకి రుణాలు

పామూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక స్టేట్ బ్యాంకు శాఖలో మహిళా ఖాతాదారులకు డాక్టర్ ఎన్‌వీఏఎస్ దీక్షితులు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ అమారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో సగభాగం ఉన్న మహిళాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తమ బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీలకు రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. మహిళ ఖాతాదారులు ఆరోగ్య పరిరక్షణకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. అనంతరం పలువురుకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది జిలాని, వీరబ్రహ్మం, ఎస్.సురేంద్రరెడ్డి, కె.సాయిచరణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

శరవేగంగా విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులు

- 60 గ్రామాలకు తీరనున్న లోవోల్టేజీ సమస్య



గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణ పనుల కోసం తీసిన గుంతలు(ఫైల్)

తాళ్లూరు, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాంపురం సమీపంలో నిర్మిస్తున్న 133/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో దీనిని ఆర్భాటంగా ప్రారంభించారు. అయితే, ఇది ఆరంభశూరత్వంగా మారింది. నిర్మాణం కోసం తీసిన గుంతలు పూడిపోయాయి. నిర్మాణం కోసం కొనుగోలు చేసిన సామగ్రి తుప్పుపట్టిపోయింది. మరికొంత చోరీకి గురయింది. గత ఐదేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో ఉపకేంద్రం నిర్మాణ పను లు ఊపందుకు న్నాయి.

గత వైసీపీ ప్రభుత్వం 133/33 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణాన్ని రూ.22.7కోట్లతో చేపట్టింది. శివరాంపురం సమీపంలో తూర్పుగంగవరం-చీమకుర్తి రోడ్డు మార్గంలో నాలుగు ఎకరాల్లో ఈకేంద్రం నిర్మాణం చేపట్టారు. అప్పటి విద్యుత్‌శాఖమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి 2020లో భూమిపూజ చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి గుంతలు తీసి, సామగ్రిని తరలించారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిధుల విడుదలలో సరైన స్పష్టత లేకపోవటంతో పనులను నిలిపివేశాడు. గుంతలు పూడి చిల్ల చెట్లు మొలిచాయి. విద్యుత్ సామగ్రి తుప్పుపట్టిపోయింది.



కూటమి ప్రభుత్వంలో పూర్తవుతున్న కార్యాలయం భవనం

ఈ ఉపకేంద్రం నిర్మాణమైతే తాళ్లూరు మండలం తోపాటు పరిసర 60 గ్రామాలకు లోవోల్టేజీ సమస్య తీరుతుంది. ఉపకేంద్రం నిర్మాణపనులు పూర్తిచేస్తే తాళ్లూరు ప్రాంత ప్రజల, రైతుల విద్యుత్తు సమస్య పరిష్కారమవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టి పాటి లక్ష్మి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈఉపకేం ద్రం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని రా ష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్, ఆశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి రవికుమార్ 133/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులు చేపట్టి, త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈక్రమంలో అధికారులు, కాంట్రాక్టర్ ముందుకువచ్చి పనులు ప్రారంభించారు. కార్యాలయ నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. విద్యుత్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు దిమ్మెలు, చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం పూర్తిచేశారు. మిగిలిన పనులు కూడా వేగంగా సాగుతున్నాయి.



ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్

ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన

పామూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఫ్లోరోసిస్, క్యాన్సర్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారి డాక్టర్ వి.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నుచ్చుపొద గ్రామ పంచాయతి పరిధిలోని తిరగళదిన్నెలో ఫ్లోరోసిస్‌పై శుక్రవారం గ్రామస్థులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరూ తప్పకుండా రక్షిత నీటినే తాగాలన్నారు. అలాగే, పామూరు పట్టణంలోని 3,4, సచివాలయల పరిధిలో నిర్వహిస్తున్న క్యాన్సర్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్ రూబీనా, ఆరోగ్య విస్తరణాధికారులు ఎస్.బ్రహ్మానందం, పి.శ్రీధర్, టెక్నిషన్ కె.అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

పామూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న 33 కేవీ విద్యుత్ తీగలను సరిచేయాలని బొట్లగూడూరు గ్రామస్థులు కోరుతున్నారు. మండలంలోని బొట్లగూడూరు బీసీ కాలనిలో తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. పలుమార్లు విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలనీలో బోర్ వేస్తున్నక్రమంలో ప్రమాదశాత్తు బోర్ మిషన్‌కు విద్యుత్ తీగలు తగలడంతో కార్మికుడు బాలాజీనాయక్‌కు తీవ్రగాయాలయ్యాయి. గతంలో కూడా పలువురు విద్యుదాఘాతానికి గురైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్‌ను తప్పించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆదరణ పథకంపై అవగాహన కల్పించాలి

పీసీపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆదరణ పథకంపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదరణ3పై కులవృత్తి సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.బీసీ సంక్షేమం కోసం ప్రభుత్వం ఆదరణ 3 పథకాన్ని చేపట్టిందన్నారు. ఈ పథకం ద్వారా కులవృత్తి చేస్తున్న వారికి ప్రభుత్వం పరికరాలను సమకూర్చనుందని చెప్పారు. సమావేశంలో పాల్గొన్న చేనేత, వడ్డెర, నాయీబ్రాహ్మణ, తదితర సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ విద్యుత్ ద్వారా పనిచేసే ఆధునిక పనిముట్లు ఇస్తే తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. విద్యుత్ బిల్లులను కూడా ప్రభుత్వమే చెల్లించే విధంగా చూడాలన్నారు. సమావేశంలో వివిధ సామాజిక కులవృత్తి సంఘాల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

సీఎస్‌పురం(పామూరు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ఖైలుచర్ల గ్రామాన్ని నాటుసారా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆర్ నరహరిరావు, కనిగిరి ఎక్సైజ్ సీఐ విజయబాస్కరరావు పేర్కొన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇందులోభాగంగా ఖైలుచర్ల గ్రామంలో నాటుసార గురించి రెండోరోజు శుక్రవారం గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నాటు సారా సేవించడం వలన కలిగే దుష్పరిణామాలు గురించి గ్రామస్థులకు వివరించారు. నాటు సారా కేసులు నమోదైతే ప్రభుత్వ పథకాలు అందకుండాపోయే ప్రమాదం ఉందన్నారు. ఈసందర్భంగా సారా తయారుచేస్తున్న డ్రమ్ములను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.వెంగయ్య, బి.వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఎన్‌సీ మాలకొండయ్య, బి.వెంకటాద్రి, కేవీ కొండయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రామభద్రాపురంలో రీసర్వే

తాళ్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో రామభద్రాపురం గ్రామాన్ని మోడల్ పైలట్ రీసర్వే గ్రామంగా ఎంపికచేశారు. ఈక్రమంలో గత 20 రోజులుగా రీసర్వే నిర్వహించారు. శుక్రవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరావు మాట్లాడారు. గ్రామంలో సర్వే జరిగిన సమయంలో రైతులకు ముందస్తు నోటీసులు ఇచ్చినట్టు చెప్పారు. రెవెన్యూ సిబ్బంది రైతుల సమక్షంలోనే భూముల కొలతలను తీశారన్నారు. కార్యాలయ రికార్డుల ఆధారంగా భూమిలో ఉన్న హక్కుదారుని వివరాలు పూర్తిగా నమోదు చేసినట్టు చెప్పారు. రీసర్వే ఆధారంగా మ్యుటేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. రీసర్వేలో ఏవైనా అభ్యంతరాలు, సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ ప్రశాంత్, మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, వీఆర్‌వోలు చంద్రశేఖర్‌రావు, కాశింబీ, రమణారెడ్డి, విలేజ్ సర్వేయర్‌లు భవానీ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండపై చిన్నచూపు తగదు!

కనిగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశం వరదాయిని వెలిగొండ ప్రాజెక్టుపై ప్రభుత్వానికి చిన్నచూపు తగదని సీపీఐ నాయకుడు యాసిన్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం సీఎం చంద్రబాబునాయుడు మార్కాపురంకు వస్తున్నారన్నారు. ఆయన పర్యటనలో వెలిగొండ సందర్శన కార్యక్రమాన్ని రద్దు చేయటం బాధాకరమన్నారు. బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు కేవలం రూ.390 కోట్లు మాత్రమే కేటాయించడం శోచనీయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మొదటి టన్నెల్ పూర్తయిందని, నీరు విడుదల చేస్తున్నామని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పి ప్రజల్ని మోసగించారన్నారు. సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును సందర్శించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా పెదరావిపాడు - నాయుడుపాలెం రహదారి



పెదరావిపాడు - నాయుడుపాలెం రహదారి దుస్థితి

ముండ్లమూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పెదరావిపాడు - నాయుడుపాలెం పంచాయతీరాజ్‌కు చెందిన తారురోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహన చోదకులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. దశాబ్ద కాలంగా మరమ్మతుల గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. మూడు కిలోమీటర్ల రహదారి గుంతలమయమైంది. వాహన చోదకులు కూడా వెళ్ళలేని దుస్థితి నెలకొంది.

1997లో అప్పటి మార్టూరు ఎమ్మెల్యే స్వర్గీయ గొట్టిపాటి నరసింహారావు నాబార్డు నిధులతో రావిపాడు నుంచి నాయుడుపాలెం వరకు మూడు కిలో మీటర్ల వరకు తారు రోడ్డు నిర్మించారు. దశాబ్ద కాలం మాత్రం రహదారి బాగానే ఉంది. 15 సంవత్సరాల నుంచి రహదారి అంతా గోతులమయమై కంకర లేచిపోయింది. దీంతో వాహన చోదకుల పడరానిపాట్లు పడుతున్నారు. మండలకేంద్రమైన ముండ్లమూరు, దర్శి అద్దంకి పట్టణాలకు ఈ మార్గంలో వెళ్లాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు. గత్యంతరం లేనిపరిస్థితిలో అష్టకష్టాలు పడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. రాత్రుల సమయాల్లోనైతే కొత్త వ్యక్తులు, వాహన చోదకులు వేగంగా వెళ్ళి గోతుల్లో పడి క్షతగాత్రులైన సందర్భాలు ఉన్నాయి. పలుమారు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించు కున్న దాఖలాలులేవు.

ఇప్పటికైనా అధికారులు, ప్రజానిధులు స్పందించి ఈ రహదారిని బాగుచేసి తమ ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



6

అన్నింటా.. ఆమె

ఆమె.. ఇంటితో పాటు పాలనా వ్యవహారాలను, సమాజాన్ని, పరిశ్రమలను చక్కదిద్దుతున్నది. కుటుంబ బాగోగులు ఏ విధంగా అయితే చూసుకుంటారో అదే రీతిన సమాజాన్ని, విధివంచితులను ఆదుకునేందుకు ముందడుగు వేస్తున్నారు. సేవారంగంలోనూ, పారిశ్రామికవేత్తలుగా రాణిస్తూ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. అపరిమితమైన ప్రేమను సేవాభావంతో సాటి మహిళలకు, సమాజానికి పంచుతున్నారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమై కేవలం గృహిణిగానే మిగిలిపోయిన సగటు మహిళ నేడు ఆకాశమే హద్దుగా దూసుకు పోతోంది. ఆకాశంలో సగమైన ఆధునిక మహిళ అన్ని రంగాల్లో తన సత్తా చాటడమే కాదు.. అనేక రంగాల్లో తనదైన ముద్ర వేస్తోంది. ఒకప్పుడు వంటిట్లో గరిటతో సహవాసం చేసిన మహిళ సేవారంగంలో అమ్మగా.. రాజకీయాల్లో రాజసంగా.. పాలనలో పథగామిగా.. పోరాటంలో వీరవనితగా.. ముందడుగు వేస్తోంది. అబల అంటూ సమాజం తనపైన వేసిన ముద్రను చెరిపేస్తూ తన 'సబల'త్వాన్ని ప్రపంచానికి చాటి చెబుతోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో స్ఫూర్తి దాయకంగా ఎందరో మహిళలు ఉన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్ఫూర్తిదాయక మహిళల్లో కొందరు గురించి ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం..

- సేవ నుంచి సమరం వరకు సబలలు
- ఎందరికో స్ఫూరిగా మారి అద్భుతాలు సృష్టి
- అమరావతి ఉద్యమంలో ఉద్భవించిన వీరమాతలు
- సంక్రమణ వ్యాధుల పనిపట్టేలా డాక్టర్ శారద కృషి
- ఆక్వా పరిశ్రమలో ఆదర్శప్రాయంగా అనంత విజయ
- షిప్ సంస్థ ద్వారా హెచ్ఐవీ బాధితులకు బాసటగా రమాదేవి
- మదర్ థెరిస్సా స్ఫూర్తితో అనాథ పిల్లల సేవలో డాక్టర్ మంగాదేవి
- అధికారి నుంచి ప్రజాప్రతినిధుల వరకు కీలక బాధ్యతలు

* అమరావతి రాజధాని కలిగిన కీలకమైన గుంటూరు జిల్లా బాధ్యతలను మహిళా అధికారులైతేనే సమర్థవంతంగా నిర్వహిస్తారన్న భావనతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వమ్ము చేయకుండా పాలన, అభివృద్ధి అంశాల్లో రాణిస్తున్నారు. రాజకీయ చైతన్యానికి మారుపేరుగా నిలిచిన ఉమ్మడి గుంటూరు జిల్లాలో అటు రాజకీయ నాయకులు, ఇటు ప్రజలు, మరోవైపు ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గుంటూరు జిల్లాలో కీలకమైన 16 ప్రభుత్వ శాఖలకు మహిళలే నాయకత్వం వహిస్తున్నారు.

* నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి ఆయువు తీసేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించగా గ్రామీణ మహిళలు కులమతాలకు అతీతంగా రోడ్డెక్కి చేసిన పోరాటం దేశాన్నే ఆశ్చర్యపరిచింది. ప్రభుత్వ కుట్రలను ధీరోదాత్తంగా ఎదుర్కొని అమరావతి సమరావతిగా మారింది.. అబలలుగా ముద్రపడిన మహిళలు సబలలుగా మారి ఐదేళ్లపాటు పోరాటం చేసి అమరావతిని అజరామరం చేశారు.

* చిన్న వయసులోనే హెచ్ఐవీతో భర్తను కోల్పోయి.. అయినవాళ్ల అవమానాలతో కుంగిపోకుండా తనలా మారిన ఎందరో బాధితులను అక్కున చేర్చుకున్న సగటు మహిళ.. ఆదర్శ మహిళగా షిప్ సంస్థ వ్యవస్థాపకురాలు గుంటూరుకు చెందిన రమాదేవి నిలిచారు.

* బాపట్లలోని బెస్తపాలెం నుంచి ఆక్వా రంగంలో అత్యున్నత శిఖరాలు అందుకున్న మత్స్యకార మహిళ అనంత విజయ అవార్డులతో పాటు ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. మహిళలను నిర్లక్ష్యం చేయకుండా ప్రోత్సహిస్తే ఉన్నతంగా రాణిస్తారని అనంత విజయ నిరూపించారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న శారద

* చిన్నారుల కోసం మంచి పాఠశాల నిర్వహిస్తున్నారు కదా.. అనాథల పిల్లల కోసం కూడా ఏదైనా చేయగలరేమో.. ఆలోచించండి అన్న మదర్‌థెరిస్సా మాటలతో చేతన సంస్థను ఏర్పాటు చేసి కొండరాళ్లు కొట్టి పొట్ట పోసుకుంటున్న కుటుంబాల పిల్లలను ఇంజనీర్లు, డాక్టర్లుగా డాక్టర్ మంగాదేవి మార్చారు. వందల మంది విద్యార్థులను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు చెప్పే దేవాలయంగా చేతన పాఠశాలను మార్చారు.

* డాక్టర్‌గా నాలుగు గోడల మధ్య వైద్యం అందించడానికి పరిమితం కాకుండా సాటి మహిళల కష్టాలు తీరుస్తూ తెనాలికి చెందిన డాక్టర్ శారద మేటి మహిళగా నిలిచారు. సాటి మహిళల కోసం తన వంతుగా సేవ చేసే అవకాశం దక్కడాన్ని డాక్టర్ శారద గర్వంగా భావిస్తున్నారు.

15న శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీవారి ధర్మ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఈవో శ్యామలరావు

- వెంకటపాలెంలో హాజరుకానున్న సీఎం చంద్రబాబునాయుడు
- ఏర్పాట్లపై అధికారులతో చర్చించిన టీటీడీ ఈవో శ్యామలరావు

తుళ్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామం వెంకటపాలెంలోని టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవం ఈ నెల 15న జరగనుంది. సీఎం చంద్రబాబు ఈ కల్యాణోత్సవానికి కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఆలయం ముందున్న ఆవరణలో కల్యాణోత్సవం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్‌తో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థాన ఈవో శ్యామలరావు చర్చించారు. కల్యాణానికి 20 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు ఈవో శ్యామలరావు విలేకర్లకు చెప్పారు. భక్తులకు తాగునీరు, అన్న ప్రసాదాలు అందజేస్తామని తెలిపారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. కల్యాణం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం శ్రీవారి ధర్మ ప్రచార రథాన్ని ఈవో శ్యామలరావు జెండా ఊపి ప్రారంభించారు. శ్రీవారి ధర్మ రథాల ద్వారా రాజధానిలో ప్రచారం ప్రారంభించినట్లు చెప్పారు. కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. దేవాలయం వద్ద చేయాల్సిన ఏర్పాట్ల శుక్రవారం కలెక్టర్, ఎస్పీ అధికారులతో సమీక్షించారు. వీవీఐపీ, వీఐపీల రాకపోకల మార్గాలను, కల్యాణోత్సవ వేదిక, భక్తులు ఆశీనులయ్యే ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ కార్యదర్శి వినయ్‌చంద్, డీఎస్పీ మురళీ కృష్ణ, సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆర్డీవో శ్రీనివాసరావు, సీఆర్డీఏ, రెవెన్యూ అధికారులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్

- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి అనగాని

అద్దంకి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకానుంది. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. రాష్ట్రంలో కొత్తగా అద్దంకి, మడకశిర రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి ప్రకటించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశంపై సానుకూలంగా ప్రభుత్వానికి కలెక్టర్ వెంకటమురళి నివేదిక పంపినట్లు తెలుస్తోంది. మండల వ్యవస్థ రాకముందు అద్దంకి తాలూకా కేంద్రంగా ఉంది. అయితే మండల వ్యవస్థ రావడంతో అద్దంకి మండల కేంద్రంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాల విభజన చేసిన సమయంలో అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పడుతుందని ఆశించారు. అటు జిల్లా కేంద్రం, రెవెన్యూ డివిజన్‌కు దూరంగా ఉన్న అద్దంకిని రెవెన్యూ డివిజన్ చేయకుండానే వదిలేశారు. ఈ క్రమంలో కూటమిప్రభుత్వంలో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా అద్దంకి రెవెన్యూడివిజన్‌గా మార్చేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.22 (శనివారం)
సహరి : 5.04 (ఆదివారం)

మున్సిపాలిటీలకు.. షాక్



మునిసిపాల్టీ	నిధుల విడుదల
గుంటూరు	24,25,85,000
తెనాలి	5,25,92,000
చిలకలూరిపేట	4,73,72,000
మాచర్ల	2,05,58,000
సత్తెనపల్లి	1,94,45,000
వినుకొండ	2,05,92,000
పిడుగురాళ్ల	2,22,47,000
చీరాల	2,82,01,000
దాచేపల్లి	1,61,85,000
గురజాల	1,18,03,000

- ఆర్థిక సంఘం నిధులు నిలిపివేత
- ఎన్నికలు నిర్వహిస్తేనే నిధులని తేల్చేసిన కేంద్రం
- రూ.కోట్లలో నిధులను కోల్పోయిన ఏడు పురపాలక సంఘాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు నిర్వహించని, ఆస్తి పన్ను అసెస్మెంట్లలో ప్రగతిలేని మున్సిపాల్టీలకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిపివేసింది. పాలకవర్గం లేదనే కారణంతో నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి, రేపల్లె, అద్దంకి మున్సిపాల్టీలు పెద్దఎత్తున నిధులను కోల్పోయాయి. ఆర్థిక సంఘం నిధులే ప్రధాన ఆదాయ వనరైనా ఆ నిధులు లేక పోవడంతో ఆయా పురపాలక సంఘాల్లో ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. స్థానిక సంస్థలను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏటా కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోంది. అయితే పాలకవర్గాలు, ఆస్తి పన్ను అసెస్మెంట్ల పురోగతి ఉంటేనే నిధులు విడుదల చేయాలన్న నిబంధనను కేంద్రం విధించింది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించని ఫలితంగా ఏడు మున్సిపాలిటీలకు నిధులు నిలిచిపోయాయి. 2023-24 ఆర్థికం సంవత్సరం రెండో విడతలో గుంటూరు కార్పొరేషన్ సహా తొమ్మిది మున్సిపాల్టీలకు రూ.48.10 కోట్లను కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. అయితే పాలకవర్గాలు లేని నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి మున్సిపాల్టీలకు, ఆస్తి పన్ను అసెస్మెంట్లలో ప్రగతి లేని రేపల్లె, అద్దంకి మున్సిపాల్టీలకు ఆర్థిక సంఘం నిధులను కేంద్రం నిలిపివేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా అక్టోబరు, రెండో విడతగా ఫిబ్రవరిలో కేంద్రం నిధులు విడుదల చేసింది. అయితే ఈ ఏడు మున్సిపాల్టీలకు మాత్రం నిధులు జమ కాలేదు. నరసరావుపేటకు పొరుగున ఉన్న చిలకలూరిపేట మున్సిపాల్టీకి తాజాగా రూ.4.73 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఇదే స్థాయిలో నరసరావుపేట సహా మిగిలిన మున్సిపాల్టీకి నిధులు సమకూరే వీలుండేది. ఆయా నిధులు సమకూరి ఉంటే పట్టణాల్లో చాలా వరకు రహదారులు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతుల కల్పన చేపట్టే అవకాశం ఉండేది. పాలకవర్గం లేదనే కారణంతో ఇప్పుడు ఈ నిధులు నిలిపేయడంతో వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆర్థిక సంఘం నిధులు నిలిపివేయడంతో ఎన్నికల నిర్వహణ అనివార్యమైంది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తేనే ఆయా మున్సిపాలిటీల్లో ప్రగతి ముందడుగు వేసే అవకాశం ఉంటుంది.

ఆ మున్సిపాల్టీల్లో విచిత్ర పరిస్థితి

ఆర్థిక సంఘం నిధుల విడుదలకు ఉన్న నిబంధనల్లో పాలక వర్గాలు ఒకటైతే.. పురపాలక సంఘాల్లో ఉన్న అసెస్మెంట్ల పెరుగుదల కూడా మరో నిబంధన. ఏటా ఉన్న అసెస్మెంట్లలో 15 శాతం వృద్ధి ఉండాలి. అయితే రేపల్లె, అద్దంకి మున్సిపాల్టీల్లో ఏటా అసెస్మెంట్ల వృద్ధి తక్కువగా ఉంది. దీంతో కేంద్రం ఈ మున్సిపాలిటీలకు రెండు విడతలుగా ఆర్థిక సంఘం నిధులను నిలిపేసింది.

వార్డుల పునర్విభజన తకరారు..

గతంలో నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు మున్సిపాల్టీల్లో పొరుగున ఉన్న పంచాయతీ లను విలీనం చేసి వార్డుల సంఖ్యను పెంచారు. ఈ ప్రక్రియలో అధికారులపై ఒత్తిడి తెచ్చి వైసీపీ నేతలు వారికి అనుకూలంగా వార్డుల పునర్విభజన చేయించారు. వార్డుల విభజన సక్రమంగా జరగలేదని అభ్యంతరాలు వచ్చినా అధికారులు లక్ష్యపెట్టలేదు. ఫలితంగా బాధితులు కొందరు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆయా మున్సిపాల్టీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. మంగళగిరి.. తాడేపల్లి మున్సిపాల్టీలను విలీనం చేసి గ్రేటర్ మంగళగిరిగా వైసీపీ ప్రభుత్వం మార్పు చేసింది. ఈ ప్రక్రియలో జరిగిన జాప్యం కారణంగా ఈ రెండు మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించలేదు. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడంలేదు. దీంతో ఇప్పటికే ఈ మున్సిపాలిటీలకు రెండు విడతల్లో ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఎన్నికలు జరిగి పాలక వర్గాలు కొలువు దీరే వరకు ఆయా పురపాలక సంఘాలు ఆర్థిక సంఘం నిధులు కోల్పోనున్నాయి.

నాడు అరాచకాలు.. నేడు అక్రమాలు



హైకోర్టును బురిడీకొట్టించిన వ్యవహారంతో కలకలం

- అజ్ఞాతంలో బోరుగడ్డ.. ఇంటికి తాళాలు.. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్
- బెయిల్‌పై బయటకువచ్చిన తర్వాత నకిలీ సర్టిఫికెట్ వెలుగులోకి ..

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాడు అరాచకాలతో బెంబేలెత్తించిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్.. నేడు అక్రమాలకు తెరలేపాడు. ప్రభుత్వం ఏదైనా.. అధికారంలో ఎవరున్నా సరే తగ్గేదే లేదంటున్నాడు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా ప్రవర్తించిన బోరుగడ్డ ఆ తర్వాత కూడా తన నేర ప్రవృత్తిని కొనసాగిస్తూనే ఉన్నాడనేందుకు అనేక సంఘటనలు వెలుగుచూశాయి. పోలీస్‌స్టేషన్‌లో రాచమర్యాదలైనా.. కస్టడీలో పోలీసులతో కలసి రెస్టారెంట్‌లో విందు అయినా.. చివరకు న్యాయ వ్యవస్థకు సైతం సవాల్ విసిరి దర్జాగా బయట తిరుగుతున్నాడు. తల్లికి సీరియస్‌గా ఉందని అత్యవసరంగా చెన్నై అపోలో ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించాలని గుంటూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ సర్టిఫికెట్ సృష్టించి హైకోర్టు నుంచి బెయిల్ పొడిగించుకుని అజ్ఞాతంలోకి వెళ్లిన వ్యవహారం కలకలం రేపు తోంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారంతో పోలీ సులు కంగుతిని ఇప్పుడు హడావుడి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు బోరుగడ్డ అనిల్ రాజ్యాంగేతర శక్తిగా రెచ్చిపోయాడు. అప్పటి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వారిపై అసభ్య పదజాలం, దూషణలతో సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోయాడు. ఎవరైనా ప్రశ్నిస్తే నేరుగా సీఐడీ అధికారులతో వారిని బెదిరించాడు. గడిచిన ఐదేళ్ల ప్రభుత్వ వ్యవస్థలన్నీ తన గుప్పెట్లో ఉన్నాయన్నట్లుగా ప్రవర్తిస్తూ అత్యంత హేయమైన భాషలో రెచ్చిపోయాడు. మహిళలు సిగ్గుతో తల దించుకునే విధంగా అసభ్యకరమైన పదజాలంతో బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్‌స్టేషన్లలో బోరుగడ్డ అనిల్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గుంటూరులోని ఏఈఎల్సీ చర్చి ట్రెజరర్ బాబుప్రకాష్‌పై హత్యాయత్నం కేసులో బోరుగడ్డ అనిల్‌ను గత అక్టోబరు 15న అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో 14 కేసులు నమోదు కాగా పోలీసులు కోర్టులలో పిటి వారెంట్లు దాఖ లు చేసి సంబంధిత కోర్టుల్లో హాజరు పరిచారు. తాను కేంద్ర మంత్రి పీఏని అంటూ అనంతపురం జిల్లాకు చెందిన కలెక్టర్, ఎస్పీకి ఫోన్ చేసి చర్చి ఆస్తులు వివాదంలో తలదూర్చి బెది రింపులకు పాల్పడ్డాడు. ఆ కేసులో రాజమండ్రి సెంట్రల్ జైల్లో గత అక్టోబరు నుంచి రిమాండ్‌లో ఉన్నాడు. ఈ క్రమంలో అనేకసార్లు బెయిల్ కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. అయితే అనంత పురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో అక్కడ జిల్లా కోర్టు బోరుగడ్డ బెయిల్ తిరస్కరించింది. దీంతో గత ఫిబ్రవరి 14న హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకున్నాడు. తన తల్లికి ఆరోగ్యం సరిగాలేదని వైద్యం చేయించాలని కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఫిబ్రవరి 28 సాయంత్రం వరకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఫిబ్రవరి 15న విడుదలయ్యాడు. హైకోర్టు ఆదేశాల మేరకు ఫిబ్రవరి 28న రాజమండ్రి కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ముందు లొంగిపోయాడు. అయితే తన తల్లి పద్మావతి ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతుందని, ఆమెకు చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో అత్యవసర చికిత్స అందించాలని గుంటూరులోని లలితా ఆస్పత్రికి చెందిన డాక్టర్ రాఘవ శర్మ సిఫార్సు చేసినట్లు ఆయన లెటర్ హెడ్ పై సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ మెడికల్ సర్టిఫికెట్ సృష్టించి కోర్టులో బెయిల్ పొడిగింపు కోసం దాఖలు చేశాడు. అది నిజమైనదేనని నమ్మిన హైకోర్టు ఆయనకు ఈ నెల 11 వరకు బెయిల్ మంజూరు చేసింది. 11న సాయంత్రం జైలు సూపరింటెండెంట్ ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. అయితే ఆయన దాఖలు చేసిన సర్టిఫికెట్‌పై ఎటువంటి సమాచారం లేదని పీపీ వాదించడంతో ఆ సర్టిఫికెట్ ప్రామాణికతపై విచారించాలని కోర్టు ఆదేశించింది. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత నకిలీ సర్టిఫికెట్ విషయం వెలుగుచూడటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అయితే ఇప్పటికే బోరుగడ్డ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. చెన్నై అపోలో ఆస్పత్రిలో పోలీసులు విచారించగా ఈ నెల 3న బోరుగడ్డ పద్మావతి డిశ్చార్జ్ అయినట్లు తేలింది. అయితే ఆ తర్వాత నుంచి ఆమె గాని, బెయిల్‌పై బయటకు వచ్చిన ఆమె తనయుడు అనిల్ ఆచూకీగాని తెలియరాలేదని పోలీసులు అంటున్నారు. అనిల్ నకిలీ సర్టిఫికెట్ సృష్టించిన విషయం పక్కన పెడితే ఆయనకు హైకోర్టు ఈనెల 11 వరకు బెయిల్ పొడిగించింది. ఈలోపు కోర్టు నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాని పక్షంలో ఈ నెల 11 వరకు బోరుగడ్డ అనిల్ బయట తిరిగే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే పోలీసులు అతడి కదలికలను పసిగట్టేందుకు ప్రయత్నిస్తున్నా ఎటువంటి సమాచారం అందడం లేదు. గుంటూరు అమరావతిరోడ్డులోని వేళాంగణినగర్‌లోని బోరుగడ్డ అనిల్ ఇంటికి తాళాలు వేసి ఉన్నాయి. ఆయన సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. దీంతో ఆయన కదలికలు ప్రశ్నార్థకంగా మారాయి.

బాపట్లలో మహిళా దినోత్సవ సంబరం

- పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళా ఉద్యోగులు

బాపట్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీజేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో సంబరాలు జరిగాయి. మహిళా ఉద్యోగులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ మహిళలపై లింగవివక్ష లేకుండా ప్రతి కుటుంబంలో చిన్నారులను నైతిక విలువలతో పెంచాలని, అప్పుడే సమాజంలో అత్యాచారాలు జరగకుండా నివారించగలమన్నారు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సగభాగం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. మహిళల రక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వివిధ పోటీలలో గెలుపొందినవారికి కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారుల నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా ఖజానా శాఖాధికారి కామేశ్వరి, పౌర సంబంధాల అధికారి కె.సుబాషిణి, సీడీపీవో లక్ష్మీపార్వతిలను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్ గౌడ్, సీపీవో శ్రీనివాస్, డీఎస్‌డీవో కె.పాల్‌కుమార్, జేఏసీ చైర్మన్ సురేష్, మహిళా విభాగ చైర్మన్ రజని తదితరులు పాల్గొన్నారు.





టగ్గాఫ్ వార్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, పోటీలలో పాల్గొన్న మహిళలు



మహిళా పారిశ్రామిక వేత్త అనంత విజయకు బెస్ట్ ఫిషర్ ఎంటర్‌ప్రైజర్ అవార్డు అందజేస్తున్న మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు (ఫైల్)

బెస్ట్ ఫిషర్‌గా అనంత విజయ

● బెస్తపాలెం నుంచి ఎదిగిన పారిశ్రామికవేత్త

బాపట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో 462 హేచరీలు ఉన్నాయి. అయితే ఓ మహిళ ఆధ్వర్యంలోనూ హేచరీలు ఉన్నాయంటే ఆశ్చర్య పోవాల్సింది. అయితే అందరినీ ఆశ్చర్య పరచడమే కాకుండా ఎందరో ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.. బాపట్ల పట్టణంలోని బెస్తపాలేనికి చెందిన మత్స్యకార మహిళ అనంత విజయ. మత్స్యకార కుటుంబంలో పుట్టిన ఆమె ఆక్వా పరిశ్రమలో రాణిస్తున్న తీరు ఎందరికో ఆదర్శప్రాయంగా మారింది. బాపట్ల మండలం ధరివాదకొత్తపాలెంలో లక్షిత బయో రిసోర్సెస్, అన్నవరంలో లాలిత్య హెచరీస్ పరిశ్రమలను ఆమె నిర్వహిస్తున్నారు. హెచరీలో వనామి రొయ్యపిల్లలను ఉత్పత్తి చేస్తుండగా బయో రిసోర్సెస్ మందు ఫిష్ బ్రీడింగ్, అలంకరణ చేపల బ్రీడింగ్ తయారు చేస్తున్నారు. వీటి ద్వారా అనేకమందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఏడాదికి రూ.1.8 కోట్ల టర్నవర్ చేస్తున్నారు. బాపట్లలో స్కిల్ కాలేజి నిర్వహిస్తూ యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు కూడా ఆమె కృషి చేస్తున్నారు. రాబోయే రోజుల్లో అలంకరణ చేపల బ్రీడింగ్‌ను మలేషియా, సింగపూర్, అమెరికా వంటి దేశాలకు పంపించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆమె ప్రతిభను గుర్తించి ఇటీవల ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర బెస్ట్ ఫిషర్ ఎంటర్‌ప్రైజర్ అవార్డు ఇచ్చారు. న్యూఢిల్లీకి చెందిన ఆలిండియా ఫిషర్మెన్ మెగా కన్వెన్షన్ కానిస్టేషనల్ క్లబ్ బెస్ట్ ఫిసర్ ఉమెన్ ఎంటర్‌ప్రైజర్ అవార్డుతో సత్కరించింది.


రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకొన్న ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

బల్లికురవ. మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారుల బృందం శుక్రవారం తెల్లవారు జామున పట్టుకొని బల్లికురవ పోలీసు స్టేషన్‌కు అప్పగించింది. అందిన సమాచారం మేరకు మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామం నుంచి అక్రమ మార్గంలో సుమారు 54 బస్తాల రేషన్ బియ్యాన్ని మినీ వ్యాన్‌లో తరలిస్తుండగా బల్లికురవ మండల కేంద్రానికి సమీపంలో కాపు వేసిన ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు తనిఖీలు చేసేందుకు నిలుపుదల చేయగా డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పరారు అయ్యాడు. వెంటనే అధికారులు బియ్యం వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. బియ్యం తరలిస్తున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. ఈ తనిఖీలలో అద్దంకి, మార్టూరు, రేపల్లె డీటీలు సుధీర్‌కుమార్, అబ్రహం, ఓంకార్, డీఎస్‌వో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఎండీపీడీ

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

బల్లికురవ. మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఆడపిల్లలను ఉన్నత విద్యా వంతులుగా చదివిస్తే వారి కుటుంబాలు కూడా ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీలక్ష్మి, పశువైద్యాధికారిణి పావనీకుమారి, కేజీబీవీ ప్రిన్సిపాల్ సరళకుమారి తదితరులు పాల్గొన్నారు.

పులి మృతి ఘటనలో ఇద్దరు అధికారులపై వేటు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : విధులు నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న ఇద్దరు ఫా రెస్టు అధికారులపై మార్కాపురం డీఎఫ్‌వో గుండాల సందీప్‌కృపాకర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఎర్ర గొండపాలెం మండలంలోని కొలుకుల బీట్ పరిధిలో ని అటవీ ప్రాంతంలో గత నెల 17న అటవీ జంతు వుల కోసం వేటగాళ్లు ఉచ్చులు వేశారు. ఆ ఉచ్చుల్లో చిరుత పులి చిక్కుకుని మృతి చెందిన సంగతి తెలి సిందే. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు నిందితులను అటవీశాఖ అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఘటనపై అధికారులు పూర్తిస్థాయిలో వి చారించారు. విధులలో నిర్లక్ష్యంగా ఉన్నారని విచా రణలో తెలడంతో కొలుకుల బీట్ సెక్షన్ ఆఫీసర్ బి. సక్కునాయక్, బీట్ ఆఫీసర్ టి.నాగేశ్వరరావులను స స్పెండ్ చేసినట్లు ఎర్రగొండపాలెం, గంజివారిపల్లి ఫా రెస్ట్ రెంజర్ సుబ్బారావు శుక్రవారం తెలిపారు.

'ఎత్తిపోతల' ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన దొంగలు

టంగుటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొందూరు ఎత్తిపోతల పథకంలో మ రోసారి చోరీ జరిగింది. దొంగలు గురువారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి వైరు కోసం వె తికారు. అందులో అల్యూమినియం తీగ ఉండటం తో ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడే వదిలేసి వెళ్లిపో యారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ అంతా బయ ట పారబోశారు. రెండు నెలల క్రితం ఇక్కడే దొం గతనం జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఛిద్రంచేసి అం దులోని రాగితీగను దొంగలు అపహరించుకెళ్లారు. రైతులే చందాలు వేసుకొని రూ.5లక్షలు వెచ్చించి బాగుచేసుకొని వినియోగంలోకి తెచ్చారు. మళ్లీ దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టడంతో ఆయ కట్టుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చోరీపై టంగుటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సూచన మేరకు క్లూస్ టీం రంగంలోకి దిగి ఘటనా స్థలంలో వేలిముద్రలను సేకరించింది.

గుంతల రోడ్లకు వీడిన గ్రహణం

కూటమి ప్రభుత్వం రాకతో మోక్షం
వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన వైనం
నేడు శరవేగంగా అభివృద్ధిపనులు

పర్చూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి) వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచకోక ఆగిపోయిన పనులకు గ్రహణం వీడినట్లయ్యింది. కూటమి పాలనతో రోడ్ల రూపు రేఖరుల మారుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రహదారుల అభివృద్ధికి చర్యలు చర్యలు చేపట్టక పోవటంతో ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయం కావటంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉంది. రోడ్లు అధ్వానంగా మారటంతో ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి ఉంది. ప్రధాన రహదారులు సైతం గుంతల మయం అయినా గంపెడు మట్టి కూడా పోసిన దాఖలాలు లేవు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో రోడ్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా తొలివిడత రోడ్లకు ఏర్పడిన గుంతలను పూడ్చే విధంగా చర్యలు చేపట్టింది. నిన్నా మొన్నటి వరకు గుంతలు మయం అయి అస్తవ్యస్తంగా మారిన రోడ్లు నేడు రూపురేఖలు మారిపోయాయి.



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పర్చూరు - గుంటూరు రోడ్డు పరిస్థితి ఇలా



ప్రజా కూటమి ప్రభుత్వం రాకతో అభివృద్ధి చేసిన పర్చూరు -గుంటూరు రోడు

వినియోగంలోకి రానున్న ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం

పర్చూరులో రూ.2కోట్ల వ్యయంతో అప్పటి తెలుగుదేశం పార్టీ హయాంలో నిర్మాణం చేసుకున్న ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. టీడీపీ ప్రభుత్వం మారటం వైసీపీ అధికారంలోకి రావటంతో కొద్దిపాటి నిధులు సమకూర్చి వినియోగంలోకి తీసుకువచ్చే క్రీడా వికాస కేంద్రాన్ని పక్కన పట్టింది. దీంతో క్రీడాకారులకు క్రీడా వికాస కేంద్రం అందని దాక్షలా మారింది. టీడీపీ ప్రజా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరుణంలో క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలన్న సంకల్పంతో యద్ధప్రాతిపతికన స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషితో రూ.20 లక్షల నిధులు కేటాయించి వినియోగంలోకి వచ్చే విధంగా కార్యాచరణ రూపొందించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇలాంటి పనులు నియోజకవర్గంలో అనేకం జరుగుతున్నాయి.


క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకు వచ్చే విధంగా చేపడుతున్న పనులు

సబలల సమరం

చారిత్రాత్మక విజయంగా అమరావతి పోరు
ఇంటి పని చేసుకుంటూనే
ఐదేళ్లు ధీరోదాత్త పోరాటం

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అప్పటి వరకు ఆ మహిళలు ఇళ్లకే పరిమితం. ఇళ్లలో లేదంటే వ్యవసాయ పనుల్లోనే నిమగ్నం. అలాంటి వారు ఆంధ్రుల కలల రాజధాని కోసం ఐదేళ్ల ధీరోదాత్త పోరాటం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆయువు కోల్పోయే దయనీయ స్థితి నుంచి అమరావతిని రక్షించుకున్నారు. పోలీసుల దౌర్జన్యాలు, లాఠీచార్జీలు.. కేసులు.. దాడులు.. అధికారం.. అవమానాలు.. కుట్రలెన్నింటినో ఎదుర్కొని ఐదేళ్ల పోరాటం చేసి అమరావతిని రాజధాని గ్రామాల మహిళలు అజరామరం చేశారు. సాధారణ గృహిణులుగా ఉండే మహిళలు ఉద్యమబాట పట్టి అసాధారణ వీర వనితలుగా ఎదిగారు. కుల, మతాలకు అతీతంగా సాగిన వారి పోరాటంతో నవ్యాంధ్ర కలల రాజధాని తిరిగి పునర్జీవం పోసుకుంది. ఎందరో వీర వనితలు బయటి ప్రపంచానికి తెలియకుండా ఉద్యమానికి ఊపిరులూదారు. వారికి ప్రతీకలుగా ఒకరిద్దరి గురించి..

వెనకడుగు వేయలేదు


షేక్ వహీదా రెహమాన్

వెలగపూడి గ్రామానికి చెందిన షేక్ వహీదారెహమాన్. రాజధాని కోసం ఎకరంన్నర పొలం ఇచ్చారు. దంపతులిద్దరూ ఉద్యమంలో ముందుండేవారు. కరోనా సోకి భర్త హిమాంసాహెబ్ చనిపోయారు. అయినా రెహమాన్ వెనకడుగు వేయలేదు. బిడ్డలను చదివించుకుంటూనే రాజధానిపై జరుగుతున్న కుట్రలకు వ్యతిరేకంగా రోడ్డెక్కారు. క్షేత్రస్థాయిలో మహిళలను కదిలించి ఉద్యమాన్ని పదునెక్కించారు. ఐదేళ్లపాటూ ఉద్యమాన్ని అగ్రపథాన నిలిపి కొనసాగించారు.

దళిత జేఏసీ నేతగా


అంకం సువర్ణ కమల

తుళ్లూరు గ్రామానికి చెందిన దళిత మహిళ. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి ఉద్యమ నేతగా ఎదిగారు. అమరావతి దళిత జేఏసీ నేతగా ఎదిగారు. దళితవాడల్లో చైతన్యాన్ని రగుల్కొల్పి అమరావతి ఉద్యమ అగ్రభాగాన వారిని నిలపడంలో ఆమె కీలకంగా నిలిచారు. పాదయాత్రలో నడిచి తమ త్యాగాలను ప్రపంచానికి చాటారు.

ఎంతోమందికి స్ఫూర్తి


రావి గంగా పార్వతి

వెలగపూడికి చెందిన రైతు కూలీ రావి గంగా పార్వతి. రాజధాని కోసం ఇవ్వడానికి సెంటు భూమి కూడా లేని నిరుపేదరాలు. వయసులో పెద్దవారు కూడా. అయినా రాజధానిపై జరుగుతున్న కుట్రలతో చలించిపోయారు. భూమిలిచ్చిన రైతులు.. తనకు పని ఇచ్చిన అన్నదాతలకు జరుగుతున్న అన్యాయాన్ని తనకు జరుగుతున్న అన్యాయంగా భావించి ఆమె ఉద్యమంలోకి వచ్చారు. ఇలా వచ్చి అలా వెళ్లడం కాదు.. ఐదేళ్లపాటు ఉద్యమంలోనే కొనసాగారు. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు.

మహిళలను చైతన్య వంతం


అరుణ

తుళ్లూరు గ్రామానికి చెందిన అరుణ. ఆమె కటుంబం రాజధాని కోసం రెండెకరాలు పొలం ఇచ్చారు. రాజధానిపై జరిగిన కుట్రల నేపథ్యంలో ఆమె ఉద్యమంలోకి వచ్చారు. సాధారణ గృహిణిగా ఉన్న ఆమె ఉద్యమ ప్రభావంతో చైతన్యం పొందారు. ఎందరో మహిళలను చైతన్యవంతం చేసి ఉద్యమంలోకి తీసుకువచ్చారు.

24,25 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె

● ఉద్యోగ సంఘాల వెల్లడి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24,25వ తేదీల్లో దేశవ్యాప్తంగా జరిగే బ్యాంకుల సమ్మెను విజయవంతం చేయాలని పలువు రు ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం సాయంత్రం ఒంగోలు నగరం నెల్లూరు బస్టాండులోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యజమాన్యాలు అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయన్నారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకులు ఐదు రోజులు పనిదినాలు కల్పించాలని కోరారు. బ్యాంకు యూనియన్లు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా ఈనెల 24,25తేదీల్లో సమ్మెను చేపడుతున్నట్లు తెలిపారు. గత కొంతకాలంగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. డిమాండ్లు సాధించుకునేంత వరకు ఉద్యమం జరుగుతుందని చెప్పారు. అందులో భాగంగానే దశల వారీగా జరిగే ఆందోళన కార్యక్రమాల్లో బ్యాంకు ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కన్వీనర్ రాజీవ్ రత్నదేవ్, శ్రీనివాసరావు, సుబ్బారావు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంటకు బీఎన్ పరామర్శ

సంతనూతలపాడు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని శుక్రవారం చెన్నైలోని ఆయన స్వగృహంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి కాసేపు మాట్లా డారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


మాగుంటను కలిసిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్, నాయకులు

ప్రియురాలిని మోసగించిన ప్రియుడు

చీరాల బస్టాండ్‌లో అర్ధరాత్రి వివాదం
పోలీసుల రంగ ప్రవేశం
తీసుకున్న డబ్బులు చెల్లించేందుకు అంగీకారం

చీరాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించానని నమ్మించి హైదరాబాదు అమీర్‌పేటకు చెందిన యువతిని చీరాల ప్రాంతంలోని పందిళ్లపల్లికి చెందిన యువకుడు మోసగించాడు. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పందిళ్లపల్లికి చెందిన వ్యక్తి కొంతకాలం హైదరాబాదులో జాబ్ కన్సల్టెన్సీ నిర్వహించాడు. ఈక్రమంలో అమీర్‌పేటకు చెందిన యువతితో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. ఈనేపథ్యంలో ఏడాదిపాటు చీరాల్లో సహజీవనం కూడా చేశారు. అయితే ఆమెను మోసగించి చీరాల నుంచి పంపించి వేశాడు. ఈక్రమంలో ఆమె వద్ద నుంచి జాబ్ ఇప్పిస్తానంటూ రూ. 15 లక్షలు వరకు వసూలు చేశాడు. అవి తిరిగి చెల్లించకపోవడంతో శుక్రవారం హైదరాబాదు నుంచి చీరాల బస్టాండ్‌కు చేరుకున్న ప్రియురాలికి, ప్రియుడికి వివాదం జరిగింది. దీంతో పెద్ద ఎత్తున జనం గుమికూడారు. అయితే పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో ప్రియుడు మెత్తబడి డబ్బులు చెల్లించేందుకు ఒప్పుకున్నాడు. ఈక్రమంలో పోలీసులు వివరాలు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

పొన్నలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మం డలంలోని తిమ్మపాలెం గ్రామంలో టీడీపీ మం డల ప్రధాన కార్యదర్శి మోరబోయిన మాల్యాద్రి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాలు, ముచ్చు మాల్యాద్రి, ముచ్చు ఆదెయ్య, బి.మాలకొండారెడ్డి, ఎం.మల్లికార్జున, దాసరి కొం డలరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

నాగులుప్పలపాడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాద వశాత్తు క్యాండిల్ మంటలు దుప్పటికి అంటుకొని మం చంపై నిద్రిస్తున్న వృద్ధుడు గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కనపర్తిలో చోటు చేసుకొంది. మండలంలోని కనపర్తి గ్రామం దళితకాలనీకి చెందిన మంచు శేషయ్య (76) మూడు రోజుల క్రితం తన ఇం ట్లో క్యాండిల్ వెలిగించి మంచం పక్కన ఉంచి నిద్రించారు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు క్యాండిల్ మంచంపై పడి మంటలు చెలరేగి శేషయ్య గాయపడంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

10న పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

సంతనూతలపాడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పేర్నమిట్టలోని ఒంగోలు-1వ వేలంకేంద్రంలో ఈనెల 10న ఉదయం 8-30 గంటకు పొగాకు కొనుగోళ్లు ప్రారంభమవుతాయని వేలంకేంద్ర నిర్వహణాధికారి రవికాంత్ శుక్రవారం తెలిపారు. వేలంకేంద్రం పరిధిలో 2,811 బ్యార న్‌లకు 11.8 మిలియన్ కేజీల పొగాకు సాగుకు అనుమతించినట్ల పేర్కొన్నారు.


చినగంజాం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

ఎత్తిపోతల పథకాల పరిశీలన

చినగంజాం, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు, చినగంజాం ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాలను రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ రిటైర్డ్ డీఈ ఎం.వై. సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు కడవకుదురు ప్రాంతంలోని ఐదు ఎత్తిపోతల పథకాలను, సోపిరాల ప్రాంతంలోని చినగంజాం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించినట్లు సత్యనారాయణ తెలిపారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణ ఎలా ఉంది, విద్యుత్ మోటర్ల పరిస్థితి, ఆయకట్టు ఎంత, మరమ్మతులు, కాలువల పరిస్థితి తదితర విషయాలను ఆయన రైతులు, నిర్వహణ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కడవకుదురు గ్రామంలో నూతన ఎత్తిపోతల పథకానికి సంబంధించి పరిశీలన చేసినట్లు తెలిపారు. ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన మోటార్ల మరమ్మతులు, నూతన మోటర్లు, కాలువలకు కావలసిన పైపులు తదితర వాటికి అంచనాలు తయారు చేసి ఎమ్మెల్యే ఏలూరికి అందజేయనున్నట్లు తెలిపారు. ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించి ప్రభుత్వ నిధులతో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలనే ధ్యేయంతోనే ఎత్తిపోతల పథకాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న విధానాలలో భాగంగా బ్యాంకుల ద్వారా రైతులకు వడ్డీలేని రుణాలను అంద జేసి ఎత్తిపోతల పథకాల నిర్వహణను అప్పగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, సంతరావూరు డీసీ ఉపాధ్యక్షుడు డి.రామకృష్ణ, ఎత్తిపోతల పథకాల అధ్యక్షులు, సభ్యులు, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పంపిణీ చేసిన పరీక్షా సామగ్రితో పూర్వవిద్యార్థులు

విద్యార్థుకు పరీక్షా సామగ్రి పంపిణీ

మార్టూరు,మార్చి7(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్లో శుక్రవారం 10 వతరగతి విద్యార్థులకు రూ. 12 వేల రూపాయలు విలువచేసే పరీక్షా సామాగ్రిని 1995-96 సంవత్సరం పూర్వ విద్యార్థులు పంపిణీ చేశారు. పరీక్ష రాసే ప్యాడ్, పెన్నులు, కొన్ని గైడ్ పుస్తకాలు తదితర సామగ్రిని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోగినేని బాలకృష్ణ, పూర్వవిద్యార్థులు సర్దార్ పాపారాయుడు, డి. వెంకటరావు, ఎస్ మార్క్, కె. నాగేశ్వరరావు, పి. వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


కోటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

అద్దంకి, మార్చి7(ఆంధ్రజ్యోతి): ఇంటి కోసం తీసుకున్న రుణం తీర్చ లేక పోవడం, అదే మయంలో కుమార్తె ప్రేమ వివాహం చేసుకుందన్న మనో వ్యథకు గురైన ధనరాజుపల్లి కోటేశ్వరరావు(37) అనే వ్యక్తి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెంకు చెందిన కోటేశ్వరరావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఏడాది క్రితం బ్యాంక్‌లో రుణం తీసుకొని ఇంటి నిర్మాణం చేశాడు. ఐదు నెలల క్రితం కుమార్తె ప్రేమ వివాహం చేసుకుంది. అప్పు తీర్చే దారి లేక, కూతురు ప్రేమ వివాహం జీర్ణించుకోలేక పోయిన కోటేశ్వరరావు మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం భార్య మరియమ్మ బయట దుకాణం వద్దకు వెళ్లి వచ్చే లోపు ఇంట్లో లోపల గడియ పెట్టుకొని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. మరియమ్మ వచ్చి చూడగా తలుపు వేసి ఉంది. బలవంతంగా తలుపు తీసి చూడగా ఉరివేసుకొని ఉన్నాడు. వెంటనే అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకుపోగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


పున్నబాబు (50)

బల్లికురవ. మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గొర్రెపాడు జంక్షన్ సమీపంలో ఉన్న వైన్ షాపు వద్ద రోడ్డు దాటుతున్న జంద్రాజుపల్లి పున్నబాబు (50) ను కారు ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు గొర్రెపాడు గ్రామానికి చెందిన జంద్రాజుపల్లి పున్నబాబు గ్రామానికి సమీపంలో ఉన్న వైన్ షాపునుంచి రోడ్డు పైకి రాగా గొర్రెపాడులోని వెలమవారిపాలెం రోడ్డులో శౌరి అను శివ భక్తుడు కారుతో ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన పున్నబాబు అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రమాద స్థలాన్ని బల్లికురవ పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేశారు.

ఆటో ఢీ కొని సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి : సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆటో ఢీ కొనటంతో గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి మండలం వెంపరాలకు చెందిన మందా కోటేశ్వరరావు శుక్రవారం సాయంత్రం సైకిల్‌పై కలవకూరు రోడ్డులోకి వస్తుండగా అద్దంకి నుంచి కలవకూరు వైపు వెళ్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కోటేశ్వరరావును 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.


తీవ్రం గాయ పడిన మందా కోటేశ్వరరావు

అవీ..ఇవీ

త్వరలో ఓఎన్‌జీసీ సర్వే


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఓఎన్‌జీసీ అధికారులు

ఇంకొల్లు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు మండల పరిధిలోని పలు గ్రామాలలో భూమిలోపల నిక్షిప్తమైన గనులు, ఆయిల్ వంటి వాటిపై సర్వేలు నిర్వహించేందుకు తహసీల్దార్ వెంకటరత్నంను శుక్రవారం ఓఎన్‌జీసీ అధికారులు కలిశారు. ఆరు నెలల పాటు మంగళగిరి నుంచి నాయుడుపేట వరకు ఈ సర్వే కొనసాగుతుందని, మండలంలో నాగండ్ల, పావులూరు, గంగవరం, ఇడుపులపాడు, భీమవరం, కొణికి గ్రామాల పరిధిలో ఈ సర్వేలు నిర్వహించనున్నట్లు ఆయన దృష్టి తీసుకెళ్లారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఓఎన్‌జీసీ సూపర్‌వైజర్లు దాసరి భరత్‌కుమార్, డీకే దీపక్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.


మృతుని భార్యకు నాలుగు లక్షల రూపాయల చెక్కును అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్ సీనానాయక్

ప్రమాద బీమా చెక్కుల అందజేత

బల్లికురవ. మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన పూసుకూరి హరిబాబు అను రైతు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ రైతు బల్లికురవ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవన జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనలో చేరి ఉన్నాడు. రెండు పథకాల్లో సభ్యుడు అయిన హరిబాబుకు రూ. నాలుగు లక్షల బీమా నగదు మంజూరు కావటంతో శుక్రవారం ఏపీజీబీ బ్యాంకు చీఫ్ మేనేజర్ సీనానాయక్ మృతుడు భార్య సునీతకు చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో రుణాలు తీసుకొన్న రైతులు తప్పనిసరిగా బీమా పథకంలో నమోదు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రవీంద్రబాబు, అసిస్టెంట్ మేనేజర్ సునీత గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.


బాలికలకు సైకిళ్ల పంపిణీలో ఎంఈవో వస్రాంనాయక్,ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు తదితరులు

బాలికలకు సైకిళ్ల పంపిణీ

మార్టూరు, మార్చి7 (ఆంధ్రజ్యోతి):పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన బాలికలు రోజూ బడికి రావడానికి సైకిళ్లను పంపిణీ చేసిన ఎఫర్ట్ సంస్థ పలువురికి ఆదర్శంగా నిలిచిందని ఎంఈవో వస్రాం నాయక్ అన్నారు. శుక్రవారం మార్టూరు జడ్పీ హైస్కూల్లో ఎఫర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏకం అమెరికా సంస్థ ఆర్థిక సహకారంలో చేయూత ప్రాజెక్ట్‌ద్వారా 50 మంది బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహన రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో దూరప్రాంతాల నుంచి బడికి వచ్చే బాలికల కోసం ఏకం సంస్థ సైకిళ్ల పంపిణీకి రూప కల్పన చేసిందన్నారు. గతంలోనే 50 సైకిళ్లను పంపిణీ చేయగా ప్రస్తుతం మరో 50 సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు, రోటరీ సభ్యులు గుండవరపు వెంకట ప్రసాద్, ఉపాధ్యాయులు యం. ఈశ్వరప్రసాద్, పార్వతి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కాలిపోయిన సుబాబుల్ తోట

నాలుగు ఎకరాల్లో సుబాబుల్ తోట దగ్ధం

బల్లికురవ. మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ప్రమాదవశాత్తు నాలుగు ఎకరాల్లోని సుబాబుల్ తోటలు శుక్రవారం అగ్నికి అహుతి అయ్యాయి. ఉప్పుమాగులూరు నుంచి కొణిదెన వైపు వచ్చే రోడ్డు పక్కన ఉన్న అమరనేని భార్గవ్, అయినాల యేగేశ్వరరావు, దేవినేని చౌదరయ్య అను రైతులకు చెందిన నాలుగు ఎకరాల సుబాబుల్ తోటలలో మంటలు చెలరేగి పంట మెత్తం పూర్తిగా కాలిపోయింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి రోడ్డు పక్కన పడవేయటం వలనే ప్రమాదం జరిగి ఉంటుందని రైతులు అంటున్నారు. సుమారు నాలుగు లక్షల మేర నష్టం జరిగిందని బాధిత రైతులు తెలిపారు.

భౌభౌలతో బేంబేలు


పర్చూరులోని బొమ్మల సెంటర్‌లో రాత్రి సమయాల్లో రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు

మూకుమ్మడి దాడులతో ప్రజల భయభ్రాంతులు
గ్రామాల్లో పెరిగిపోయిన వీధి కుక్కలు
ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా దర్శనం
పట్టించుకోని పంచాయతీ అధికారులు

పర్చూరు, కారంచేడు, మార్చి7(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వీధి సింహాలతో(కుక్కలు)తో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మూకుమ్మడిగా దాడులకు పాల్పడటంతో ఉరుకులు పరుగులు పెడుతున్నారు. వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వీధుల్లో ఒంటరిగా రాపోకలు సాగించాలంటే కుక్కల దాడికి గురికావాల్సి వస్తుందన్న చందాన పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూచినా వీధి సింహాలు గుంపులు గుంపులుగా దర్శనమివ్వటం ఇందుకు నిదర్శనం. గడిచిన పక్షం రోజుల్లో అనేక మంది వీధి సింహాల బారిన పడి ఆసుపత్రి పాలయ్యారు. పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు మండలాల పరిధిలో సమస్య మరింత జటిలంగా మారింది..

వాహనదారులు ఉరుకుల పరుగులు


పర్చూరు - ఇంకొల్లు రోడ్డులో విచ్చలవిడిగా తిరుగుతున్న శునకాల గుంపు

వీధుల్లో ద్విచక్రవాహనాలు ప్రయాణించాలంటే హడలే అన్న చందాన పరిస్థితి ఉంది. ద్విచక్రవాహన దారులను వెంబడించి కరుస్తుండటంతో వాహనం అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు పర్చూరు - ఉప్పుటూరు, చెరుకూరు గ్రామ రహదారుల్లో అనేకం చోటుచేసుకున్నాయి. స్థానిక వైఆర్ హైస్కూల్ సమీపంలో ఇటీవల వీధి సింహాలు ద్విచక్రవాహన దారుని వెంట పడటంతో తప్పించుకునే క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం అయి ప్రాణాలు కోల్పోయాడు. పర్చూరు పరిధిలోని ఓ రెవెన్యూ అధికారి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెంటబడటంతో తప్పించుకోబోయి వాహనం అదుపుతప్పి అసుపత్రిపాలయ్యారు. పర్చూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన ఓవృద్ధురాలు రోడ్డుపై వస్తున్న తరుణంలో వీధి సింహాలు దాడిచేసి తీవ్రంగా గాయపరచటంతో అసుపత్రిపాలైంది. ఇలాంటి సంఘటలు మండలంలో అనేకం ఉన్నాయి. వీధి శునకాల దాడులతో చిన్నారులు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. పర్చూరులోని ఇందిరా కాలనీ, అంబేడ్కర్ నగర్, జయంతీ కాలనీలలతోపాటు, కారంచేడు మండలంలోని జరుబులవారిపాలెం, తిమిడితపాడు, దగ్గుబాడు, స్వర్ణ గ్రామాల్లో గేదెదూడలు వీధి శునకాల బారినపడి ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు అనేకం ఇటీవల ఉన్నాయి.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

వీధి సింహాలు బారిన పడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే అధికారులే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా ఇది తమ పనికాదన్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

రేబిస్ ఇంజెక్షన్‌కూడా అంతంత మాత్రమే

వీధి సింహాల బారిన పడి గాయాలతో ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లినా రేబిస్ వ్యాక్సిన్ అంతంతమాత్రంగానే ఉందని ప్రజలు అంటున్నారు. దీంతో గత్యంతరం లేక ప్రయివేట్ వైద్యశాలకు వెళ్లాల్సి వస్తుంది. మరో పక్క ఏది మంచికుక్కో పిచ్చికుక్కో అర్థం కాక కుక్కల దాడిలో గాయపడిన వారు ఆందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు ఇటీవల చీరాలలో ర్యాబీస్ వ్యాధి కలకలం రేపిన తరుణంలో ప్రజల్లో మరింత ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వీధి సింహాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కల దాడిలో 12 గొర్రెపిల్లల మృతి

మార్టూరు,మార్చి7(ఆంధ్రజ్యోతి):మండలంలోని ద్రోణాదుల గ్రామంలో రాగినీడి గంగయ్యకు చెందిన కొష్టంలో ఉన్న గొర్రెపిల్లలపై గురువారం అర్ధరాత్రి వీధికుక్కల మంద దాడి చేసింది.ఈ దాడిలో 12 గొర్రెపిల్లలు మృతి చెందాయి. దాదాపుగా లక్ష రూపాయలు నష్టం జరిగిందని గంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలో కుక్కల బెడద ఎ క్కువగా ఉందని, రోజూ కొష్టంలో రాత్రి సమయంలో గొర్రెలు నిద్రిస్తూ ఉంటాయని,అడపా దడపా కుక్కలు వస్తుంటాయని కానీ, ఈ విధంగా గొర్రెపిల్లలను చంపుతాయని అనుకోలేదని, వాపోయారు. ఇకనైనా గ్రామంలో కు క్కల బెడదను తొలగించాలని పంచాయతీ అధికారులను కోరారు.

అవమానాల నుంచి ఆత్మస్థైర్యంతో ముందుకు..

మహిళా దినోత్సవంలో వక్తలు

చీరాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం సమాజంలో ఎంతో మంది మహిళలు అవమానాలు ఎదుర్కొని ఆత్మస్థైర్యంతో విజయాలు సాధిస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. చీరాల నియోజకవర్గం పరిధిలో శుక్రవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈక్రమంలో సమాజంలో అబల విలువలు తెలియజేశారు. చీరాల సీఈసీ కళాశాలలో డీఎస్పీ ఎండీ మొయిన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో సీఐ శేషగిరిరావు, ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి, ఈసందర్భంగా ప్రతినిధులు ఉపాధ్యాయినులకు ఆట, పాటల పోటీలు నిర్వహించారు. స్థానిక వైఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలు జరిగాయి. అలాగే బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పేరాల ఆర్యవైశ్య కల్యాణ మండపంలోనూ జరిగాయి.


మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

మహిళలు అన్ని రంగాలలో ఉన్నతంగా ఎదగాలి

పంగులూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి):సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు అన్ని రంగాలలో ఉన్నతంగా ఎదగాలని మండల తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళాదినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ సింగారావు మట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్ఠికాహారం అందించడంతో పాటు బాలికలను బాల్యం నుంచే చదువు, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు బాలికలను ఉన్నతంగా చదివించి వారి ఎదుగుదలకు తల్లిదండ్రులు తగిన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. సాంకేతికతను అందిపుచ్చుకుని వివిధ రంగాలలో ఎదుగుతున్న మహిళలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపరాణి, గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రంను అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


పందిళ్లపల్లి హైస్కూల్లో టీచర్లకు నిర్వహిస్తున్న మెమరీ గేమ్

అధికారులు, ఉపాధ్యాయినులకు సన్మానం

అద్దంకిటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని శుక్రవారం పలు శాఖలు, కళాశాలలు, పాఠశాలలలో ఘనంగా నిర్వహించారు. మహిళ దినోత్సవం శనివారం రావడంతో పాటు ఆరోజు సెలవు అయినందున ముందస్తుగా ఆయా ప్రభుత్వ శాఖలు, విద్యా సంస్థలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఐసీడీఎస్ అద్దంకి రూరల్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఏ. కృష్ణకుమారి,ఉత్తమ ఉపాధ్యాయులు కె. రామలక్ష్మి, ఎస్. నాగమల్లిక, ఏపీవో గాయత్రిదేవిలను ఘనంగా సన్మానించారు. అలాగే మండలంలోని మైలవరం జడ్పీహెచ్‌ఎస్‌లో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళ ఉపాధ్యాయినులు వి. వెంకటలక్ష్మి, పద్మావతి, పీడీ లావణ్యలను ఘనంగా సత్కరించారు. జడ్పీహెచ్‌ఎస్ చక్రాయపాలెంలో హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయినులు పూనూరి జ్యోతి నిర్మల, కుంచాల విజయలక్ష్మిలను ఘనంగా సత్కరించారు.


అద్దంకి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా అధికారులను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


అడుసుమల్లి పంచాయతీలో పట్టపగలు వెలుగుతున్న వీధిలైట్లు

పగలే వెన్నెల

● రాత్రింబవళ్లు విద్యుత్ వెలుగులు
● అడుసుమల్లి పంచాయతీ అధికారుల తీరే వేరు

అడుసుమల్లి(పర్చూరు),మార్చి7(ఆంధ్రజ్యోతి) పర్చూరు మండలం అడుసుమల్లి పంచాయతీ అధికారుల తీరే వేరు అన్న విధంగా పరిస్థితి. పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఓ పక్క పంచాయతీ ఆదాయాన్ని పెంచి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వం చెబుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవలేదు. పొదుపుగా వాడుకోవాల్సిన విద్యుత్‌ను ఇలా దుబారా చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై వివరణ అడిగా ఇది కేవలం టెస్టింగ్ అంటూ మాటదాటేస్తున్నారు. పట్టపగలు విద్యుత్ ఇలా వృథా అవుతుంటే దాన్ని చూసిన ప్రజలు ఇదేమి విడ్డూరం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

జగన్ దిష్టిబొమ్మ దహనం

● సైకో చేష్టలు మానాలంటూ జనసైనికుల నినాదాలు

పర్చూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి) జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం స్థానిక బొమ్మల సెంటర్‌లో జనసేన ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను తగులబెట్టి నిరసన తెలిపారు. సైకో జగన్ పద్ధతి మార్చుకో అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తొలుత పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కళ్యాణ మండపంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం విజయవంతంపై పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాపట్ల జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, రాష్ట్ర మాల వేల్ఫేర్ కోఆపరేటివ్ ఛైర్మన్, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపూడి విజయ్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి జనసేనులు కృషి చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వంతో కలిసి విజయం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం జగన్ దిష్టిబొమ్మతో ర్యాలీగా బయలు దేరి పర్చూరు బొమ్మల సెంటర్‌లో దహనం చేసి నిరసన తెలిపారు.

ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శంకరశెట్టి చిరంజీవి, కఠారి సురేంద్రబాబు, కారంపూడి సందీప్‌తేజ, ఆయా మండలపార్టీ అధ్యక్షులు సాకిరి శ్రీనివాసరావు, మందపాటి కిషోర్, నారిశెట్టి ప్రవీణ్, సందు శ్రీను, రంగిశెట్టి ఆంజనేయులు, దీర్ఘాల రమేష్, కంఢా సురేంద్రబాబు, తోట మణి, అచ్చుకోలు సతీష్ తదితరులు పాల్గొన్నారు.


పర్చూరు బొమ్మల సెంటర్‌లో జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జనసేన పార్టీ నేతలు పెద్దపూడి విజయ్ కుమార్, మార్కండేయ బాబు, శంకరశెట్టి చిరంజీవి , శ్రేణులు

ముఖాముఖి

ఆధునిక టెక్నాలజీతో నేర నియంత్రణకు కృషి

- చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్



చీరాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో సైబర్, ఇతర నేరాలు పెరిగిపోయాయి. దీంతో నియంత్రణకు పోలీసు వ్యవస్థ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే పల్లె నిద్రలో భాగంగా చీరాల సబ్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రశ్న: చీరాల సబ్ డివిజన్ పరిధిలో ఎంత మంది పోలీసులు ఉన్నారు ?

జవాబు : సబ్ డివిజన్ పరిధిలో ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్సైలు, 380 మంది పోలీసు సిబ్బంది ఉన్నారు. వీరితో శాంతా భద్రతలు, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాము.

ప్రశ్న : నేర నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమిటి ?

జవాబు: ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పేట్రేగుతున్నాయి. ఈక్రమంలో వీటిపై ప్రతిరోజు 5-7 గంటల మధ్య విజిబులింగ్ పోలీస్ కార్యక్రమం నిర్వహిస్తున్నాము. ఇప్పటికే సబ్ డివిజన్ పరిధిలో 1,029 సీసీకెమెరాలు అమర్చాం. నిరంతరం నిఘా ఉంచాం. త్వరలో డ్రోన్స్ కెమెరాలు అమర్చనున్నాం.

ప్రశ్న: ఇటీవల ఛేదించిన కేసుల్లో క్లిష్టమైనది ఏది ?

జవాబు: కడప జైలు నుంచి విడుదలయిన నిందితుడు 13 రోజుల్లోనే 8 చోరీలకు పాల్పడ్డాడు. వాటిల్లో రెండు కార్లు, 6 ఇళ్లల్లో నగదు, వస్తువులు అపహరించాడు. ఈక్రమంలో అద్దంకిలో నమోదయిన కేసు క్లిష్టంగా ఉంది. అయితే జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ సూచనలతో ఆధునిక టెక్నాలజీ వినియోగించి పట్టుకున్నాం.

ప్రశ్న: ఇటీవల మీదృష్టికి వచ్చిన కొత్త తరహాకేసు ?

జవాబు: ఇటీవల చీరాల వన్‌టౌన్ పరిధిలో ఓ రిటైర్డ్ ఉద్యోగికి ముంబాయి పోలీసులమంటూ, డిజిటల్ అరెస్ట్ అంటూ వీడియో కాల్‌తో కూడిన ఫోన్ వచ్చింది. అయితే బాధితుడు చాకచక్యంగా వ్యవహరించి వెంటనే వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావును ఆశ్రయించాడు. దీంతో వీడియో కాల్ మాట్లాడిన వన్‌టౌన్ సీఐ ఒక సందర్భంలో ఆయన సైతం అవాక్కు చెందారు. ఎట్టకేలకు ఆగంతక పోలీసులను గట్టిగా వివరాలు అడగడంతో వారు ఫోన్ కట్ చేసి జంప్ చేశారు. సెల్‌ఫోన్ వినియోగదారులు వీటిపై అప్రమత్తంగా ఉండండి.

ప్రశ్న: పేరాల్లో చోటుచేసుకున్న సైబర్ క్రైమ్ కేసు వివరాలు ఏమిటి ?

జవాబు : పేరాల్లో ఓ మహిళకు జనని సురక్షపథకం నుంచి అంటూ ఫోన్‌చేసి బ్యాంకు ఖాతాలోని సుమారు రూ.1,50లక్షలు అపహరించారు. దీంతో ప్రతిష్టాత్మకంగా దృష్టి సారించిన జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఢిల్లీకు చెందిన వారిని అరెస్ట్ చేశాం.

బొబ్బేపల్లి గ్రావెల్ కొండపై మంటలు

● ఆర్పివేసిన ఫారెస్ట్ అధికారులు

మార్టూరు,మార్చి7(ఆంధ్రజ్యోతి):మండలంలోని బొబ్బేపల్లి ఫారెస్ట్ గ్రావెల్ కొండపై గురువారం రాత్రి చెలరేగిన మంటలను శుక్రవారం ఫారెస్ట్ అధికారులు ఆర్పివేశారు. వాస్తవంగా గురువారం రాత్రి మంటలు కొద్దిగా ఆగిపోయినా శుక్రవారం కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ బాబు శుక్రవారం మంటలు రేగిన కొండప్రాంతాన్ని పరిశీలించారు. ఇంకా అక్కడక్కడా కొంచెం ఉన్న నిప్పురవ్వలను సిబ్బందిచేత ఆర్పివేయించారు. కొండపైన పశుకాపరులు చేసిన పొరబాటు కారణంగా చెట్ల ఆకులకు మంటలు వ్యాపించి ఉంటాయని భావిస్తున్నామని రమేష్ బాబు తెలిపారు. అదేవిధంగా ఫారెస్ట్ కొండ ప్రాంతం సమీపంలో పొలాలు సాగుచేసుకుంటున్న రైతులతో కూడా ఆయన మాట్లాడారు. ఎవరైనా కావాలనే కొండపైన మంటలు పెట్టినట్లయితే వారి సమాచారం అటవీ అధికారులకు తెలియచేయాలన్నారు. ఇంకా కొండపై మరింతగా నిఘా పెడతామన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లు,చేమలను జాగ్రత్తగా చూసుకోవలసిన బాధ్యత ఉందన్నారు.గ్రామస్థులను కూడా చైతన్యపరచి కొండ ప్రాంతాన్ని పరిరక్షించుకుంటామన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

ఇంకొల్లు,మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 8వ తేదీ శనివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు శిబిరం ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య సేవలు అందించనున్నట్లు వారు తెలిపారు. ఇంకొల్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు కోరారు.


క్షయవ్యాధిపై అవగాహన

మార్టూరు,మార్చి7(ఆంధ్రజ్యోతి):మార్టూరు గ్రామ పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు శుక్రవారం క్షయవ్యాధిపై ప్రభుత్వ ఆస్పత్రిలోని టీబీ యూనిట్ అధికారులు, సిబ్బంది అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. క్షయవ్యాధికి గురైన వారి లక్షణాలను వివరించారు. వ్యాధి సోకిన వారు సక్రమంగా మందులను వినియోగించినట్లయతే త్వరగా కోలుకోవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు రాజశేఖర్‌బాబు, ఎ వెంకటేశ్వర్లు, ఏఎన్‌యంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మోసగించిన యువకుడిపై పోక్సో కేసు

అద్దంకి, మార్చి7(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మైనర్ బాలికను నమ్మించి మోసగించిన యువకుడిపై శుక్రవారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీస్ ల కథనం మేరకు అద్దంకి మండలంలోని గోపాలపురంకు చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని మోసగించాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 8 మార్చి 2025

ఆశావహ దృక్పథంతో ముందుకు ఉరకండి



జనాభాలోనైనా, జయపజయాలను శాసించడంలోనైనా మహిళలే కీలకపాత్ర. సంఖ్యాబలంలోనే కాదు.. అన్ని రంగాల్లోనూ మహిళలు అగ్రగామిగా నిలవాలి. అవకాశాలను మనమే సృష్టించుకోవాలి. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని అందనంత ఎత్తుకు ఎదగాలి. అవమానాలకు కుంగిపోవద్దు. ప్రతి ఒక్కరి జీవితాల్లో కష్టనష్టాలు సహజం. మహిళల విషయంలో ఇవి మరీ అధికం. అయినా వాటిని ఆత్మవిశ్వాసంతో జయించాలి. పట్టుదలతో ముందుకు కదిలితే మన జీవితంలో ప్రతి రోజు ఒక మహిళా దినోత్సవమే. విద్య, వృత్తి, వ్యాపారాల్లోనే కాదు, రాజకీయంగా కూడా మహిళలు చైతన్యవంతులు కావాలి. జీవితంలో ఎదురయ్యే ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ, కుటుంబ పోషణకు, సమాజంలో గౌరవప్రదంగా జీవించడానికి అహర్నిశలు శ్రమిస్తున్న నా తోటి మహిళామణులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ఆకాశం మన హద్దు. ముఖ్యమంత్రి చంద్రబాబు, నా భర్త ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిల సహకారంతో ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నా. ప్రతి ఒక్కరికి అవకాశాలు వస్తాయి. వాటిని అందుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు కదలండి.


- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

మార్పు.. ఇంట్లోనే మొదలవ్వాలి!

మహిళలకు సమాన హక్కులు ఇవ్వడం వేరు. ఆచరించడం వేరు. సమాన హక్కులు అనేది ఆచరణపూర్వకంగా జరిగిన నాడు నిజమైన మహిళా సాధికారత సాకారమవుతుంది. చట్టబద్ధంగా సమానహక్కులు కల్పిస్తున్నా ఆచరణలో అనేక రంగాలలో మహిళలు కేవలం ఉత్సవ మూర్తులుగా ఉంటుండగా వారి అధికారాలను కుటుంబసభ్యులైన పురుషులే అనుభవిస్తున్న పరిస్థితి ఉంది. ఇప్పుడిప్పుడే ఆ పరిస్థితులు మారుతుండటం శుభపరిణామం. అయితే మహిళలకు హక్కులు ఇవ్వటం అనేది ఇంటినుంచి ప్రారంభమైన నాడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. ఇంట్లో మహిళలను కేవలం గృహిణులుగానే చూడటం, ఆడపిల్లలకు స్వేచ్ఛ లేకుండా తల్లిదండ్రులు తమ అభీష్టం మేరకు వారిని పెంచటం కాకుండా అమ్మాయిలకు కూడా చిన్ననాటి నుంచే ఓ లక్ష్యం దిశగా ప్రోత్సహించాలి. వారికి కూడా పెద్దపెద్ద గోల్స్ నిర్దేశించి లక్ష్యసాధన దిశగా వారు స్వతంత్రంగా ప్రయత్నించేలా ప్రోత్సహిస్తే అప్పుడు అన్నిరంగాలలోను మహిళలు అద్భుతాలు చూపించగలుగుతారు. మా ఇంట్లో నన్ను అలా ప్రోత్సహించారు కనుకనే నేడు సబ్ కలెక్టరుగా మీముందు ఉండగలిగాను.



- తిరుమణి శ్రీపూజ, కందుకూరు సబ్ కలెక్టరు



● నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మగువా!

అన్ని రంగాల్లోనూ రాణిస్తున్న మహిళాలోకం

అటు కుటుంబం, ఇటు ఉద్యోగ బాధ్యతల్లో సఫలం

'ఏదైనా చెప్పాలనుకుంటే మగవాళ్లకు చెప్పండి.. ఏదైనా చేయాలనుకుంటే మాత్రం ఆడవాళ్లను అడగండి..' అని ప్రపంచ మేధావులు కీర్తించారంటే మానవ జీవితంలో మహిళల పాత్ర ఏపాటిదో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దేశానికి రాజైనా ఓ తల్లికి బిడ్డేగా.. అన్న మాటలు అమ్మ గొప్పతనాన్ని ఎల్లప్పుడూ స్తుతిస్తూనే ఉంటాయి. మహిళ లేని ఇంటిని ఊహించడం చాలా కష్టం అనేంతగా పరిస్థితులు మారిపోయాయి. ఆ రంగం.. ఈ రంగం అన్న తేడా లేదు. ప్రపంచంలో పురుషులు చేసే ప్రతి పనిని మహిళలు చేయగలిగే స్థాయికి చేరుకు న్నారు. తెగువ, గొప్పదనంలో సింహపురి మగువలు కూడా ముందు నిలస్తుండటం విశేషం. మహిళాలోకం కదంతొక్కిన సారా ఉద్యమాన్ని గుర్తుచేసుకోవడం సందర్భోచితం. ఎంతోమంది నారీమణులు రాజకీయాల్లో ఉన్నత స్థానాల్లో రాణించారు.. రాణిస్తున్నారు. ఉన్నత ఉద్యోగాల్లో కూడా తమ ప్రతిభను చాటుకుంటున్నారు. వ్యాపార సామ్రాజ్యంలో కూడా జిల్లా మహిళల పాత్ర తక్కువేమీ కాదు. ఓ వైపు కుటుంబం, మరో వైపు ఉద్యోగ, వ్యాపార బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఇటీవల మహిళల ప్రాధాన్యత జిల్లాలో క్రమేణా పెరుగుతుండడం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లా పాలనలో అనేక మంది మహిళలు కీలకంగా వ్యవహరిస్తుండటమే ఇందుకు నిదర్శనం. జిల్లా జడ్జి, అదనపు ఎస్పీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కందుకూరు సబ్ కలెక్టర్, నెల్లూరు నగర డీఎస్పీ, డీఎంహెచ్‌వో, జడ్పీ సీఈవో, ఆత్మకూరు, నెల్లూరు ఆర్డీవోలు.. ఇలా అనేక ఉన్నత స్థానాల్లో మహిళామణులు తమ ప్రతిభను చాటుకుంటు న్నారు. ఇక జిల్లాలో ఓటర్ల సంఖ్య 19.44 లక్షలు ఉండగా, ఇందులో పురుషులు 9.51 లక్షలు ఉండగా, మహిళలు 9.93 లక్షలు ఉన్నారు. అంటే పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్ల సంఖ్య 42 వేలు అధికం కావడం విశేషం. జిల్లాలో మొదట నుంచీ మహిళలంటే గౌరవం ఎక్కువగా ఉందనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. అదేవిధంగా అక్షరాస్యత విషయంలో కూడా పురుషులతో సమానంగా మహిళలు ఉన్నారు. మహిళలకు పెరుగుతున్న ప్రాముఖ్యత దృష్ట్యా ప్రభుత్వాలు కూడా వారికి పెద్ద పీట వేస్తున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వాలను శాసిస్తున్నది మహిళా లోకమే అంటే అతిశయోక్తి కాదు. ఈ కారణంతోనే మహిళలకు అనేక పథకాలను ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తుండగా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయబోతోంది. త్వరలోనే బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని అమల్లోకి తీసుకురాబోతోంది. అలానే పేదలకు మంజూరు చేసే ఇంటి పట్టా నుంచి రేషన్ కార్డు వరకూ ప్రతీ ఒక్కదాన్నీ మహిళ పేరుతోనే మంజూరు చేస్తుండడం సమాజంలో మహిళల ప్రాధాన్యతను తెలియజేస్తోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

కస్తూర్బాలో నేడు ..

నెల్లూరు (సాంస్కృతికం) : అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలు శనివారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరగనున్నాయని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో మహిళలను, పొదుపు సంఘాల మహిళలను సత్కరించడంతోపాటు బ్యాంకు లింకేజీ రుణాలు, వివిధ పథకాల కింద ఆస్తుల పంపిణీ, ప్రొసీడింగ్స్ అందజేయనున్నట్లు తెలిపారు.

వైద్య విద్యలో 'బంగార'ం!

ఆత్మకూరు విద్యార్థినికి బంగారు పతకం

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీలోని వెంకట్రావుపల్లికి చెందిన వైద్య విద్యార్థిని పందల విరాజిత ఎండీ జనరల్ మెడిసిన్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. కడపలోని రిమ్స్‌లో జనరల్ మెడిసిన్ చదువుతూ ఏన్టీఆర్ హెల్త్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎండీ జనరల్ మెడిసిన్ పరీక్షలలో 76.8 శాతం మార్కులతో విరాజిత ప్రథమ స్థానంలో నిలిచింది. ఈమె తండ్రి రాఘవరెడ్డి ఆత్మకూరు మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, తల్లి వైవి స్వరాజ్యలక్ష్మి సంగం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు అధ్యాపకురాలుగా పని చేస్తున్నారు. ఇక్కడే ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న విరాజిత ఎంబీబీఎస్‌ను భువనేశ్వర్‌లోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో అభ్యసించింది. ఈక్రమంలో జనరల్ మెడిసిన్‌లో బంగారు పతకం సాధించిన డాక్టర్ విరాజితను రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి యాదవేంద్రరెడ్డి అభినందించారు.



అవకాశం కల్పిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారు



అవకాశాలు కలిగితే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారు. ఇందుకు కుటుంబాల ప్రోత్సాహం ఎంతో అవసరం. లింగ వివక్ష లేని సమాజం కోసం తల్లిదండ్రులు కృషి చేయాల్సిన అవసరం ఉంది. చదువుపై ఉన్న శ్రద్ధ, సమాజానికి సేవ చేయాలన్న పట్టుదల, కుటుంబాల ప్రోత్సాహంతోనే ఈ హోదాకి ఎదిగాను. టెన్త్ చదివేటప్పుడే నాకు వివాహమైనా పట్టుదలతో చదివి డబుల్ పీజీ చేసి అంచలంచెలుగా ఎదుగుతూ ఈ హోదాకు వచ్చాను. ఓర్పుతో నిజాయతీగా, నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తిస్తే అన్నిటినీ అధిగమించడంతోపాటు మన గురించి మన పని తీరే మాట్లాడిస్తుంది. నేను ఉద్యోగాన్ని, కుటుంబాన్ని సమానంగా చూస్తాను. నాకున్న ఒక్కగానొక్క కొడుకు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నా. ఇప్పుడు అతను హిందూపురంలో డీఎస్పీగా పని చేస్తున్నాడు. చట్టసభలోనూ మహిళలకు ప్రాతినిధ్యం పెరగాలి. సమాజ సేవ కోసం ప్రతి మహిళ ముందుకు వచ్చి మరింత బాధ్యతగా పని చేయాలి.

- జడ్పీ సీఈవో విద్యారమ



నగరంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వైద్య ఆరోగ్య శాఖలో ప్రత్యేక గుర్తింపు

వైద్య ఆరోగ్య శాఖలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వైద్యులతో పాటు వైద్య సిబ్బంది కూడా ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. పురుషులతో పోటీగా మహిళలు తమ వృత్తుల పట్ల అంకిత భావంతో పని చేస్తున్నారు. ప్రత్యేకించి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వలంటీర్లు వైద్యసేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇది శుభపరిణామం. అనేక వ్యాధులను నివారించబంలో మహిళలు అందిస్తున్న సేవలు ఆదర్శనీయం.



- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

రైతులల్లారా.. మద్దతు ధర పొందండి!

- తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దు
- కొనుగోళ్లకు 300 కేంద్రాల ఏర్పాటు
- 48 గంటల్లో డబ్బులు జమ చేస్తున్న ప్రభుత్వం
- రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్లపై చర్యలు
- జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్

నెల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : 'రైతుల్లారా.. ఎవరూ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దు. మీకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పించేందుకు జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. మీకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తవు. ఎటువంటి అపోహలు లేకుండా మీరు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మీ కష్టానికి ఫలితం పొందండి' అంటూ కలెక్టర్ ఓ ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. రైతుకు కనీస మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. అందులో భాగంగా 300 కేంద్రాల ఏర్పాటుతో పాటు లక్ష గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచాం. రానున్న రోజుల్లో మరిన్ని బ్యాగు లను అందు బాటులోకి తీసు కొస్తాం. జిల్లాలో ఉన్న 105 మిల్లుల నుంచి రూ.20 కోట్ల బ్యాంకు గ్యారెంటీలు తీసుకున్నాం. రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం తీసుకోవాలని మిల్లర్లకు సూచించాం. ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే ప్రభుత్వం రైతు ఖాతాలో డబ్బులు జమ చేస్తోంది. దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దు' అంటూ కలెక్టర్ సూచించారు.

ధాన్యం నిల్వ కోసం

ఒకవేళ రైతులు ధాన్యం నిల్వ చేసుకోవాలంటే జిల్లాలో 40 చోట్ల సహకార శాఖ గోదాములు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వీటితోపాటు అవసరమైతే మార్కెటింగ్ యార్డులను కూడా రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రతి కేంద్రంలో అధికా రులకు బాధ్యతలు అప్పగిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. తేమ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని మిల్లర్లకు సూచించామని, కొంచెం అటుఇటు ఉన్నా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చామని ఆనంద్ చెప్పారు. అనంతరం మిల్లర్లతో కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ సమావేశ మయ్యారు.



చికెన్ వంటకాల మేళాకు తరలివచ్చిన జనం

కోళ్లకు వ్యాధుల్లేవ్.. ఆరగించేయండి!

- కోళ్ల పెంపకానికి సబ్సిడీ రుణాలిస్తాం
- చికెన్ మేళాలో కలెక్టర్ ఆనంద్



చికెన్ తింటున్న కలెక్టర్, జేసీ

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కోళ్లకు ఎలాంటి వ్యాధులు లేవని, మంచి పోషక విలువలు కలిగిని చికెన్‌ను అందరూ తినాలని కలెక్టర్ ఆనంద్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో జిల్లా పశుసంవర్ధక శాఖ, నేషనల్ ఎగ్, పౌల్ట్రీ బ్రీడర్స్ కోఆర్డినేషన్, జిల్లా పౌల్ట్రీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బర్డ్ ఫ్లూ వ్యాధిపై అవగాహన, చికెన్ వంటకాల మేళాను జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలో 40 శాతం కోళ్ల పెంపకం పడిపోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. కోళ్ల పెంపకానికి రైతులు ముందుకు వస్తే ప్రభుత్వం ద్వారా సబ్సిడీ రుణాలు అందజేస్తామమన్నారు. జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ కేసు నమోదు కాలేదని, ఎక్కడైనా ఆ లక్షణాలు కనిపిస్తే రెడ్‌జోన్‌గా ప్రకటించి అది విస్తరించకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎగ్ ట్రేడర్స్, చికెన్ బ్రీడర్స్ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. అనంతరం అందరితో కలిసి చికెన్ వంటకాలను రుచి చూశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ జేడీ రమేష్‌నాయక్, డీడీలు సోమయ్య, పీవీ.సురేష్, నాగమణి, పౌల్ట్రీ అసోసియేషన్ నిర్వాహకులు, ప్రముఖులు రమేష్‌బాబు, గోపాలకృష్ణ, ప్రణీత్, వెంకటరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, ఆదినారాయణ, రాఘవరావు, బలరామనాయుడు, కృష్ణారెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు

- బిలకూట క్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు
- విజయవంతానికి కృషి చేద్దాం
- కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి పిలుపు

బిట్రగుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : బిలకూట క్షేత్రంలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9వ తేదీన ప్రారంభం కానున్నాయి. 15వ తేదీ వరకు జరిగే ఉత్సవాల కోసం అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను కావలి ఎమ్మెల్యే దుగమాటి వెంకటకృష్ణారెడ్డి, కావలి ఆర్డీవో వంశీకృష్ణ, తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎస్పై భోజ్యా స్వామి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వివిధ రకాల సేవలు సకాలంలే జరిగేలా చూస్తామని తెలిపారు. దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రవాస భారతీయులు, అమరాబచ్చు ట్రస్ట్ నిర్వాహకులు కృష్ణకుమార్, సంధ్య దంపతులు ఆలయ కార్యనిర్వాహణ, అన్నదాన సదన్ భవనాలు నిర్మించారని తెలిపారు. వీరే రూ.2 కోట్లతో పడమర రాజగోపురం నిర్మించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, పాలక మండలి మాజీ చైర్మన్ మాల్యాద్రి, టీడీపీ నాయకులు విజయ్‌కుమార్, నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, పద్మారెడ్డి, వేంకటేశ్వరరెడ్డి, రంగయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై ఈవోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

నేడు జడ్పీ సమావేశం

● వాయిదా పడే అవకాశం?

నెల్లూరు (జడ్పీ), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరగనుంది. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం ఆరుణమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో గృహ నిర్మాణం, పంచాయతీరాజ్, డ్వామా, జిల్లా గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్యశాఖలతోపాటు 2025-26 ఏడాది బడ్జెట్‌పైనా చర్చించి ఆమోదిచేలా అజెండాను రూపొందించారు. అయితే శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఎక్కువగా ఆయా కార్యక్రమాలకు హాజరు కావాల్సి ఉంది. దీంతో జడ్పీ సమావేశానికి సభ్యులు పెద్దగా హాజరయ్యే అవకాశం కనబడటం లేదు. సభకు హాజరయ్యే సభ్యుల కోరంను బట్టి సమావేశాన్ని వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రెవెన్యూ డివిజన్‌గా ఉదయగిరి

● అసెంబ్లీలో మంత్రి అనగాని వెల్లడి

ఉదయగిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరిని రెవెన్యూ డివిజన్‌గా మార్చేందుకు పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శుక్రవారం అసెంబ్లీలో వెల్లడించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కంటే ఉదయగిరి పెద్దది. ఇక్కడ రెవెన్యూ పరంగా రైతులు, ప్రజలు అనేక సమ స్యలు ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తే కొంతమేర ప్రజలకు సమస్యలు తీరుతాయనే ఆలోచనతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రతి సమావేశంలో మాట్లాడటమేగాక, అధికారుల ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం అసెంబ్లీలో మంత్రి అనగాని ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ ప్రస్తావన తీసుకురావడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒక నియోజకవర్గం.. 3 డివిజన్లు

ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో 8 మండలాలు ఉన్నాయి. సీతారామపురం, ఉదయగిరి మండలాలు ఆత్మకూరు డివిజన్, వరికుంటపాడు, కొండాపురం మండలాలు కందుకూరులోనూ, దుత్తలూరు, వింజ మూరు, కలిగిరి, జలదంకి మండలాలు కావలి రెవెన్యూ డివిజన్‌లలో ఉన్నాయి. ఆయా మండలాల్లో రైతులు, ప్రజలు వివిధ సమస్యలపై డివిజన్ కేంద్రాలకు వెళ్లా లంటే అవస్థలు పడుతున్నారు. అందులో భాగంగానే ఉదయగిరిని రెవెన్యూ డివిజన్‌గా చేయాలని మంత్రితో పాటు ప్రభుత్వానికి ఎమ్మెల్యే విన్నవించారు. ప్రభుత్వం అందుకుతగ్గట్టుగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే భూ, ఇతరత్రా సమస్యల పరిష్కారానికి శాశ్వత మార్గం చూపినట్లవుతోంది.

సక్సెస్ ఈజ్ రివెంజ్

మహిళలు సెల్ఫ్ రెస్పెక్ట్ లేకుంటే తమను తాము కోల్పోతారు. ధైర్యంగా ఉంటే తమను తాము రక్షించుకుంటూ ఏ రంగంలో అయినా రాణించగలుగుతారు. తెలంగాణలోని యాదాద్రి మాది. నాన్న లింగారెడ్డి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో నా చదువు అంతా హైదరాబాదులోనే సాగింది. అమ్మ వనజ గృహిణి. ఉన్నత స్థానంలో ఉంటేనే మహిళకు ప్రత్యేక గౌరవం ఉంటుందని చెబుతూ పెంచారు. బీటెక్ పూర్తి చేసి తొలుత ఓ ప్రైవేటు కంపెనీలో సివిల్ ఇంజనీర్‌గా పనిచేశా. 2018 నుంచి ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా అడుగులు వేశాను. సీడీపీవో ఉద్యోగం సాధించి ఆ తర్వాత గ్రూప్ పరీక్షలు రాస్తూ వచ్చాను. 2022లో ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన గ్రూప్ పరీక్షల్లో 6వ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాను. గుంటూరు జిల్లాకు చెందిన హైకోర్టు అడ్వకేట్ కల్యాణ్ చక్రవర్తితో పెళ్లి అయ్యింది. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో డీఎస్పీ ఉద్యోగం సాధించాను. రెండేళ్ల ట్రైనింగ్‌లో నా భర్త అందించిన సహకారం మరువలేనిది. ఇప్పటికీ నా ఉద్యోగం నేను సమర్థవంతంగా నిర్వహిస్తున్నానంటే అందుకు ఆయనే కారణం. మహిళలను ఎవరైనా అవమానిస్తే మనం గొప్పగా ఎదిగి చూపితే వారికి నిద్ర కూడా పట్టదు. అదే మన సక్సెస్. ప్రతి మహిళ ఉన్నత చదువులు చదువుకోవడంతోపాటు మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలి.

- పి సింధుప్రియ, నెల్లూరు నగర డీఎస్పీ



కుటుంబ సభ్యులతో డిఎస్పీ సింధుప్రియ(ఫైల్)

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

విద్యతోనే ఆడవాళ్లకు సాధికారత



విద్యతోనే ఆడవాళ్లకు సాధికారత సాధ్యమని నేను నమ్ముతాను. విద్యతోనే అవగాహన, అవకాశాలు, హక్కులు, స్వేచ్ఛ వంటి అంశాలపై పూర్తిస్థాయిలో తెలుసుకోగలం. అప్పుడే బాధ్యతాయుతంగా మెలుగుతారు. అదేవిధంగా సొంత నిర్ణయాలు తీసుకుంటారు. నేను ఈరోజు ఈస్థాయిలో ఉన్నానంటే దానికి కారణం చదువని బలంగా నమ్ముతాను. కష్టపడి చదువుకున్నాను కాబట్టే వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, వృత్తిపరంగా సంతోషంగా జీవించగలుగుతున్నా. కుటుంబ బాధ్యతల ను ఇద్దరం చూసుకుంటున్నాం. వృత్తిరీత్యా ఎక్కువ సమయం కుటుంబ సభ్యులతో గడపలేకపోతున్నప్పటికీ సమయం దొరికినప్పుడు కుటుంబమే లోకం. ముఖ్యంగా మావారు నన్ను బాగా అర్థం చేసుకుంటారు. ఆయన సహకారంతోనే సంతృప్తికరమైన ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. వృత్తిగతంగా నిజాయితీగా పనిచేయడం, అందరి సహకారంతో లక్ష్యాలను పూర్తిచేసేందుకు నూరుశాతం ప్రయత్నిస్తూ విజయం సాధిస్తున్నాను. సాంకేతికపరమైన సమస్యలు ఎదురైతే వాటిని దాచి పెట్టను. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నా. అందరి పనితీరు ఒకేలా ఉండదు కాబట్టి అర్థం చేసుకుంటూ పని గురించి అవగాహన కల్పిస్తూ, నేను నేర్చుకుంటూ లక్ష్యాలను చేరుకుంటున్నా.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

న్యూస్ బాక్స్

కందుకూరు తహసీల్దారు ఇక్బాల్ బదిలీ

● నూతన తహసీల్దారుగా లావణ్య



కందుకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి):స్థానిక తహసీల్దారు ఇక్బాల్ కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయ ఏఓగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఉలవపాడు తహసీల్దారు లావణ్యను నియమించారు. సబ్ కలెక్టరు కార్యాలయంలో ఏఓ శ్రీనివాసరావును ఉలవపాడు తహసీల్దారుగా బదిలీ చేశారు.

రైతు పనులకు ప్రాధాన్యం



మస్టర్లను తనిఖీ చేస్తున్న కందుకూరు ఏపీడీ బాబూరావు

లింగసముద్రం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది మొదటగా రైతువారీ పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కందుకూరు ఏపీడీ బాబూరావు ఆదేశించారు. శుక్రవారం చినపవని, ముత్యాలపాడులో జరుగుతున్న పంట కాలువ పూడికతీత పనులను పరిశీలించి కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. జూన్ వరకు గ్రామాలవారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టీఏ జీవీ రాఘవులు, బీఎఫ్‌టీ జక్రయ్య, ఎఫ్ఏలు రమేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కావలి రూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): గతేడాది రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గుమ్మడిబందల కొమరా జయరామయ్య (49) గురువారం రాత్రి కోలుకోలేక మరణించాడు. బెంగుళూరు సమీపంలో జరిగిన ప్రమాదంలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా జయరామయ్య తీవ్రంగా గాయ పడిన విషయం తెలిసిందే. మృతుడికి భార్య ప్రభావతి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోడిపందేల స్థావరంపై దాడి

● 11 మంది అరెస్టు

● 10ఫోన్లు, రెండు కార్ల స్వాధీనం

అల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):కోడి పందేల స్థావరాలపై ఎస్ఐ కిషోర్‌బాబు శుక్రవారం సిబ్బందితో దాడులు నిర్వహించారు. 11మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ62,740 నగదు, రెండు కార్లు, 10ఫోన్లు, ద్విచక్రవాహనం, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడి అమానుషం

కందుకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంలో ఓ వర్గం దాడి చేయడం అమానుషం అని ఇలాంటి దాడులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని విశ్వహిందూ పరిషత్ కావలి జిల్లా అధ్యక్షుడు ఉప్పుటూరి కొండపనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

వచ్చేది కాలి బూడిదయ్యాకే..

● అల్లూరులో లేని అగ్నిమాపక కేంద్రం

● ప్రమాదం జరిగితే వాహనం కావలి, నెల్లూరు నుంచి రావాల్సిందే..

అల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):వేసవికాలం సమీపిస్తుందంటే ఏ సమయం ఏ గ్రామంలో అగ్నిప్రమాదం సంభవిస్తుందో అని గ్రామస్థులు ఆందోళనకు గురవుతారు. కారణం మండలానికి సమీపంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడమే. అగ్నిప్రమాదం జరిగితే సుదూర ప్రాంతాలైన కావలి, నెల్లూరు నుంచి అగ్నిమాపక కేంద్రం నుంచి సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేసరికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. వచ్చినవారు ఉన్న మంటలను ఆర్పడం తప్ప ఇంకేమీ లాభం లేకుండా పోతుంది.

● గతేడాది జరిగిన సంఘటనలు..

మండలంలోని నార్తుమోపూరు, గోగులపల్లి, పురిణి పంచాయతీ మందిరంతో పాటు అనేక ప్రాంతాల్లో చోటు చేసుకున్నాయి. 2015లో పురిణి పంచాయతీ మందిరం గ్రామంలో విద్యుత్ తీగలు రాజుకొని షార్ట్‌సర్క్యూట్‌తో నిప్పులు చెలరేగాయి. సమీపంలోని 9పూరి గుడిసెలకు నిప్పు అంటుకోవడంతో పూర్తిగా కాలిపోయి కట్టుబట్టలతో 9కుటుంబాలు వీధినపడ్డాయి. దీనిని ఆర్పేందుకు స్థానికులు పడిన కష్టం వర్ణనాతీతం. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునే సరికే పూర్తిగా కాలిపోయి బూడిద మిగిలింది. ఇలాంటి సంఘటనలు కోకొల్లలు.

● అల్లూరులో కేంద్రం ఉండాలి..

మండలకేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే అల్లూరుతో పాటు కొడవలూరు, దగదర్తి, బోగోలు మండలాలకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రాంతాల్లో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న అరగంటలోపే ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని అరికట్టవచ్చు. ప్రస్తుతం నెల్లూరు, కావలిలోని అగ్నిమాపక కేంద్రాల నుంచి సిబ్బంది ఘటనా స్థలానికి రావాలంటే దాదాపు మూడు గంటల వ్యవధి పడుతోంది. దీంతో ప్రమాద స్థలంలో పూర్తిగా ఆస్థులు నష్టపోవాల్సి వస్తోంది. అగ్నిమాపక కేంద్రాన్ని అల్లూరులో ఏర్పాటు చేస్తే ఇలాంటి పరిస్థితి నుండి కొంత మేర బయటపడే అవకాశం ఉంది.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

ప్రమాదాలు జరుగుతున్నాయి



వేసవి సమీపిస్తే ఎన్నో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, ఏదో ఒక కారణంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని ఆర్పేందుకు అవస్థలు పడుతున్నాం. అందుబాటులో అగ్నిమాపక కేంద్రం లేక ఆస్థులను నష్టపోతున్నాం.

- దానం రజిని, జువ్వాగు లక్ష్మీపురం

తీవ్రంగా నష్టపోతున్నాం..



అగ్నిమాపక కేంద్రాలు దూర ప్రాంతాల్లో ఉండటంతో ప్రమాదం జరిగిన ఎంతోసేపటికి వాహనం రాదు. దీంతో నిప్పు ఒక దాని నుండి మరోదానికి అంటుకుంటూ తీవ్రం అవుతుంది. స్థానికంగా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే మంచిది.

- పాడేటి రాజశేఖర్, అల్లూరు

మహిళల ముందస్తు సంబరం

కావలి టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. మద్దూరుపాడు డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వేడుకల్లో మహిళా అధ్యాపకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం జరిగిన పోటీల విజేతలకు కరస్పాండెంట్ సుధీర్ నాయుడు, ప్రిన్సిపాల్ టీవీ రాఘవులు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే జేవీవీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలు కల్యాణి అధ్యక్షత జరిగిన వేడుకలో జేవీవీ సమతా విభాగం నాయకురాలు విజయమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో జేవీవీ బాధ్యులు తోట వెంకటేశ్వర్లు, డాక్టర్ రవికుమార్, ఉమాశర్మ, శారద పాల్గొన్నారు. చివరిగా స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు శ్యామల అధ్యక్షతన కలుగోళమ్మపేట హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మహిళల హక్కులపై అవగాహన కల్పించారు.

● కావలి: స్థానిక రవి నర్సింగ్ హోంలో జేవీవీ జిల్లా నాయకురాలు కల్యాణి అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేవీవీ సమతావింగ్ రాష్ట్ర నాయకురాలు విజయమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో జేవీవీ కావలి శాఖ గౌరవాధ్యక్షులు బెజవాడ రవికుమార్, అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, కార్యదర్శి గాదిరెడ్డి హరినాద్, కోశాధికారి సుబ్బరాయశర్మ, నేతలు జానకిరాం, మురళీ క్రిష్ణ, సుధాకర్ , రమణయ్య, శారద, స్వర్ణలత పాల్గొన్నారు.

● కందుకూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవ రెండురోజుల క్రీడాపోటీలు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ప్రారంభించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీనివాస్, అకడమిక్ ఇన్‌చార్జి మీరావలి, ఎంబీఏ విభాగాధిపతి పావని పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: స్థానిక స్టేట్‌బ్యాంక్ శాఖ మేనేజర్ నరేష్‌బాబు, సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కందుకూరు అత్తోట, శారదా, సంకల్ప ఆస్పత్రుల వైద్యులు మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు సౌందర్య, వాసవి, శీవిరిలు రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

● చిత్రగుంట: మహిళలను గౌరవించడం భారతీయ సంస్కృతి, సాంప్రదాయమని ఆర్ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ రెడ్డి అన్నారు. కడనూతలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వేడుకలో అపోలో ఆస్పత్రి వైద్యులు శ్రావణి రెడ్డి, కోవూరు ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారి ఎం.తేజశ్విని, ఆర్ఎస్ ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్ర జ్యోతి సన్మానించారు. కార్యక్రమంలో కళశాల ఏవో ఆర్వీ రమణారెడ్డి, అన్ని విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



కావలి: కేక్‌కట్ చేస్తున్న మహిళా అధ్యాపకులు



చిత్రగుంట: మహిళా అధికారులను సన్మానిస్తున్న ఆర్ఎస్ఆర్ అధ్యాపకులు



వలేటివారిపాలెం: పాల్గొన్న మహిళాధికారులు

ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో?



కలిగిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కలిగిరమ్మ కూడలి ప్రాంతం జనాలు, వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతం నుంచే విజయవాడ, చెన్నై, బెంగుళూరు, కందుకూరు మార్గాల వైపు నిత్యం వందలాదిమంది వాహనాల్లో ప్రయాణాలు చేస్తూ ఉంటారు. దీనికితోడు ఈ ప్రదేశం ముఖ్యమైన వాణిజ్య సముదాయం కావడంతో కూరగాయలు, పలసరుకులు, మాంసం, పండ్లు తదితర వస్తువుల కొనుగోలు దారులతో ఈ ప్రాంతం ఉదయం, సాయంత్రం వేళలో రద్దీగా ఉంటుంది. కొందరు వ్యాపార దుకాణదారులు రోడ్డుపైకి చొచ్చుక రావడంతో ప్రధాన రహదారి కుచించుకుపోయ్యింది. దీనికితోడు ఆటోలు రోడ్డుపైనే నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రం అవుతుంది. కూడలి ప్రాంతానికి కూతవేటుదూరంలో పోలీస్ స్టేషన్ ఉన్నా ట్రాఫిక్ నివారణకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశ పరీక్ష

అల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకులాల్లో చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పరీక్షలను నిర్వహించనున్నట్లు నార్తుఆములూరు మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ ప్రసన్న శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివే విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులన్నారు. అభ్యర్థులు బీసీ, ఈబీసీలు 2014-16 మధ్య జన్మించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 2013-16 మధ్య జన్మించి ఉండాలన్నారు. మండలానికి 40సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తికలిగిన అభ్యర్థులు మార్చి 15లోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

కావలి రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మద్దూరుపాడు, తుమ్మలపెంట, చెన్నయపాలెంలోని 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, 11కేవీ విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం విద్యుత్‌కు అంతరాయం ఇస్తున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 12.30వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో సరఫరా నిలిపివేస్తామన్నారు.

● కందుకూరు: పట్టణంలోని కేసరిగుంట కాలనీకి వెళ్లేదారిలో లైన్‌వర్క్ ఉన్నందున గణేష్‌నగర్, కేసరిగుంట కాలనీ, వెంగమాంబ ఫంక్షన్‌హాలు వెనుక, సింహాద్రినగర్ ప్రాంతాలలో శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని టౌన్ ఏఈ టీవీ నరసింహ్మం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అలాగే గవర్నమెంటు ఆస్పత్రి వెనుక ఉన్న సబ్ స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా జరిగే ఎల్ఐసీ, ఎస్బీఐ, పామూరు రోడ్డు, శివాలయం ఫీడర్లకు ఉదయం 7గంటల నుంచి 9వరకు సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

మత్స్యకార సొసైటీ సభ్యులు ఆర్థికంగా ఎదగాలి

● రాళ్లపాడులో చేప పిల్లలు వదిలిన సబ్ కలెక్టర్, మత్స్యశాఖ అధికారులు



చేప పిల్లలు వదులుతున్న సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, జిల్లా ఫిషరీస్ జేడీ నాగేశ్వరరావు

లింగసముద్రం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. శుక్రవారం నెల్లూరు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి ఆమె రాళ్లపాడు ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో కావలి ఫిషరీస్ సహాయ డైరెక్టర్ శ్రీనివాసులు కావలి ఎఫ్‌డీఓ లక్ష్మణ్ నాయక్, ఫిషరీస్ అసిస్టెంటు షేక్ అస్మా, రాళ్లపాడు డీఈ వెంకటేశర్లు, ఏఈ చంద్రమౌళి, ఆర్ఐ రమణయ్య, వీఆర్ఓ వినోద్, మత్స్యకార సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ బొప్పూరి సిద్దయ్య, టీడీపీ నాయకులు సోంపల్లి మనోహర్ ప్రాజెక్టు ఆయకట్టు చైర్మన్ ఏలూరి వెంకటేశ్వర్లు, మద్దాల రామారావు, గంగినేని మధు, చెంచునాయుడు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయించిన 48గంటల్లోనే నగదు జమ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ ప్రత్యూష

అల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన 48గంటల్లోనే నగదు వారి ఖాతాలో జమయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలో 13ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, తేమశాతం 17గా నమోదయ్యేలా ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీఓ రజనీకాంత్ మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని మిల్లర్ల వద్ద అధికారులను నియమించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కావలి ఏడీఏ నాగరాజు తెలిపారు. 13ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో పాల్గొని నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: రైతులు పండించిన ధాన్యంను దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. పోకూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాని శుక్రవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో కందుకూరు డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏఓ హేమంత్‌భరత్‌కుమార్, ఎంపీడీఓ నరేంద్రదేవ్, వీఆర్వో మనోజ్ పాల్గొన్నారు.

● కందుకూరు: వరి పంట వేసిన రైతులు తప్పకుండా పంట నమోదు, ఈకేవైసీ చేయించుకుని, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకుని లబ్ధిపొందాలని ఏడీఏ అనసూయ సూచించారు. మోపాడు, మహదేవపురం, పలుకూరులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. డివిజనల్ సహకార అధికారి రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేవీ సుబ్బా రావు, తహసీల్దారు ఇక్బాల్ అహ్మద్, కో ఆపరేటివ్ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ రావు, పీఏసీ ఎస్‌ల సీఈఓలు హరికృష్ణ, శ్రీతేజ, వ్యవసాయ సహాయకులు రమణయ్య, బ్రాహ్మణి పాల్గొన్నారు.

● ఉలవపాడు: మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దారు లావణ్యవేణి, మండల వ్యవసాయశాఖ అధికారి తిరుమల జ్యోతిలు చాగొల్లు రైతుసేవా కేంద్రంలో అవగాహన కల్పించారు.

● జలదంకి: బ్రాహ్మణక్రాక, చామదలలో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో వింజమూరు ఏడీఏ రామిరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో జలదంకి వ్యవసాయాధికారి శైలజ పాల్గొన్నారు.

● కలిగిరి: ఎంపీడీఓ ప్రత్యూష, వ్యవసాయాధికారి ఎంసురేష్‌బాబు, తహసీల్దారు రవీంద్రబాబులు పోలంపాడు, వెలగపాడు, కలిగిరి, 1-2, నాగసముద్రం, కృష్ణారెడ్డిపాలెం, పెద్దకొండూరు రైతుసేవాకేంద్రాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచు కల్లూరు రేష్మ, వీఏఏలు వెంకటేశ్వర్లు, కొండలరావు, అనూష, సుజాత పాల్గొన్నారు.

● కొండాపురం: ఎంపీడీఓ ఆదినారాయణ రావు కొమ్మి, గరిమెనపెంట, సాయిపేట కొనుగోలు కేంద్రాలను తహసీల్దారు కోటేశ్వరరావు, వ్యవసాయాధికారి షేక్ సైదాలతో కలిసి ఎంపీడీఓ ప్రారంభించారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి యారవ కృష్ణయ్య, ఏఈఓ ఈశ్వరాచారి, వీఏఏ లు గరిమెన పెంట, కొమ్మి పాల్గొన్నారు.



ఉలవపాడులో..

విద్యుత్ చౌర్యంపై దాడులు

95మందికి రూ.4లక్షల జరిమానా



మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ నాగేశ్వరరావు, విజిలెన్స్ ఈఈ హైమావతి తదితరులు

లింగసముద్రం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను అక్రమంగా వినియోగించడం చట్టరీత్యా నేరమని కందుకూరు విద్యుత్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.నాగేశ్వరరావు, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు హైమావతి అన్నారు. శుక్రవారం వారు శాఖల సిబ్బంది 90మందితో కలిసి 29బృందాలుగా ఏర్పడి పెదపవని, చినపవని, మొగిలిచెర్ల, వీఆర్‌కోట, అన్నెబోయినపల్లి, అంగిరేకులపాడు, ఆర్ఆర్.పాలెం, నారసింహాపురం గ్రామాల్లో దాడులు చేసి 2,865 సర్వీసులను తనిఖీ చేశారు. అనంతరం వివరాలు వెల్లడించారు. తనిఖీలో 95 మంది అక్రమంగా విద్యుత్‌ను చౌర్యం చేస్తున్నట్లు గుర్తించి రూ.4.1లక్షల జరిమానా విధించామన్నారు. దాడుల్లో డీఈ విజయ్‌బాబు, మండల ఏఈ షేక్ ఫిరోజ్, పలువురు ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గుడ్లూరులో ట్రై సైకిళ్ల పంపిణీ

కందుకూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 136 మంది వికలాంగులకు వీపీ ఆర్ ట్రస్టు ద్వారా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి దంప తులు మోటారైజ్డ్ ట్రైసైకిళ్లు అందజేస్తున్నట్లు శుక్రవారం సాయంత్రం ఎంపీ కార్యాలయం నుంచి ప్రకటనలో వెలువడింది. ఆదివారం గుడ్లూరులో నిర్వ హిం చనున్న ఆత్మీయ సమ్మేళనంలో కందుకూరు మున్సి పాలిటీలో 8మందికి, రూరల్ మండలంలో 16మందికి, ఉలవపాడు మండలంలో 38మందికి, లింగసముద్రం మండలంలో 26మందికి, గుడ్లూరులో 29మందికి, వలేటివారిపాలెంలో 19మందికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కాన్షీరాం జయంతిని జయప్రదం చేయండి

కందుకూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆశాజ్యోతి కాన్షీరాం జయంతిని ఈనెల 15న వెంగమాంబ ఫంక్షన్‌హాలులో నిర్వహి స్తున్నట్లు రాడికల్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాలు తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణను శుక్రవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బెజవాడ కొండయ్య , ముప్పవరపు కిషోర్, గేరా చిరంజీవి, హరిప్రసాద్, పొనుగోటి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం, విద్య అవసరం

• డీఎంహెచ్‌వో సుజాత

వెంకటాచలం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలంటే ఆత్మవిశ్వాసం, విద్య, ఆర్థిక స్వావలంబన అత్యంత ముఖ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాత అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు నాయకత్వపాత్ర పోషించేలా తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. అనంతరం పలువురికి శాలువాలతో సత్కరించారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. పాటలు, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, డీన్ సుజా ఎస్ నాయర్, డాక్టర్ ఆర్.మధుమతి, డాక్టర్ జీ.విజయలక్ష్మి, డాక్టర్ సాయిస్రవంతి, సీహెచ్ చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో సుజాతను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న వీఎస్‌యూ రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపాల్ విజయ

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

తోటి మహిళాలను ప్రోత్సహించాలి

• డాక్టర్ సునీత, రిజిస్ట్రార్, విక్రమ సింహపురి యూనివర్సిటీ



తోటి మహిళాలకు వీలైనంత వరకు మనవంతు సహాయం అందించి ప్రోత్సహించాలి. నా స్వయం కృషితో తొలుత పద్మావతి యూనివర్సిటీలో కౌన్సిలర్‌గా తన ప్రయాణం ప్రారంభమైంది. ఎస్వీ యూనివర్సిటీలో ఐదేళ్ల అకాడమిక్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించి ఆ తర్వాత 2009లో విక్రమ సింహపురి వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి రిజిస్ట్రార్ స్థాయికి ఎదిగాను. నా ఎదుగదలకు గురువుల సలహాలు ఎంతో తోడ్పాటునిచ్చాయి. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు ఎక్కువగా ఉన్నా నిజాయితీ, నిబద్ధతతో నా బాధ్యతలను నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నాను. ఎంత ఒత్తిడి ఉన్నా సహచర ఉద్యోగులు, సిబ్బంది సహకారం బలాన్ని ఇస్తుంది. మా తల్లిదండ్రులు, నా భర్త, కుటుంబ సభ్యులు నా వృత్తి ధర్మాన్ని అర్థం చేసుకొని సహకరిస్తున్నారు. నాకు ఒక్కడే కుమారుడు. నేను కుటుంబాన్ని, ఉద్యోగాన్ని సమానంగా చూస్తాను. నా విద్య అంతా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే సాగింది. నాకు ఏ లోటు లేకుండా నా తల్లిదండ్రులు బాగా చదివించారు. మహిళలు ఎక్కడ వెనుకడుగు వేయకుండా ధైర్యంగా ముందుకు సాగుతూ ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి. సమాజంలో ప్రతి మహిళా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును పొందాలి. ఆదిశగా వారి వృత్తుల్లో రాణించాలి.

కుష్ఠు కేసులు వస్తూనే ఉన్నాయ్!

• జిల్లాలో ఏటా కొత్త కేసులు
• వైద్యశాఖ సర్వేతో వెలుగులోకి
• తాజాగా 28 మంది గుర్తింపు
• అందుబాటులో అత్యాధునిక వైద్యం
• 2027 నాటికి నిర్మూలనే లక్ష్యం

వైద్యశాస్త్రం ఎంత అభివృద్ధి చెందినా, ఎన్ని అత్యాధునిక వైద్య విధానాలు, ఆవిష్కరణలు వెలుగులోకి వచ్చినా కొన్ని వ్యాధులు మాత్రం శతాబ్దాలుగా సమాజాన్ని పట్టిపీడిస్తూనే ఉన్నాయి. అలాంటి వాటిలో కుష్ఠు రోగం ఒకటి. జిల్లాలో ఈ చర్మవ్యాధి బారినపడేవారు ఏటా పెరుగుతూనే ఉన్నారు. కుష్ఠు నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ఏటా రెండు సార్లు సర్వే నిర్వహించి కొత్త కేసులను గుర్తిస్తోంది. రోగులకు అత్యాధునిక వైద్య చికిత్సలు అందిస్తోంది. అయితే అవగాహనలోపం, మూఢనమ్మకాలతో కుటుంబం సభ్యుల నుంచి, సమాజం నుంచి వ్యాధిగ్రస్తులు వివక్షకు, నిరాదరణకు గురవుతున్నారు.

నెల్లూరు (వైద్యం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొత్తగా కుష్ఠు వ్యాధి సోకిన వారు ఏటా వెలుగులోకి వస్తున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి నిర్మూలన కోసం 2020వ సంవత్సరం నుంచి ఏటా జనవరి, జూలై మాసాల్లో వైద్య ఆరోగ్యశాఖ సర్వే నిర్వహిస్తోంది. 2027వ సంవత్సరానికి జిల్లాలో కుష్ఠువ్యాధిని నివారించాలన్న లక్ష్యాన్ని కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నిర్దేశించడంతో ఆ దిశగా వైద్య ఆరోగ్యశాఖ కసరత్తు చేస్తోంది. చర్మంపై రెండుకు మించి మచ్చలు ఉంటే అది కుష్ఠుగా అనుమానించి వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవా లని వైద్యులు సూచిస్తున్నారు.

1875 బృందాలతో సర్వే

జిల్లా వ్యాప్తంగా కుష్ఠు వ్యాధి కొత్త కేసులు గుర్తించేందుకు ఈ ఏడాది వైద్యశాఖ 1875 బృందాలను నియమించి ఇంటింటి సర్వే చేపట్టింది. 16 రోజులు జిల్లా వ్యాప్తంగా ఉన్న 38 మండలాల్లో ఈ సర్వే సాగింది. కేంద్ర బృందం కూడా గ్రామాల్లో పర్యటించి వ్యాధిగ్రస్తులను గుర్తించింది. బాధితులతోపాటు చుట్టుపక్కల వారికి వ్యాధి సోకకుండా పెప్ (పోస్ట్ ఎక్స్‌పోజర్ ప్రొపిలాక్సిస్) చికిత్సలు అందిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా 28 కేసులను గుర్తించారు.

ఏటా వస్తున్న కొత్త కేసులు

సంవత్సరం	కొత్త కేసులు
2020-21	207
2021-22	113
2022-23	99
2023-24	75
2024-25	28

1034 మంది వ్యాధిగ్రస్తులు..

జిల్లాలో 1989లో 65,587 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ వ్యాధి నివారణకు మూడు దశాబ్దాలుగా ప్రత్యేక కృషి జరుగుతోంది. డీఎఫ్‌ఐడీ వంటి అంతర్జాతీయ సంస్థ, స్వచ్ఛంద సంస్థలు కూడా ఇందులో భాగమవుతున్నాయి. ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నాయి. ప్రభుత్వ పరంగానూ ప్రతి పీహెచ్‌సీలో వ్యాధి నివారణ మందులు అందిస్తున్నారు. మల్టీథెరపీ ట్రీట్‌మెంట్ అమలయ్యాక వ్యాధి నియంత్రణలోకి వచ్చింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 1034 మంది చికిత్స పొందుతున్నారు. అయితే కొందరిలో అవగాహన లోపం కారణంగా తగిన జాగ్రత్తలు తీసుకోక పోవడంతో ఈ వ్యాధి ఇతరులకూ సోకుతోంది. మరి కొందరిలో నిర్లక్ష్యం కారణంగా పరిస్థితి వికటించి వైకల్యానికి దారితీస్తోంది.



మనుబోలు, విడవలూరులలో సర్వే నిర్వహిస్తున్న వైద్య బృందాలు

వ్యాధి లక్షణాలు

- స్పర్శలేని మచ్చలు
- ముఖంపై మెరిసే చర్మం
- అరచేతులు, అరికాళ్లలో కండరాల బలహీనత లేదా అంగవైకల్యం
- కన్ను ఎగువరెప్పలు బలహీనంగా ఉండడం
- చేతులు, పాదాలలో నొప్పిగా అనిపించని పుండ్లు ఉండటం
- కళ్లు పూర్తిగా మూసుకుపోవటం
- చర్మం, చెవిపై బుడిపెలు ఉండటం

అత్యుత్తమ చికిత్సలు



జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఏటా రెండుసార్లు సర్వే చేపడుతున్నాం. కొత్త కేసులు వస్తునే ఉన్నాయి. వారికి వెంటనే అత్యుత్తమ చికిత్సలు అందించేలా కృషి చేస్తున్నాం. కొందరు త్వరగా కోలుకుంటున్నారు. వ్యాధి గ్రస్తులకే కాకుండా చుట్టుపక్కల వారికి వ్యాధి వ్యాపించకుండా పెప్ పేరుతో ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నాం. 2027 నాటికి కుష్ఠు నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నాము.

- డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా కుష్ఠు నివారణాధికారి



ఎంఐజీ లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న నుడా చైర్మన్, వైస్ చైర్మన్ ,అధికారులు

ఆదర్శంగా ఎంఐజీ లేఅవుట్లను తీర్చిదిద్దుతాం

• నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి
• 6నెలల్లో మౌలిక వసతులన్నీ సమకూర్చుతాం
• కావలిలో అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు

కావలి, మార్చి7 (ఆంధ్రజ్యోతి):జిలాల్లోనే ఆదర్శంగా కావలి ఎంఐజీ (మినిమమ్ ఇన్‌కం గ్రూప్) లేఅవుట్‌ను తీర్చిదిద్దుతామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డులోని ఎంఐజీ లేఅవుట్‌ను శుక్రవారం ఆయన నుడా వైస్‌చైర్మన్ సూర్యతేజ, కావలి ఆర్డీవో సన్నీ వంశీ క్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, నుడా అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు విద్యుత్, మంచినీటి సౌకర్యం, రోడ్ల మధ్య చేపట్టాల్సిన కల్వర్టులు నిర్మాణాలను గురించి వివరించారు. అక్కడకు వచ్చిన దళితవర్గాల నాయకులు ఎస్సీ, ఎస్టీలకు లేఅవుట్‌లో తక్కువ ధరలకు ప్లాట్లు కేటాయించాలని కోరారు. పొలాలిచ్చిన జమ్మలపాలెంవాసులకు సరైన ధర ఇవ్వలేదని, ఇంకా 27 మందికి పరిహారం చెల్లించలేదన్నారు. అనంతరం పోలీస్ కమాండ్‌కంట్రోల్ రూమ్ అతిథిగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో కోటంరెడ్డి మాట్లాడారు. ఎంఐజీ లేఅవుట్ మధ్యలోని ప్రయివేట్ స్థలంను తీసుకుని లేఅవుట్‌లో కలిపేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. లేఅవుట్ ప్రవేశమార్గంను 20అడుగుల నుంచి 40అడుగుల రోడ్డుగా పెంచుతామన్నారు. ప్రతి రెండు నెలలకోసారి తాను వచ్చి పనులు పరిశీలిస్తానని తెలిపారు.

• కావలిలో అక్రమ లేఅవుట్లపై చర్యలు

జిల్లాలోని అక్రమ లేఅవుట్లలో సగం కావలిలోనే ఉన్నాయని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీని వాసులు రెడ్డి తెలిపారు. ప్రభుత్వ స్థలాలను కూడా ఆక్రమించుకుని లేఅవుట్‌లలో కలుపు కున్నారని ఈ విషయంపై ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డితో మాట్లాడి తగుచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నుడా కార్యదర్శి పెంచలరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు పాల్గొన్నారు.

రంగడి బ్రహ్మోత్సవాలు రాజీ లేకుండా నిర్వహించండి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : తల్పగిరి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా, వసతుల కల్పనలో రాజీలేకుండా నిర్వహించాలని ఆలయ ఈవో, అర్చ కులను దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన కోసం ఆయన శుక్రవారం రంగనాథస్వామి ఆలయానికి విచ్చేశారు. స్వామి, అమ్మవార్లు, ప్రసన్న వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు, అర్చకులతో చర్చించారు. జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అర్చ భూమి శ్రీనివాసరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



రంగనాథస్వామి ఆలయంలో అర్చకులు, అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్

22 మంది అడ్మిన్లకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు(సిటీ), మార్చి 7(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకబడిన 22 సచివాలయాల అడ్మిన్లకు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆస్తి పన్ను వసూళ్లలో భారీ లక్ష్యం చేరుకోగలరా...? అన్న అంశంపై ఆంధ్రజ్యోతి గురువారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. సచివాలయాల వారీగా పన్ను వసూళ్లపై ఆరా తీశారు. కొందరు అడ్మిన్లు జీరో వసూళ్లు చూపడంతో నోటీసులు జారీ చేశారు. ప్రస్తుత ఏడాది పన్నులో నూరు శాతం, బకాయిలో 75 శాతం వసూలు చేసి తీరాల్సిందేనని తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



రాజరాజేశ్వరి ఆలయంలో రాహుకాల ఉద్వాపన పూజలు, అలంకారం

రాహుకాల ఉద్వాపన పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రాజ రాజేశ్వరి ఆలయంలో శుక్రవారం రాహుకాల ఉద్వాపన పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. 18 వారాలు రాహుకాల దీపాలు వెలిగించిన భక్తులు 19వ వారం ఉద్వాపన పూజలు చేస్తారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి భక్తులతో సామూహికంగా ఈ పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఉదయం అభిషేకాలు, విశేష నవావరణ పూజలు, అనంతరం అన్నప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, విశేష పూజలు, వేదపారాయణం, పల్లకీ సేవలు జరిగాయి. ఆలయ ఈవో, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

పార్టీ పేరు చెప్పి దందాలు చేస్తే చర్యలు

• ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు మాబు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌పీఐ పార్టీ పేరు చెప్పి దందాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే మాబు హెచ్చరించారు. నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్‌పీఐ నుంచి సస్పెండ్ అయిన వ్యక్తులు నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో పార్టీ పేరు చెప్పి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా రని ఆరోపించారు. పేరం శివ నాగేశ్వర రావు గౌడ్ అనే వ్యక్తి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆర్‌పీఐలో గొడవలు సృష్టించడంతో అతనిని ఆరేళ్లు పార్టీ సస్పెండ్ చేసిందన్నారు. మిరియాల వెంకట రమణయ్య అనే వ్యక్తి నిరుపేదలకు ఉద్యోగాలు, రుణాలు ఇప్పిస్తానని రూ.కోట్లు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. అతడిని గతంలోనే పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు చెప్పారు. అయినా పార్టీ పేరు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు దాసరి కమలాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బత్తల మధుసూదన్, తాటిపర్తి ప్రభాకర్, ఏ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

'పీఎంశ్రీ' నిధులు సద్వినియోగం చేసుకోవాలి

• ఏప్రిల్ ఆఖరులోపు ఖర్చు చేయండి • కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(విద్య), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలలకు విడుదలైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో శుక్రవారం సమగ్రశిక్ష అధికారులు, ఇంజనీర్లు, హెచ్‌ఎంలతో ఆయన సమీక్షించారు. పాఠశాలల్లో విద్యా నాణ్యత, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని అమలు చేస్తోందని చెప్పారు. ఆ పథకం కింద జిల్లాలో ఎంపికైన 42 పాఠశాలల్లో కెమిస్ట్రీ, కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, లైబ్రరీలు, కిచెన్ షెడ్స్, మరుగుదొడ్లు వంటి నిర్మాణాలకు రూ.5.33 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.3కోట్ల నిధులు ఖర్చయ్యాయని, మిగిలిన నిధులను ఏప్రిల్ ఆఖరిలోపు ఖర్చు చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిధులు వెనక్కు వెళ్లకూడదన్నారు. రానున్న ఐదేళ్లను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ తయారుచేసి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పథకం కింద పాఠశాలల్లో ప్లాంటేషన్, సీసీ రోడ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య, ఈఈ సుబ్బరాయులు, ఏఎంవో సుధీర్ బాబు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 13వతేదీ వరకు పొడిగించారని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈటీ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ టీ పద్మజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 2వతేదీ నుంచి ఈ నెల 6వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువుగా ప్రకటించారని, అయితే విద్యార్థుల తల్లి దండ్రుల కోరిక మేరకు గడువును పొడిగించారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, పూర్తి వివరాలకు సమీపంలోని గురుకులాల్లో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ సంస్కృతం మూల్యాంకనం ప్రారంభం

జిల్లాకు చేరిన 40వేల జవాబు పత్రాలు

నెల్లూరు(విద్య), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సంస్కృతం పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనాన్ని శుక్రవారం నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 40 వేల జవాబు పత్రాలు జిల్లాకు చేరుకున్నాయి. అధికారులు కట్టుదిట్టమైన భద్రత మధ్య వాటిని స్ట్రోరేజీ పాయింట్‌లో భద్రపరిచి మూల్యాంకనం సమయానికి అందచేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం జరగనుంది. అధ్యాపకులు ఒక్కొక్కరు రోజుకు 30 జవాబు పత్రాలు మూల్యాంకనం చేసేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా, కేఏసీ కాలేజీలో ఇంటర్‌బోర్డు అధికారులు, అధ్యాపకులతో శుక్రవారం ఆర్‌ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు సమీక్ష జరిపారు. ఈ ఏడాది స్పాట్ కేంద్రాల్లోనే స్కానింగ్ ఏర్పాటు చేసి మూల్యాంకనాన్ని త్వరతగతిన పూర్తి చేసేలా ఇంటర్‌బోర్డు శ్రీకారం చుట్టిందన్నారు. సిబ్బంది సమయ పాలన పాటిస్తూ విద్యార్థికి న్యాయం జరిగేలా మూల్యాంకనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేఏసీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, సౌత్ మోపూరు కళాశాలప్రిన్సిపాల్ ఎం విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మూల్యాంకనం విధులకు హాజరైన సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌ఐవో శ్రీనివాసులు

ఇంటర్ పరీక్షలకు 24,058 హాజరు...

ఇంటర్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ద్వితీయ సంవత్సరం మేథ మేటిక్స్-2ఏ, బోటనీ-2, సివిక్స్-2, ఒకేషనల్ థియరీ పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 24,058 మంది హాజరయ్యారు. ఆర్‌ఐవో డాక్టర్ శ్రీని వాసులు ఏడు కేంద్రాలను, డీవీఈవో 5, డీఈసీ 4, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 26 కేంద్రాలను పరిశీలించాయి.

జన ఔషధి మందులపై అవగాహన కల్పించండి

డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (హరనాథపురం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన, తక్కువ ధరకు లభించే జన ఔషధి మందులను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత సూచించారు. జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పరియోజన కార్యక్రమం జరిగింది. దీనిని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ జనరిక్ మందులపై ఎలాంటి సందేహం వద్దని, ఆ మందులు బాగా పని చేస్తాయని చెప్పారు. అన్ని రకాల వ్యాధులకు జనరిక్ మందులు లభిస్తున్నాయన్నారు. నగరంలో జనరద్దీ ఉండే ప్రాంతంలో డీసీఎంఎస్ జనరిక్ మందుల షాపు ఉండడం వల్ల ప్రజలు ఎక్కువగా వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రవికుమార్, డ్రగ్ కంట్రోల్ అధికారి వీరకుమార్‌రెడ్డి, ఫార్మసిస్ట్ జనార్దనరావు, లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.



జన ఔషధి కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుజాత తదితరులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	92
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	170
స్కిన్‌లెస్	190
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8262
వెండి కిలో ధర	రూ. 99,800
వెండి ఒక గ్రాము	రూ.102.80